సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 148
శుక్రవారం 18-8-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'


భారత్‌కు రెండు కాంస్యాలు
ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ రికర్వ్‌లో రాణించిన భారత జట్లు -15లో


సిమ్ డీలర్లకు వెరిఫికేషన్
మోసాల నివారణకే బల్క్ కనెక్షన్ల నిలిపివేత: కేంద్రం -15లో


అసెంబ్లీ సమరానికి బీజేపీ సన్నద్ధం
ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రాకపోయినా బీజేపీ ఇప్పటినుంచే ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతోంది.
వివరాలు 6లో ▸


స్వావలంబనకు చిహ్నం 'వింధ్యగిరి'
దేశీయంగా నిర్మించిన యుద్ధ నౌక 'వింధ్యగిరి' దేశ స్వావలంబనకు చిహ్నమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు.
వివరాలు 6లో ▸


ఎన్నికలయ్యే వరకూ ఆహార భద్రత!
ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ఈ ఏడాది డిసెంబర్ తర్వాతా కొనసాగించే అవకాశాలున్నాయి.
వివరాలు 6లో ▸


ఇక కన్నీళ్లేనా..?
వానలు, వరదలతో ప్రపంచంలో కొన్ని దేశాలు అల్లాడిపోతుంటే, మరికొన్ని దేశాల్లో గుక్కెడు మంచినీళ్లకి కరువు వచ్చి పడింది.
వివరాలు 6లో ▸

'వేటు' తేలినట్టే?

బీఆర్‌ఎస్‌లో 20 మందికిపైగా సిట్టింగ్‌లకు నో టికెట్

ఇప్పటికే కేసీఆర్ సంకేతాలు

రెండు, మూడ్రోజుల్లో 80 మందికిపైగా పేర్లతో బీఆర్‌ఎస్ తొలి జాబితా!

- స్థానిక కేడర్‌తో విభేదాలు, అవినీతి ఆరోపణలతో కొందరికి చెక్
- రాజకీయ పరిస్థితులు, సర్దుబాట్లు, ఇతర అవకాశాలతో మరికొందరికి..
- ఆ స్థానాల్లో కొత్తగా అవకాశం దక్కేవారికి ఇప్పటికే సమాచారం
- ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి వచ్చిన వారిలోనూ ఒకరిద్దరికి నో చాన్స్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొందరిపై వేటు పడటం ఖరారైందా? సుమారు 20–25 మందికి ఈసారి టికెట్ దక్కనట్టేనా? దీనిపై ఆయా ఎమ్మెల్యేలకు బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇప్పటికే సంకేతాలు ఇచ్చేశారా..?.. ఈ ప్రశ్నలకు బీఆర్‌ఎస్ పార్టీ, ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై సుదీర్ఘ కసరత్తు చేసిన కేసీఆర్.. జాబితాను దాదాపు ఖరారు చేశారని స్పష్టం చేస్తున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు అమెరికా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో.. రెండు మూడు రోజుల్లో సుమారు 80–90 మంది అభ్యర్థులతో బీఆర్‌ఎస్ తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని చెప్తున్నాయి. గెలుపు గుర్రాలకు ప్రాధాన్యత నిస్తూ, ఆచితూచి అభ్యర్థుల ఎంపిక జరిగినట్టు వివరిస్తున్నాయి.

ఆ సంకేతాలతోనే భేటీలు!

20మందికిపైగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ దక్కదనే సంకేతాల నేపథ్యంలో.. ఉమ్మడి జిల్లాల వారీగా ఎవరెవరిపై వేటు పడుతుందన్నది బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. తమకు అవకాశం దక్కదనే సంకేతాలు అందుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు.. చివరి ప్రయత్నంగా
మిగతా 2వ పేజీలో ▶

టికెట్లు దక్కవంటూ ప్రచారం జరుగుతున్న సిట్టింగులు (ఉమ్మడి జిల్లాల వారీగా)

- ఆదిలాబాద్: రేఖా నాయక్ (ఖానాపూర్), దుర్గం చిన్నయ్య (బెల్లంపల్లి)
- కరీంనగర్: సుంకే రవిశంకర్ (చొప్పదండి), సీహెచ్ రమేశ్ (వేములవాడ), కోరుకంటి చందర్ (రామగుండం), డాక్టర్ సంజయ్ (జగిత్యాల)
- మెదక్: చిలుముల మదన్‌రెడ్డి (నర్సాపూర్), కె.మాణిక్‌రావు (జహీరాబాద్)
- రంగారెడ్డి: బేతి సుభాష్‌రెడ్డి (ఉప్పల్)
- హైదరాబాద్: కాలేరు వెంకటేశ్ (అంబర్‌పేట), ముఠా గోపాల్ (ముషీరాబాద్)
- మహబూబ్‌నగర్: జైపాల్ యాదవ్ (కల్వకుర్తి)
- నల్లగొండ: నోముల భగత్ (నాగార్జునసాగర్), బొల్లం మల్లయ్య యాదవ్ (కోదాడ), కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి (మునుగోడు)
- వరంగల్: తాటికొండ రాజయ్య (స్టేషన్ ఘన్‌పూర్), ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి (జనగామ), నన్నపునేని నరేందర్ (వరంగల్ తూర్పు)
- ఖమ్మం: రాములు నాయక్ (వైరా), హరిప్రియ నాయక్ (ఇల్లందు)

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి బల ప్రదర్శన 2లో

'చంద్రయాన్–3'లో కీలక ఘట్టం ఆవిష్కృతం



చందమామపై అధ్యయనం కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జూలై 14న ప్రయోగించిన చంద్రయాన్‌-3 మిషన్‌లో గురువారం మధ్యాహ్నం 1.35 గంటలకు కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వ్యోమనౌకలోని ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి రోవర్ 'ప్రజ్ఞాన్'తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' విజయవంతంగా విడివడింది. ఇక జాబిల్లి ఉపరితలంపై క్షేమంగా దిగడమే తరువాయి. - 6లో

అమెరికా నుంచి తెలుగు విద్యార్థులు వెనక్కి!

- 21 మందిని ఎయిర్‌పోర్టు నుంచే తిప్పిపంపిన అక్కడి అధికారులు.. కారణాలేమిటో వెల్లడించని తీరు
- డాక్యుమెంట్లపై అనుమానమే కారణమనే అభిప్రాయం
- అప్రమత్తమైన అమెరికా తెలుగు అసోసియేషన్లు
- సోషల్ మీడియాలో పోస్టుల పరిశీలనతోనూ ఇలా జరగొచ్చని వెల్లడి.. ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో చదువుకోవడం కోసం వెళ్లిన తెలుగు విద్యార్థులను అక్కడి ఇమి గ్రేషన్/భద్రతా అధికారులు ఎయిర్‌పోర్టు నుంచే తిప్పిపంపేశారు. ఎందుకు పంపేస్తున్నారనే దానిపై అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే.. బలవంతంగా విమానం ఎక్కించి వెనక్కి పంపారు. ఇలా అట్లాంటా, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో ప్రాంతాల నుంచి 21 మందిని తిప్పిపంపినట్టు తెలిసింది. దాదాపు వారం రోజుల నుంచి ఇలా ఒకరిద్దరిని పంపేస్తున్నా..ఇప్పుడు ఒక్కరోజే 20 మందికిపైగా విద్యార్థులను వెనక్కి పంపడంతో విషయం బయటికి వచ్చిందని అమెరికాలోని తెలుగు సంఘాలు చెప్తున్నాయి. అయితే పత్రాలు, వివరాలన్నీ పరిశీలించాకే అమెరికా వీసా ఇస్తారని, అలాంటప్పుడు ఈ సమస్య ఎందుకొచ్చిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సదరు విద్యార్థుల పేర్లు, ఇతర వివరాలు ఇంకా బయటికి రాలేదు.

పక్కాగా ఏర్పాట్లు చేసుకున్నా..: అమెరికాలో ఆగస్టులో విద్యా సంవత్సరం మొదలవుతుంది. దీనికి తగ్గట్టుగానే
మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆర్టీసీ బిల్లును రాష్ట్రపతికి పంపలేదు




టీఎస్ ఆర్టీసీ బిల్లును ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపాలని గవర్నర్ తమిళిసై నిర్ణయించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని రాజ్‌భవన్ ఖండించింది. ఆర్టీసీ, ఇతర బిల్లులను న్యాయ శాఖ అభిప్రాయానికి పంపినట్టు తెలిపింది.
- వివరాలు 2లో▶

అదనంగా 1,410 ఇంజనీరింగ్ సీట్లు



ఈ విద్యాసంవత్సరం నుంచే మరో 1,410 ఇంజనీరింగ్ సీట్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఆఖరి నిమిషంలో ఈ సీట్ల భర్తీకి ప్రభుత్వం ఓకే చెప్పడంతో ఎంసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్ షెడ్యూల్‌నూ మార్చారు.
- వివరాలు 3లో▶

నన్ను కాదని.. నిన్నమొన్న వచ్చిన వారికి టికెట్లా?



కాంగ్రెస్ పార్టీని ఎన్నో సంవత్సరాలుగా నాగర్‌కర్నూల్‌లో కాపాడుకుంటూ వస్తున్నా. నన్ను కాదని నిన్న, మొన్న వచ్చిన వారికి టికెట్ ఎలా ఇస్తారు?' అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు.
- వివరాలు 2లో▶

అధికారం ఇచ్చినా ఏమీ చేయని అసమర్థులు



రాష్ట్రంలో ఒక్కసారి అధికారం ఇవ్వండని కాంగ్రెస్ అడుగుతోందని.. ఇప్పటి వరకు 11సార్లు అవకాశం ఇచ్చినా ఏమీ చేయలేని అసమర్థులు కాంగ్రెస్ నేతలని మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు.
- వివరాలు 2లో▶



ఇప్పుడు కూడా కనపడకుంటే 'విజన్ 3000' పెడతా!

ధాన్యం రవాణాకూ జీపీఎస్



- కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరే ధాన్యం దారిమళ్లకుండా కేంద్రం చర్యలు.. వాహనాలను ట్రాకింగ్ వ్యవస్థతో అనుసంధించాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశం..
- ఈ వానాకాలం నుంచే అమలు చేయాలని స్పష్టీకరణ
- రాష్ట్రంలో 2016లోనే బియ్యం రవాణా చేసే 1,150 వాహనాలకు జీపీఎస్.. కానీ నేటికీ పర్యవేక్షణ యంత్రాంగం లేక సక్రమంగా అమలుకాని వైనం

సాక్షి, హైదరాబాద్: రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం పక్కదారులు పడుతున్నట్లు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిఘా చర్యలపై దృష్టి పెట్టింది. ఇప్పటివరకు బియ్యం రవాణా వాహనాలకే పరిమితమైన జీపీఎస్ ట్రాకింగ్ విధానాన్ని ధాన్యం రవాణా విషయంలోనూ పాటించాలని నిర్దేశించింది. రైతుల నుంచి ధాన్యం సేకరణ విషయంలో కేంద్రం నిర్దేశించిన 'మినిమం త్రెషోల్డ్ పారామీటర్స్ – ఎంటీపీస్'లో భాగంగా ధాన్యం రవాణా వాహనాలన్నింటినీ జీపీఎస్‌తో అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ వానాకాలం సీజన్‌లో వచ్చే పంట నుంచే ఈ విధానం అమలు చేసేందుకు విధివిధానాలను కేంద్రం తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు పంపింది. దీంతో ధాన్యం వాహనాలకు
మిగతా 10వ పేజీలో ▶


ఎడెక్స్‌తో ఎంవోయూ కార్యక్రమంలో ఏపీ సీఎం వైఎస్ జగన్

ఉన్నత విద్యలో గేమ్ చేంజర్

- ఏపీ విద్యార్థులు ప్రపంచ స్థాయి వర్సిటీల నుంచి కోర్సులు ఉచితంగా చదివే అవకాశం
- ప్రఖ్యాత హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి సహా పలు అత్యుత్తమ వర్సిటీల నుంచి సర్టిఫికేషన్లు
- ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

12లో

'మార్గదర్శి'.. మరో 'అగ్రిగోల్డ్'..!

ఆర్థికంగా పతనం అంచున మార్గదర్శి చిట్‌ఫండ్స్

- బ్రాంచి బ్యాంకు ఖాతాల్లో నిధులు లేవు.. ప్రధాన కార్యాలయం బ్యాంకు ఖాతా కూడా ఖాళీ
- నిధులన్నీ మళ్లించేసిన యాజమాన్యం
- చందాదారులు, డిపాజిట్‌దారులకు చెల్లింపులు ప్రశ్నార్థకం -12లో


నెల్లూరులోని మార్గదర్శి కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

కస్టోడియల్ మరణంపై సీసీటీవీ ఫుటేజీ అందజేయండి



గచ్చిబౌలి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- వివరాలు 11లో

గిరిజన మహిళపై థర్డ్‌డిగ్రీ..

- రాత్రంతా ఠాణాలోనే ఉంచి చిత్రహింసలు.. ఒళ్లు కమిలేలా కొట్టారని ఫిర్యాదు
- ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన..

- వివరాలు 11లో

క్లుప్తంగా...

సంతకం పెట్టకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారు?

ఆర్టీసీ బిల్లు ఆమోదానికి గవర్నర్ తాత్సారంపై కూనంనేని



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తూ శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లుపై సంతకం పెట్టేందుకు గవర్నర్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఈ బిల్లుపై అంగీకారం తెలిపేందుకు జరుగుతున్న జాప్యం సుమారు 43వేల మందికి పైగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలను ఆందోళనకు గురి చేస్తున్నారని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన బిల్లులపై ఇప్పటికే రాష్ట్రపతి సంతకాలు చేయడంతో చట్టరూపం తీసుకున్నదని, అంతకంటే ముందే శాసనసభలో ఆమోదంపొందిన బిల్లులను గవర్నర్ ఎందుకు ఆపుతున్నారో సమాధానం చెప్పాలన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే



సాక్షి,న్యూఢిల్లీ: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి సరైన ప్రత్యామ్నాయం బీజేపీయేనని, తెలంగాణ ప్రజలు కూడా అదే నమ్మకంతో ఉన్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాదరణ పొందిన గెలుపు గుర్రాలను బీజేపీ బరిలోకి దించనుందని వెల్లడించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలేదని చెప్పారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో గురువారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ... పలు సంస్థలు చేస్తున్న సర్వేలపై తమకు నమ్మకంలేదని.. తెలంగాణ ప్రజలపైనే నమ్మకం ఉందన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 'బివెల్లంల' ప్రారంభిస్తాం

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నార్కట్‌పల్లి: లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే సంకల్పంతో 2007లో బివెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేస్తే, ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డి గూడెంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన తర్వాత మాట్లాడుతూ, బివెల్లంల ప్రాజెక్టును పూర్తిచేస్తే ఎంపీ కోమటిరెడ్డికి పేరు వస్తుందన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టు పనులు చేయడం లేదన్నారు. త్వరలో వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఎంపీ స్పష్టం చేశారు. దళితబంధు పథకాన్ని ఓట్ల కోసమే తెచ్చారని విమర్శించారు. నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కొత్త అభ్యర్థిని తీసుకొస్తోందని చెప్పారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నేతల చేరిక

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన జెడ్పీటీసీ సుమిత్ర, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జ్ఞానేశ్వర్ రెడ్డి, ఇతర నేతలు.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని, వచ్చే ఎన్నికల్లో విజయపతాకం ఎగురవేసేలా పార్టీని బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బుచ్చి రెడ్డి, భీముడు, పర్వతాలు, యాదారెడ్డి, వంశవర్ధన్ రావు, బాలస్వామి, మల్లాచారి, వేణు గోపాల్ రెడ్డి, తిరుపతయ్య తదితరులున్నారు.

మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డిని ఓడిస్తా

వచ్చే ఎన్నికల్లో ఆయనతో రూ.500 కోట్లు ఖర్చు చేయిస్తా : తీన్మార్ మల్లన్న



ఘట్‌కేసర్: మేడ్చల్‌లో మల్లారెడ్డిని ఓడించడమే తన లక్ష్యమని.. వచ్చే ఎన్నికల్లో మంత్రితో రూ. 500 కోట్లు ఖర్చు చేయిస్తానని తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ అన్నారు. శ్రీవాసవి కల్యాణ మండపంలో గురువారం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడువేల కోట్ల రూపాయల విలువ చేసే భూములను మంత్రి మల్లారెడ్డి కబ్జా చేశారని, సంవత్సరానికి 600 ఎకరాలకు రైతుబంధు తీసుకుంటున్నాడని ఆరోపించారు. పాలు, పూలు అమ్మినా మనకు కోట్లాది రూపాయలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నోటికొచ్చినట్టు హామీలిచ్చి మాట తప్పాడని, ఇచ్చిందంతా తీసుకొని ఓటేసేటప్పుడు మనం కూడా మాట తప్పాలన్నారు.

ఆర్టీసీ బిల్లును రాష్ట్రపతికి పంపలేదు

స్పష్టం చేసిన రాజ్‌భవన్
- న్యాయశాఖ కార్యదర్శి అభిప్రాయం కోసం మాత్రమే..
- న్యాయశాఖ కార్యదర్శి సిఫారసుల మేరకు తదుపరి నిర్ణయాలు



సాక్షి, హైదరాబాద్: టీఎస్ ఆర్టీసీ బిల్లు–2023ను ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్ణయించినట్టు ప్రసారమాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని రాజ్‌భవన్ ఖండించింది. ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగుల విలీనానికిగాను ఈ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విషయం తెలిసిందే. అయితే శాసనసభ కార్యదర్శి నుంచి అందిన ఆర్టీసీ బిల్లుసహా ఇతర అన్ని బిల్లులను రాష్ట్రప్రభుత్వ నియమావళి, సచివాలయ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి అభిప్రాయం కోసం పంపించినట్టు రాజ్‌భవన్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇలా పంపించడం ఎప్పుడూ జరిగేదేనని, కొత్త విషయంకాదని స్పష్టం చేసింది. ఆర్టీసీ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు అనుమతిస్తూ గవర్నర్ తమిళిసై ఆర్టీసీ సంస్థ, ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు 10 సిఫారసులు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. ఇదే తరహాలోనే గతంలో నాలుగు బిల్లులను పలు సూచనలతో గవర్నర్ ప్రభుత్వానికి తిప్పి పంపించగా, శాసనసభలో రెండోసారి ప్రభుత్వం ఆమోదించి మళ్లీ గవర్నర్‌కు తిరిగి పంపిన విషయాన్ని ప్రస్తావించింది. ఈ బిల్లుల విషయంలో గతంలో చేసిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నారా? లేదా? అన్న అంశాన్ని గవర్నర్ నిర్ధారించుకోవాలనుకుంటున్నారని పేర్కొంది. న్యాయశాఖ కార్యదర్శి సిఫారసుల ఆధారంగా ఆర్టీసీ బిల్లుసహా ఇతర బిల్లులపై గవర్నర్ తదుపరి నిర్ణయాలు తీసుకుంటారని స్పష్టం చేసింది. అవాస్తవ ప్రచారాలను నమ్మరాదని ఉద్యోగులతోపాటు ప్రజలకు రాజ్‌భవన్ విజ్ఞప్తి చేసింది.

'వేటు' తేలినట్టే?

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్‌తోపాటు కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావు తదితరులను కలుస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థికి సహకరించి, గెలుపు కోసం పనిచేయాలని.. పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తే భవిష్యత్తులో ఇతర అవకాశాలు ఇస్తామని కీలక నేతలు నచ్చజెప్తున్నట్టు సమాచారం. పోటీ అవకాశం దక్కని ఎమ్మెల్యేలను బుజ్జగించడం, సర్దుబాట్లు, ఇతర నష్ట నివారణ చర్యలపైనా కీలక నేతలకు కేసీఆర్ ఆదేశించినట్టు తెలిసింది. ఇక కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమకు టికెట్ నిరాకరణపై ఎలాంటి సమాచారం లేదని చెప్తున్నారు. ఇదే సమయంలో కొంతమంది నేతలు కేడర్‌తో భేటీలు జరుపుతూ బలప్రదర్శన ద్వారా అధిష్టానంపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక వేటుపడే సిట్టింగ్‌ల స్థానంలో అవకాశం దక్కిందనే సంకేతాలు అందుకున్న నేతలు.. ఆయా నియోజకవర్గాల్లో తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు.

వేటు వెనుక కారణాలెన్నో..

గెలుపు అవకాశాలు, ఆరోపణలు, సామాజికవర్గ సమీకరణాలు, వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలు, 2018లో కాంగ్రెస్, టీడీపీల నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరినవారు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు నల్లాల ఓదెలు (చెన్నూరు), బాబూమోహన్ (ఆందోల్), మల్కాజిగిరి (కనకారెడ్డి), ఎం.సుధీర్‌రెడ్డి (మేడ్చల్), కొండా సురేఖ (వరంగల్ తూర్పు), సంజీవరావు (వికారాబాద్), బొడిగె శోభ (చొప్పదండి)లకు కేసీఆర్ టికెట్లు నిరాకరించారు. ఈ నిర్ణయం వెనుక వారి పనితీరుతోపాటు నియోజకవర్గ పరిధిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు కీలకంగా మారినట్టు సమాచారం. కొన్నిచోట్ల ఎమ్మెల్యేల పట్ల ఎలాంటి ప్రతికూలతలు లేకున్నా.. ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలు, బలాన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థి మార్పునకు కేసీఆర్ మొగ్గు చూపినట్లు తెలిసింది. స్థానిక కేడర్‌తో విభేదాలు, అవినీతి, బంధుప్రీతి తదితరాలతో పార్టీకి జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరిని పక్కన పెట్టాలని నిర్ణయించారు. 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుంచి 12 మంది, టీడీపీ నుంచి ఇద్దరితోపాటు మరో స్వతంత్ర ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మళ్లీ టికెట్ ఇస్తామని కేసీఆర్ భరోసా ఇచ్చినా.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వారిలో ఒకరిద్దరికి టికెట్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

కొత్తగా ఎవరు?.. మారేదెవరు?

కోరుట్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుకు బదులుగా ఆయన కుమారుడు డాక్టర్ సంజయ్‌కు టికెట్ ఇవ్వొచ్చనే అంచనా ఉంది. దీనితోపాటు కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ), లక్ష్మీకాంతరావు (వేములవాడ), సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), బానోత్ మదన్‌లాల్ (వైరా)లకు కూడా కేసీఆర్ సానుకూల సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది.
- ఇక మంత్రులు కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి), తలసాని శ్రీనివాస్ యాదవ్ (సనత్‌నగర్), మల్లారెడ్డి (మేడ్చల్)లను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించాలని సీఎం భావిస్తే.. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో కొత్త పేర్లు తెరమీదకు వచ్చే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.
- కమ్యూనిస్టులతో పొత్తు కుదిరితే మునుగోడు (సీపీఐ), భద్రాచలం (సీపీఎం) వారికి కేటాయించవచ్చని.. తాండూరు, మానకొండూరు, పెద్దపల్లి, కామారెడ్డి తదితర నియోజకవర్గాలపై మలి జాబితాలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి బల ప్రదర్శన

నియోజకవర్గంలోని 8 మండలాల్లో స్థానిక నేతలతో ర్యాలీలు
- తర్వాత హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో సమావేశం
- పలువురు మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు మద్దతు ప్రకటిస్తూ తీర్మానం
- కుట్రలు నాకు కొత్తేమీ కాదు.. అధినేత కేసీఆర్‌పై నాకు నమ్మకముంది: ముత్తిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ /కుషాయిగూడ (హైదరాబాద్): నియోజకవర్గంలో అసమ్మతి నేపథ్యంలో జనగామ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బల ప్రదర్శనకు దిగారు. నియోజకవర్గంలో స్థానిక పార్టీ శ్రేణులతో ర్యాలీలు, సమావేశాలు జరపడంతోపాటు హైదరాబాద్‌లోనూ భేటీ అయ్యారు. స్థానిక నాయకత్వం తన వెంటే ఉందని చాటుకునే ప్రయత్నం చేశారు. బుధవారం హైదరాబాద్ బేగంపేటలోని ఓ హోటల్‌లో అసమ్మతి వర్గం సమావేశం కావడం, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అక్కడికి వెళ్లడంతో వాగ్వాదం జరగడం తెలిసిందే. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ అసమ్మతిని రాజేస్తున్నాడని ముత్తిరెడ్డి ఆరోపించారు కూడా. ఈ క్రమంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులు తనతోనే ఉన్నాయనేలా గురువారం బల ప్రదర్శనకు దిగారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పరిధిలో భారీ ర్యాలీలు నిర్వహించడంతోపాటు ఏకకాలంలో మీడియా సమావేశాలు పెట్టి స్థానిక నేతలతో తనకు మద్దతు ప్రకటించేలా చేశారు. తర్వాత వారందరితో హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో ఉన్న నోమా ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర నేతలు తమ మద్దతు ముత్తిరెడ్డికే ఉంటుందని ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీలన్నీ ముత్తిరెడ్డికి మద్దతు ఇస్తున్నట్టుగా చేసిన తీర్మానాల పత్రాలను ముత్తిరెడ్డికి అందజేశారు.

కావాలని అభాసుపాలు చేస్తున్నారు: ముత్తిరెడ్డి

తనపై కుట్రలు కొత్తేమీ కాదని.. ఇంతకుముందు 2014లో, 2018లోనూ కుట్రలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. తానేమిటో తెలిసిన సీఎం కేసీఆర్ రెండుసార్లు తనకే టికెట్ ఇచ్చారని.. నియోజకవర్గ ప్రజలు గెలిపించారని చెప్పారు. మల్లాపూర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ''నాటి కుట్రల పాచికలు పారకపోవడంతో తాజాగా కుటుంబ కలహాల బూచితో నన్ను అభాసుపాలు చేసేందుకు, వివాదాస్పదుడిగా చూపేందుకు ప్రయత్నిస్తున్నారు. నాకు అధినేత కేసీఆర్‌పై నమ్మకముంది. ఉద్యమ నాయకుడిగా, పార్టీ సైనికుడిగా నాకు గుర్తింపునిస్తూనే వచ్చారు. భవిష్యత్తులో కూడా నాకు ఆయన ఆశీస్సులు ఉంటాయి. ఈ సమావేశానికి సంబంధించిన అంతర్యాన్ని, నిర్ణయాలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా..'' అని తెలిపారు.

సీపీఐకి మునుగోడు.. | సీపీఎంకు భద్రాచలం!

పొత్తులో ఈ రెండు సీట్లే ఇచ్చే యోచనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- అదనంగా చెరో ఎమ్మెల్సీ పదవి కూడా
- కనీసం చెరో మూడు సీట్లు ఇవ్వాలంటున్న వామపక్షాలు
- తమను తక్కువగా అంచనా వేస్తే బీఆర్ఎస్‌కే నష్టమంటున్ననేతలు



సాక్షి, హైదరాబాద్: ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చెరో అసెంబ్లీ సీటు మాత్రమే ఇవ్వాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్టు సమాచారం. సీపీఐకి మునుగోడు, సీపీఎంకు భద్రాచలం అసెంబ్లీ స్థానాలు ఇవ్వాలని.. మిగతా అన్నిచోట్లా మద్దతు కోరాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసిన సీఎం కేసీఆర్.. రెండు అసెంబ్లీ సీట్లతోపాటు అదనంగా చెరో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం.

మూడు చొప్పున ఇవ్వాలని..

సీపీఐ, సీపీఎం పార్టీలు తొలుత చెరో 10 అసెంబ్లీ స్థానాలు అడగాలని, చివరికి చెరో ఐదు స్థానాలపై పట్టుబట్టాలని భావించాయి. ప్రస్తుత పరిస్థితుల మేరకు మూడు సీట్ల చొప్పున అయినా అడగాలని సీపీఐ, సీపీఎం నిర్ణయానికి వచ్చాయి. సీపీఎంకు పాలేరు లేదా ఖమ్మం, భద్రాచలం, మిర్యాలగూడ.. సీపీఐకి కొత్తగూడెం, హుస్నాబాద్, మునుగోడు స్థానాలు అడిగాయి. కానీ చెరో సీటు మాత్రమే ఇచ్చే యోచనలో బీఆర్ఎస్ ఉండటంతో.. అధికారిక చర్చల్లో సీపీఐ, సీపీఎం నేతలు ఎలా వ్యవహరిస్తారన్నది ఉత్కంఠగా మారింది. భద్రాచలం, మునుగోడు స్థానాలు మాత్రమే ఇస్తే.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇద్దరూ పోటీకి దూరంగా ఉండాల్సి వస్తుందని అంటున్నారు.

గెలిచే సత్తా లేకున్నా.. ఓడించే దమ్ముంది!


బీజేపీ ప్రధాన శత్రువుగా, కేంద్రం, రాష్ట్రంలో బీజేపీని ఓడించే సత్తా ఉన్న పార్టీతో కలసి ముందుకు సాగాలన్నది సీపీఐ, సీపీఎం పార్టీల ప్రధాన వైఖరి. ఈ క్రమంలోనే గతేడాది మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సీపీఐ, సీపీఎం మద్దతు ఇచ్చాయి. కలసి ప్రచారం చేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే రకంగా ముందుకు సాగాలని ఆ సమయంలో మూడు పార్టీలు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. కానీ ఎన్నికల్లో పొత్తు అంటే అసెంబ్లీ సీట్లు ఇవ్వకుండా, ఎమ్మెల్సీలు ఇస్తామంటూ బీఆర్ఎస్ నేతలు కొందరు పేర్కొనడంపై సీపీఐ, సీపీఎంలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తమతో పొత్తు పెట్టుకోవడం వల్లే మునుగోడులో బీఆర్ఎస్ గట్టెక్కిందని.. తమకు ఒంటరిగా పోటీచేసి గెలిచే సత్తా లేకున్నా, విడిగా పోటీచేసి బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టే దమ్ము ఉందని వామపక్షాల నేతలు పేర్కొంటున్నారు. తమకు రాష్ట్రంలోని సుమారు 50 నియోజకవర్గాల్లో గణనీయంగా ఓటు బ్యాంకు ఉందని, మిగతాచోట్ల కూడా కొంతమేర ఓట్లున్నాయని అంటున్నారు. తమను తక్కువగా అంచనా వేస్తే బీఆర్ఎస్‌కే నష్టమని.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి కావాలన్నా, బీజేపీకి చెక్ పెట్టాలన్నా గౌరవప్రదమైన సీట్లు ఇవ్వాల్సిందేనని ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. ఇక ఎక్కడా సీపీఐ, సీపీఎం వేర్వేరుగా పోటీ చేయొద్దని, ఒకరిపై ఒకరు పోటీకి నిలపొద్దని ఆ రెండు పార్టీలు గతంలోనే ఒక నిర్ణయానికి వచ్చాయి. ప్రస్తుతం ఈ ఐక్యతను ప్రదర్శించడం ద్వారా సీట్ల విషయంలో బీఆర్ఎస్‌పై ఒత్తిడి తేవొచ్చని వామపక్షాల నేతలు భావిస్తున్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సెక్యూరిటీ తొలగింపు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డికి గన్‌మెన్లను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించింది. ఇప్పటివరకు ఉన్న 2+2 సెక్యూరిటీని మొదట 1+1కు కుదించిన ప్రభుత్వం గురువారం నుంచి వారిని కూడా తొలగించింది. గన్‌మెన్లతో కూడిన సెక్యూరిటీ వాహనాన్ని కూడా ప్రభుత్వం తొలగించింది. పాలమూరు పోలీసులపై ఇటీవల రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 1+1 భద్రతను పంపించడంతో.. రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గతంలో ఉన్న మాదిరిగా సెక్యూరిటీ ఉంటే రండి లేదంటే వద్దు'అని చెప్పడంతో గురువారం సైబరాబాద్ పోలీసు అధికారులు సెక్యూరిటీని పంపలేదని, అలాగే ఎస్కార్ట్ కింద వెళ్లే 1+3 పోలీసు సిబ్బంది కూడా వెళ్లలేదని తెలిసింది. రేవంత్‌రెడ్డి గురువారం బయట కార్యక్రమాలు ఏవీ పెట్టుకోలేదని, ఇంట్లోనే ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వివరించాయి.

కోకాపేట భూముల్ని కారుచవకగా కొల్లగొట్టిన కేసీఆర్

వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల ట్వీట్



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ రాయించుకున్న కోకాపేట భూములను వెంటనే ప్రభుత్వపరం చేయాలని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎకరం రూ.100 కోట్ల లెక్కన రూ.1100 కోట్లను చెల్లించాలని గురువారం ట్విట్టర్ వేదికగా కోరారు. జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాల పేరిట రూ.వెయ్యి కోట్ల విలువైన 33.72 ఎకరాల భూములను రూ.3 కోట్లకే అప్పనంగా కొట్టేశారని ఆరోపించారు. ఎకరం రూ.100 కోట్లు పలికే కోకాపేటలో బీఆర్ఎస్ భవనం కోసంరూ.3.41 కోట్లకే 11 ఎకరాలు దోచేశారని పేర్కొన్నారు.

శ్రీ దశ మహా విద్యాగణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు



ఖైరతాబాద్(హైదరాబాద్): ఖైరతాబాద్ వినాయకుడు ఈ సంవత్సరం శ్రీ దశ మహావిద్యాగణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఖైరతాబాద్ గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన 69వ సంవత్సరం సందర్భంగా మహాగణపతి 63 అడుగుల ఎత్తు, 23 అడుగుల వెడల్పులో ఉండే మహాగణపతి పక్కనే కుడివైపు వరాహాదేవి, ఎడమవైపు సరస్వతిమాత విగ్రహాలు పది అడుగుల ఎత్తు ఉండగా, మహాగణపతి 63 అడుగుల ఎత్తులో నాగశేషుపై నిలబడి ఉండే ఆకారంలో తలపై ఏడు పడగలు, 10 చేతులు ఉంటాయి. మహాగణపతి పక్కన కుడివైపు 18 అడుగుల ఎత్తులో లక్ష్మీ నరసింహస్వామి, ఎడమవైపు వీరభద్రస్వామి విగ్రహాలు ఉంటాయి. శ్రీ దశ మహావిద్యాగణపతిగా నామకరణం చేయడం ప్రత్యేకతగా ఉందని దివ్యజ్ఞాన సిద్ధాంతి విఠలశర్మ తెలిపారు. అమ్మవారి ఉపాసనలో దశ మహావిద్యలు అధిక ప్రాధాన్యత కలిగినవనీ, విద్యకు గణపతి అనుగ్రహం కావాల్సి ఉన్నందున దశ మహావిద్యాగణపతిగా నామకరణం చేసినట్లు తెలిపారు.

నన్ను కాదని.. నిన్నమొన్న వచ్చిన వారికి | టికెట్లా?

కాంగ్రెస్ తీరుపై నాగం అసహనం



పంజగుట్ట: 'రాష్ట్ర రాజకీయాల్లో ఎంతో సీనియర్‌ను.. అనుభవం ఉన్న వాడిని. కాంగ్రెస్ పార్టీని ఎన్నో సంవత్సరాలుగా నాగర్‌కర్నూల్‌లో కాపాడుకుంటూ వస్తున్నా. నన్ను కాదని నిన్న, మొన్న వచ్చిన వారికి టికెట్ ఎలా ఇస్తారు?'అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. పార్టీ వ్యవహరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కేవలం ఒక వ్యక్తి పార్టీలోకి వస్తే ఏదో జరిగిపోతుందని ప్రచారం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్‌లో జగదీశ్వర్ రావు పార్టీని కాపాడుతుంటే పార్టీలోకి కొత్తగా వచ్చిన జూపల్లి కృష్ణారావు... కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, గద్వాల సీట్లు తన వారికే కావాలంటున్నాడని, ఆయన అంత పెద్ద నాయకుడు ఎప్పుడయ్యాడో అర్థం కావడంలేదన్నారు. ఇన్ని సంవత్సరాలుగా పార్టీని కాపాడుకుంటూ కేడర్‌కు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉండి, ఏ ఎన్నికలు వచ్చినా ముందుండి పార్టీని నడిపిన మేము ఏం కావాలి? ఆయన గెలిచిన తర్వాత ఇక్కడే పార్టీలోనే ఉంటారన్న నమ్మకం ఉందా..ఆ గ్యారెంటీ ఎవరిస్తారని నాగం ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి...

కాగ్ నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.48 వేల కోట్ల అవినీతి జరిగిందని నాగం జనార్దన్ రెడ్డి ఆరోపించారు. కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సి ఉండగా సీఎం కేసీఆర్ దాన్ని పక్కన పెట్టేశారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరూ, ప్రతి పార్టీ అవినీతి గురించి మాట్లాడుతోందని, అయితే ఎవరూ ప్రశ్నించడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఎంపీలు, టీపీసీసీ అధ్యక్షుడు దీనిపై తాడోపేడో తేల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై త్వరలోనే ఏసీబీ డీజీని కలసి ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

అధికారం ఇచ్చినా ఏమీ చేయని | అసమర్థులు

- కాంగ్రెస్ నేతలపై మంత్రి కేటీఆర్ ధ్వజం
- ఆ పార్టీతో వెళ్తే కుక్క తోకను పట్టుకుని గోదావరి ఈదినట్లే
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను 95 సీట్లతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపు
- తెల్లం వెంకట్రావు సహా పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిక



తెల్లం వెంకట్రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి పువ్వాడ

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో ఒక్కసారి అధికారం ఇవ్వండి అని కాంగ్రెస్ అడుగుతోంది. ఇప్పటి వరకు పది పదకొండు మార్లు అవకాశం ఇచ్చినా ఏమీ చేయలేని అసమర్థులు కాంగ్రెస్ నేతలు. వారు ఇప్పుడు ఆకాశం నుంచి ఊడిపడినట్లుగా వ్యవహరిస్తూ, పేదల కోసం పనిచేసే కేసీఆర్‌ను తిడుతున్నారు. ఎవరి వల్ల మంచి జరుగుతుందో చూడండి. ఎవరైనా డబ్బులు ఇస్తే ఏం చేయాలో ఆలోచించుకుని ఓటు మాత్రం కేసీఆర్‌కు వేయండి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో గురువారం మంత్రి సమక్షంలో కాంగ్రెస్ నేత డాక్టర్ తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా ఉన్న తెల్లం వెంకట్రావు, నెల రోజుల క్రితం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాగా, గురువారం తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన వెంకట్రావుకు, మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీతో వెళ్లడం అంటే కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లే అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'బీఆర్ఎస్ పార్టీకి మహారాష్ట్రలో అపార ఆదరణ లభిస్తోంది. రోజుకో పార్టీ విలీనంతో జాతీయ స్థాయిలో కేసీఆర్ శక్తిమంతమైన నేతగా ఎదుగుతున్నారు. బీఆర్ఎస్‌కు జాతీయ స్థాయిలో పునాది పడాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో 90 నుంచి 95 సీట్లు ఇవ్వడం ద్వారా మన నాయకుడికి కొత్త శక్తి, ఉత్సాహం ఇవ్వాలి. ఇక్కడి తీర్పు మహారాష్ట్రలో ప్రతిధ్వనించేలా మీ నిర్ణయం ఉండాలి. రేపటి రోజున కేంద్రంలో మనం లేకుండా ఎవరూ ప్రధాన మంత్రి అయ్యే పరిస్థితి ఉండదు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలు గెలిచేలా మద్దతు ఇవ్వండి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

జల్ జంగల్ జమీన్ నినాదంతో ముందుకు

గిరిజన పోరాట యోధుడు కొమురం భీం కోరుకున్న జల్ జంగల్ జమీన్ నినాదం స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణంగా కేసీఆర్‌తోనే సాధ్యమైందని, పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో మిషన్ భగీరథ, పోడు భూములకు పట్టాలు, రైతుబీమా, ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు, నక్సలైట్లు గతంలో చెప్పిన సమ సమాజ స్థాపన ప్రస్తుతం తెలంగాణలో జరుగుతోందని, పెరుగుతున్న సంపదతో పట్టణాలు, పల్లెల మధ్య అంతరం తగ్గుతోందని పేర్కొన్నారు. 60 ఏళ్లు అధికారంలో ఉన్నా, రూ.200 పింఛన్ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రూ.4 వేలు ఇస్తామని చెపుతోందని, అయితే కాంగ్రెస్ నాయకులు రూ.40 వేలు ఇచ్చినా ప్రజలు నమ్మబోరని కేటీఆర్ అన్నారు. యాదాద్రి ఆలయ స్థాయిలో భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, భద్రాచలానికి వరద ముప్పును తప్పించేందుకు కరకట్ట నిర్మిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని నాయకులు ఇప్పుడు తెలంగాణ అమర వీరులు, ఉద్యమం గురించి మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారని మంత్రి పువ్వాడ అజయ్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీలు తాతా మధు, మధుసూదనాచారి, ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఇల్లందు, కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా బీఆర్ఎస్‌లో చేరారు.

పాపపు కాంగ్రెస్.. శాపపు బీజేపీ.. | దీపంలాంటి కేసీఆర్

ఎవరు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలి: మంత్రి తన్నీరు హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి సబిత, ఎమ్మెల్యే మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం/అబ్దుల్లాపూర్‌మెట్ /మహేశ్వరం: పాపపు కాంగ్రెస్ కావాలా? శాపపు బీజేపీ కావాలా? దీపం లాంటి కేసీఆర్.. బీఆర్ఎస్ కావాలా? ప్రజలే నిర్ణయించుకోవాలని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.62.21 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం మంత్రి సబితారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మూడు గంటల కరెంట్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి అంటుంటే, వ్యవసాయ బావులకు మీటర్లు పెట్టాలని బీజేపీ అంటోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తూ ఏటా మూడు పంటలు సాగు చేసుకోమంటున్నారని గుర్తు చేశారు.

వారిని నమ్మొద్దు

ఎన్నికలు రాగానే ఇది చేస్తాం..అది చేస్తామని చెప్పే నాయకులను నమ్మొద్దని మంత్రి హరీశ్ ప్రజలకు పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజల మధ్యే ఉండే సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని కోరారు. వీఓఏలు, మెప్మా ఆర్పీల ఆటోమెటిక్ రెన్యూవల్, ఇన్సూరెన్స్, వేతన పెంపు సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీ పూర్తికాగానే, మహిళలకు రావాల్సిన వడ్డీలేని రుణాలను చెల్లిస్తామన్నారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ. కేసీఆర్ నాయకత్వంలో అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి జరుగుతోందన్నారు.

కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి

తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కేంద్రంలోని బీజేపీ సర్కార్ కాపీ కొడుతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మహేశ్వరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి రావాల్సిన రూ.35 వేల కోట్ల నిధులు మోదీ సర్కార్ ఎందుకు నిలిపేసిందో..? కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ @ 2.30 లక్షల ఎకరాలు

- ఈ ఏడాదికి సాగులక్ష్యం ఖరారు చేసిన ఉద్యానశాఖ
- ప్రోత్సాహం అందించేందుకు ముందుకొచ్చిన కేంద్రం
- అత్యధికంగా ఆయిల్‌ఫెడ్‌కు 77 వేల ఎకరాలు



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 2.30 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. ఇందుకు ప్రభుత్వం రూ.750 కోట్లు కేటాయించింది. ఉద్యాన శాఖ సాగు ప్రణాళికకు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం వేగంగా పెరిగే అవకాశముంది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో 38 నర్సరీలు ఏర్పాటు చేసిన కంపెనీలు అవసరమైన మొక్కల్ని పెంచుతున్నాయి. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి గల రైతులు ఆయా జిల్లాల ఉద్యానశాఖ అధికారులు, గ్రామాల్లోని ఏఈఓలను సంప్రదించాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

- ఆయిల్‌ఫెడ్‌కు ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు లక్ష్యాన్ని నిర్దేశించించింది. ఈ సంస్థ 8 జిల్లాల పరిధిలో 76,900 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలి. తర్వాత ప్రీ యూనిక్ కంపెనీ 7 జిల్లాల్లో 34,800 ఎకరాలు, లోహియా కంపెనీ 27,100 ఎకరాలు, రుచిసోయా 24,300 ఎకరాలు, తిరుమల ఆయిల్ కంపెనీ 14,900 ఎకరాల్లో రైతులను సాగుకు ప్రోత్సహించేలా అనుమతి ఇచ్చింది.
- జిల్లాల వారీగా సాగు టార్గెట్ చూస్తే...కరీంనగర్ జిల్లాలో 18 వేల ఎకరాలు, సిద్దిపేట జిల్లాలో 17,800 ఎకరాలు, కొత్తగూడెంలో 16,800 ఎకరాలు, పెద్దపల్లిలో 14,900 ఎకరాలు, భూపాలపల్లిలో 12,800 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారు.
- గతేడాదివరకు రాష్ట్రంలో 27 జిల్లాలకే ఆయిల్‌పామ్ సాగు పరిమితమైంది. ఈ ఏడాది కొత్తగా రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాలు ఈ జాబితాలో చేరాయి. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలను మినహాయిస్తే మొత్తం 31 జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకానుంది.
- రంగారెడ్డి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ కంపెనీ ముందుకురాగా, ఈ ఏడాది 5,500 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించారు. వికారాబాద్ జిల్లాలో హెల్తీ హార్ట్స్ కంపెనీకి 3 వేల ఎకరాలు, మెదక్ జిల్లాలో లివింగ్ కంపెనీకి 5 వేల ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో గోద్రెజ్ కంపెనీకి 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా అనుమతి ఇచ్చింది.
- రాష్ట్రం ఏర్పడే నాటికి ఆయిల్‌పామ్ సాగు కేవలం 36 వేల ఎకరాలు మాత్రమే. ప్రస్తుతానికి ఈ సాగు 1.54 లక్షల ఎకరాలకు పెరిగింది. సాగు గణాంకాల్లో దేశవ్యాప్తంగా చూస్తే తెలంగాణ రెండోస్థానంలో ఉంది.

అదనంగా 1,410 ఇంజనీరింగ్ సీట్లు

- పాలేరు, మహబూబాబాద్‌లో కొత్త కాలేజీలు
- ఐదు పాలిటెక్నిక్ కాలేజీల అప్‌గ్రేడ్
- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు



సాక్షి, హైదరాబాద్: ఈ విద్యాసంవత్సరం నుంచే మరో 1,410 ఇంజనీరింగ్ సీట్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఆఖరి నిమిషంలో ఈ సీట్ల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎంసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్ షెడ్యూల్ కూడా మార్చారు.

- మహబూబాబాద్, ఖమ్మం జిల్లా పాలేరులో కొత్తగా రెండు ఇంజనీరింగ్ కాలేజీలకు ప్రభుత్వం అనుమతించింది. ఇవి జేఎన్‌టీయూహెచ్ పరిధిలో నడుస్తాయి. వాస్తవానికి ఈ రెండు కాలేజీల్లో ఒక్కోదాంట్లో 300 వరకూ సీట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది మాత్రం సీఎస్ఈ, ఈసీఈ, సీఎస్ఈ–ఎంఎల్ కోర్సులు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు. ఒక్కో బ్రాంచ్‌లో 60 చొప్పున, ఒక్కో కాలేజీలో 180 సీట్లు అందుబాటులోకి వస్తాయి. రెండు కాలేజీల్లో కలిపి 360 సీట్లు ఉంటాయి.
- ఘట్‌కేసర్‌లోని కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి ఎంబీఏ కాలేజీకి కూడా ఇంజనీరింగ్ కోర్సులకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో ఈ కాలేజీలో ఆరు బ్రాంచ్‌లకు కలిపి 360 సీట్లు అదనంగా వస్తాయి.
- హైదరాబాద్‌లోని టీఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీని అప్‌గ్రేడ్ చేశారు. దీంతో 300 సీట్లు అదనంగా రాబోతున్నాయి.
- ఇవి కాకుండా మరో మూడుకాలేజీలకు అదనంగా సీట్లు ఇవ్వడానికి అనుమతి లభించింది. దీనికి జేఎన్‌టీయూహెచ్ అనుబంధ గుర్తింపు రావాల్సి ఉంది.
- ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. అన్నీ కలిపి 1,410 సీట్లు అదనంగా రాబోతున్నాయని ఉన్నత విద్యామండలి పేర్కొంది.

పెరిగిన సీట్లూ కంప్యూటర్ కోర్సుల్లోనే

కొత్తగా పెరిగే 1,410 సీట్లల్లో ఎక్కువగా కంప్యూటర్ కోర్సులే ఉన్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 83,766 సీట్లు కన్వీనర్ కోటా కింద ఉంటే, 58 వేల వరకూ కంప్యూటర్ సంబంధిత బ్రాంచ్‌ల్లోనే ఉన్నాయి. మూడు విడతలుగా సీట్ల భర్తీ చేపట్టినా, ఇంకా 3,034 సీట్లు కంప్యూటర్ కోర్సుల్లో మిగిలాయి. తాజాగా మరో 900 వరకూ కొత్త సీట్లు కలుపుకుంటే, దాదాపు 4 వేల సీట్లు మిగిలే అవకాశం ఉంది.

ప్రత్యేక కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా..

ఆఖరిదశలో అనుమతులు, కొత్త సీట్లు రావడంతో వాటి భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ తేదీలు మార్చారు. వాస్తవానికి ఈ నెల 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ మొదలు పెట్టి, 23న సీట్ల కేటాయింపు చేపట్టాలని భావించారు. ఈ తేదీల్లో మార్పులు చేస్తూ సాంకేతిక విద్యా శాఖ కొత్త షెడ్యూల్ ఇచ్చింది.

18వ తేదీ	స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ (కొత్తవారు)
17-22 తేదీల్లో	ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు
26న	సీట్ల కేటాయింపు
26-28 తేదీల్లో	ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్
27-29 తేదీల్లో	కాలేజీలో రిపోర్టింగ్

దోస్త్ 'ప్రత్యేక దశ'లో 39 వేల సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక దశ దోస్త్ కౌన్సెలింగ్ ద్వారా 39,969 సీట్లు భర్తీ చేసినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఇప్పటి వరకు డిగ్రీలో 1.85 లక్షల సీట్లు భర్తీ అయినట్టు పేర్కొన్నారు. ఈ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18 నుంచి 21 వరకు కాలేజీల్లో అన్ని ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాలని సూచించారు.

న్యాయశాఖ కార్యదర్శిగా ఆర్.తిరుపతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శిగా జడ్జి ఆర్.తిరుపతిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అవినీతి నిరోధక శాఖ కేసుల ప్రత్యేక కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జిగా ఉన్న ఆయనను హైకోర్టు సిఫార్సు మేరకు డిప్యూటేషన్‌పై న్యాయశాఖ కార్యదర్శిగా నియమించింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఏడాది పాటు తిరుపతి ఈ పోస్టులో కొన సాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

'ఐఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ' గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్‌గా మధుశేఖర్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఐఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ) గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్‌గా డాక్టర్ మధుశేఖర్ బద్దంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం వైద్యారోగ్యశాఖ సెక్రటరీ ఎస్ఏఎం రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. చైర్ పర్సన్‌గా మధుశేఖర్ రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతారని పేర్కొన్నారు.

లక్షమందితో ప్రగతి భవన్ ముట్టడిస్తాం

రవాణా రంగ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ వెంకటేశం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి లక్ష మందితో చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర రవాణా రంగ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ బి.వెంకటేశం ప్రకటించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం రవాణా రంగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ రవాణా కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పదేళ్లలో ధరలు రెట్టింపయ్యాయని, ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలు పెంచకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేలు

మెప్మా, సెర్ప్ ఉద్యోగులకు శుభవార్త

- ఏప్రిల్ 1 నుంచి వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ
- రిజిస్టర్డ్ సొసైటీ ఉద్యోగులుగానే కొనసాగింపు
- మెప్మాలో 378 మంది, సెర్ప్‌లో 3,974 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు లబ్ధి
- ఇకపై సర్కారు అనుమతితోనే నియామకాలు

సాక్షి, హైదరాబాద్: పట్టణ/గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా/సెర్ప్)ల ఉద్యోగులకు శుభవార్త. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన మెప్మాలో పనిచేస్తున్న 378 మంది ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేలు వర్తింపజేస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సెర్ప్‌లోని 3,974 మంది ఉద్యోగులకు సైతం పేస్కేలు వర్తింపజేస్తూ గత మార్చి 18న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేయగా, తాజాగా ఈ రెండు జీవోలు బయటకు వచ్చాయి.

2023 ఏప్రిల్ 1 నుంచి పేస్కేలు వర్తింపు..

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మెప్మా, సెర్ప్ ఉద్యోగులకు 2023 ఏప్రిల్ 1 నుంచి పేస్కేల్ వర్తించనుంది. ప్రస్తుత కనీస వేతనానికి సమీపంలో ఉన్న పేస్కేళ్లను వర్తింపజేయనున్నారు. మెప్మా ఉద్యోగులకు ప్రస్తుత కనీస వేతనానికి రక్షణ కల్పిస్తారు. సెర్ప్ ఉద్యోగుల ప్రస్తుత స్థూల వేతనం, ఇతర అలవెన్సులకు రక్షణ లభించనుంది. పేస్కేలు వర్తింపజేసినా సెర్ప్, మెప్మా ఉద్యోగులు ఇప్పటి తరహాలోనే రిజిస్టర్డ్ సొసైటీ ఉద్యోగులుగా కొనసాగుతారని, ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించినట్టు లేదా ప్రభుత్వంలో విలీనం చేసుకున్నట్టు పరిగణించడానికి వీలు లేదు. కాగా, వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఇదిలా ఉండగా ఇకపై ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాతే మెప్మాలో రెగ్యులర్/కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ పోస్టులను సృష్టించాలని ఆ ఉత్తర్వులు స్పష్టం చేశాయి.

మెప్మా కొత్త పేస్కేళ్లు ఇలా: మెప్మా ఉద్యోగులకు వారి హోదాల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగుల కేటగిరీ పేస్కేళ్లను వర్తింపజేయనున్నారు. స్టేట్ మిషన్ డైరెక్టర్లకు మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్లకు సూపరింటెండెంట్, ఎంఐఎస్ మేనేజర్లకు సీనియర్ అసిస్టెంట్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్లకు సీనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్లకు కామన్ అసిస్టెంట్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు/జూనియర్ అసిస్టెంట్లు/డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్, డ్రైవర్లకు డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్లకు ఆఫీస్ సబార్డినేట్ పే–స్కేళ్లు వర్తింపజేస్తారు.

సెర్ప్‌లో పేస్కేళ్లు ..

సెర్ప్‌లోని మండల సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్లు/ఆఫీస్ సబార్డినేట్లకు ఆఫీస్ సబార్డినేట్, మండల్ బుక్ కీపర్లకు రికార్డు అసిస్టెంట్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు జూనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు సీనియర్ అసిస్టెంట్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్లకు సూపరింటెండెంట్, ప్రాజెక్టు మేనేజర్లకు ఎంపీడీఓ, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్/ప్రాజెక్టు సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్, డ్రైవర్లకు డ్రైవర్ల హోదాలో ప్రభుత్వ ఉద్యోగుల పేస్కేలు వర్తింపజేస్తారు.

మెప్మాలో అడ్డదారిలో నియామకాలు?

మెప్మా ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేస్తామని దాదాపు ఏడాది కిందటే సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆ తర్వాత మెప్మాలో కొంత మంది అధికారులు తమ పిల్లలను, బంధువులను దొడ్డిదారిలో నియమించుకున్నారని ఆరోపణలున్నాయి. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవోతో వారికి సైతం ప్రయోజనం కలగనుందని విమర్శలు వస్తున్నాయి.

సంక్షేమంలో తిరుగులేని రాష్ట్రం తెలంగాణ

పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్: పేదల సంక్షేమంలో తిరుగులేని రాష్ట్రంగా తెలంగాణ ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కేంద్రం నుంచి సరైన సహకారం లేకపోయినా, పేదలందరికీ కడుపునిండా అన్నం పెట్టాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. రేషన్ డీలర్ల కమీషన్ పెంపుతోపాటు 13 డిమాండ్లను పరిష్కరించిన నేపథ్యంలో గురువారం రేషన్‌డీలర్ల జేఏసీ నాయకులు మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ నెలనెలా పేదలకు బియ్యం అందజేస్తున్న డీలర్ల సమస్యల గురించి ముఖ్యమంత్రి సానుభూతితో వ్యవహరించారని, అందుకే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ డీలర్లకు ఇచ్చే కమీషన్‌ను దాదాపుగా రెండింతలు చేశారని పేర్కొన్నారు. డీలర్ల కమీషన్ 2014 నుంచి 9 ఏళ్లలో రూ.200 నుంచి రూ.1,400కు పెరిగిందని గుర్తుచేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిన నేపథ్యంలో డీలర్లు చిత్తశుద్ధితో రేషన్‌కార్డు ఉన్న పేదలందరికీ సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు మాట్లాడుతూ కమీషన్ పెంపుతోపాటు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద కచ్చితమైన తూకం కోసం వేబ్రిడ్జిల ఏర్పాటు, కారుణ్యనియామకాలు చేపట్టడం, అంత్యక్రియల కోసం పదివేల తక్షణ సాయం, షాపుల రెన్యువల్ 5 ఏళ్లకు పెంపు, వయోపరిమితి సడలింపు తదితర సౌకర్యాలు కల్పించడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల జేఏసీ అధ్యక్షుడు నాయికోటి రాజు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో 'కొత్త రేషన్‌కార్డు'లపై అసత్య ప్రచారం

నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కొన్ని రోజులుగా వివిధ సామాజిక మాధ్యమాలు, ఇతరత్రా ప్రచార సాధనాల ద్వారా 'రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలైంది'అని తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతుందని, ఈ అసత్య ప్రచారాల్ని ఎవరూ నమ్మొద్దని సూచించారు.

నెదర్లాండ్స్‌లో కిడ్నీ మార్పిడికే ప్రాధాన్యత

- కిడ్నీ రోగులకు దయాలసిస్ ఎక్కువ కాలం చేయం
- నెదర్లాండ్స్ వైద్య మంత్రి ఎర్నెస్ట్ కైపర్స్ వెల్లడి
- రాష్ట్రంలో వైద్యసేవల అధ్యయనం కోసం నిమ్స్ సందర్శన
- వైద్య సేవల్లో తెలంగాణ భేష్ అని కితాబు



నిమ్స్‌లో రోగులను పరామర్శిస్తున్న ఎర్నెస్ట్ కైపర్స్

లక్డీకాపూల్: తమ దేశంలో కిడ్నీ బాధితులకు ఎక్కువ కాలం డయాలసిస్ చేయమని.. కిడ్నీ మార్పిడికే ప్రాధాన్యత ఇస్తామని నెదర్లాండ్స్ ఆరోగ్య, సంక్షేమ, క్రీడల శాఖ మంత్రి ప్రొఫెసర్ ఎర్నెస్ట్ కై పర్స్ తెలిపారు. తెలంగాణలోని వైద్య సేవలను అధ్యయనం చేసేందుకు వచ్చిన ఆయన గురువారం నిమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని లివర్ డయాలసిస్, మెడికల్ ఆంకాలజీ, యూరాలజీ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్క్రీనింగ్ కేన్సర్, మామోగ్రామ్, రొమ్ము కేన్సర్, సర్వైకల్ కేన్సర్‌కు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో నిమ్స్ వైద్యులతో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్న కై పర్స్... నెదర్లాండ్స్‌లోని వైద్య సేవల తీరును వివరించారు. అత్యవసర చికిత్స అవసరమయ్యే రోగులను తమ దేశంలో హెలికాప్టర్లలో ఆస్పత్రికి తరలిస్తామని చెప్పారు. కోవిడ్ తర్వాత ఎదురవుతున్న పరిణామాల నేపథ్యంలో నిమ్స్‌తో కలసి ఓ వ్యాక్సిన్ రూపొందించాలన్న యోచనలో ఉన్నట్లు కైపర్స్ తెలిపారు. అలాగే వైద్యవిద్యపై ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బ్యాక్టీరియా, యాంటీబయోటిక్ డ్రగ్స్‌పై పరిశోధనలకు నిమ్స్‌తో ఒప్పందం చేసుకున్నట్లు కైపర్స్ వివరించారు.

తెలంగాణలో వైద్య సేవలు బాగున్నాయి..

రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు బాగున్నాయని నెదర్లాండ్స్ మంత్రి ఎర్నెస్ట్ కై పర్స్ ప్రశంసించారు. తెలంగాణలో పదేళ్ల కాలంలో మాతాశిశు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం గొప్ప విషయమని... అందుకే తెలంగాణ వైద్యపరంగా నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం 11 స్థానం నుంచి 3వ స్థానానికి చేరిందన్నారు. కాగా, రాష్ట్రంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లోనే ట్రామా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. 50 పడకలతో కూడిన ఈ సెంటర్లలో అన్ని రకాల అత్యవసర వైద్యసేవలను అందించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. నెదర్లాండ్స్ మంత్రి కైపర్స్, ఆ దేశ ప్రతినిధి బృందాన్ని ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ రూ. లక్ష ఇవ్వాలి

- బీసీ బంధు పథకం ప్రవేశ పెట్టాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సీఎం ప్రధాన సలహాదారుడు సోమేశ్ కుమార్‌తో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సీఎం ప్రధాన సలహాదారుడు సోమేశ్ కుమార్‌ను బీసీ ప్రతినిధులతో గురువారం ఆర్.కృష్ణయ్య కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీసీ బంధు పథకం ప్రవేశపెట్టి ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, లేకపోతే వచ్చే ఎన్నికలలో బీసీల ఆగ్రహానికి గురికావలసి వస్తుందని హెచ్చరించారు. లక్ష రూపాయల పథకాన్ని 15 కులాలతో పాటు 130 బీసీ కులాలకు వర్తింప చేయాలని, జూన్‌లోగా దరఖాస్తు చేసిన 5.28 లక్షల మందికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఎవడైతే సత్కార్యం చేస్తాడో అతడు తన (మేలు) కొరకే చేస్తాడు.
మరియు దుష్కార్యం చేసేవాడు దాని ఫలితాన్ని అనుభవిస్తాడు.
నీ ప్రభువు తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 18 ఆగస్టు 2023

ఇది సరైన ఔషధమేనా?

జనరిక్ ఔషధాల వినియోగాన్ని మెరుగ్గా అమలు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మరోసారి మార్గదర్శకాలు జారీ చేసింది. ఖరీదైన కంపెనీ మందుల బదులు చౌకగా లభించే జనరిక్ ఔషధాలనే తప్పక రాయాలంటూ వైద్యులకు ఆదేశాలిచ్చింది. వైద్యం ఖరీదవుతున్న వేళ సామాన్యులకు సాంత్వననిచ్చే ఆదేశాలు స్వాగతించాల్సినవే. ఈ విషయంలో ఎన్ఎంసీ మార్గదర్శకాలివ్వడం ఇదేమీ తొలిసారి కాదు. మునుపెప్పుడో ఇచ్చినా, వాటి అమలు అంతంత మాత్రమైంది. అందుకే, ఈసారి ఆదేశాలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామంటూ హెచ్చరించింది. ఇక్కడే తకరారు వచ్చింది. ఇది 'పట్టాలు లేకుండా రైళ్ళు నడపడం లాంటిది' అంటూ దేశంలోని వైద్యులకు అతి పెద్ద సంఘమైన భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) తప్పుపడుతోంది. ఈ విధాన నిర్ణయాలు తీసుకొనే ముందే జనరిక్ మందుల్ని ప్రోత్సహించి, నాణ్యమైనవి దొరికేలా చేయాల్సింది. అది చేయకుండా జరిమానా నిబంధనలు పెట్టడం ఏ మాత్రం సబబన్నది ఐఎంఏ వాదన. వెరసి, వృత్తి నిర్వహణకు సంబంధించి ఆగస్ట్ మొదట్లో అమలులోకి వచ్చిన కొత్త మార్గదర్శకాలపై చర్చ జరుగుతోంది.

ఈ నిబంధనల ప్రకారం డాక్టర్లు ఇకపై మోతాదులో స్వల్పతేడా సైతం దుష్పరిణామాలకు దారి తీసే మందుల విషయంలో తప్ప, మిగతావన్నీ జనరిక్ మందులే సిఫార్సు చేయాలి. ఫలానా బ్రాండే వాడాలనకూడదు. తత్సమాన జనరిక్ ఔషధం పేరు రాయాలి. నిర్ణీత మోతాదులో, అనుమతించిన కాంబినేషన్లలోనే ఆచితూచి మందులు రాయాలి. స్పష్టంగా, అర్థమయ్యేలా, ఇంకా వీలుంటే ఇంగ్లీషులో పెద్ద బడి అక్షరాల్లో మందుల చీటీ రాయాలి. అర్థం కాని కోడిగీతల్లో రాస్తే గందరగోళపడ్డ రోగులు పొరపాటుగా వేరే మందులు తీసుకొనే ప్రమాదం ఉందనేది అంతరార్థం. అలాగే రోగి పరిస్థితి, చికిత్స, ఫలితం లాంటివి డాక్టర్లు ట్విట్టర్ వగైరాల్లో చర్చించరాదంటూ రోగుల హక్కులు కాపాడేలా 11 అంశాలతో సోషల్ మీడియా మార్గదర్శకాలూ ఇచ్చింది. ఇవన్నీ మంచి మాటలే.

బ్రాండెడ్ మందులతో పోలిస్తే, జనరిక్ ఔషధాలు సగటున 30 నుంచి 80 శాతం చౌకని ఓ లెక్క. అందువల్ల ఆ మేరకు ఆరోగ్యరక్షణ ఖర్చులు తగ్గుతాయి. సహజంగానే సామాన్యులకు అది పెద్ద ఊరట. అదే సమయంలో, డాక్టర్ల వాదన ఏమిటంటే – మిగిలే లాభం తక్కువ గనక అన్ని ఫార్మసీలూ అన్నిరకాల జనరిక్ మందులనూ నిల్వ చేయవు. డాక్టర్ రాసిచ్చిన మందు లేనప్పుడు నిర్ణయం షాపువాడి చేతిలోకి వస్తుంది. అప్పుడు నాణ్యతతో సంబంధం లేకుండా, ఎక్కువ లాభం మిగిలే మందులను అంగట్లో అంటగట్టే ప్రమాదం ఉంది. అంతేకాక, వైద్యులు తమ అనుభవం కొద్దీ రోగికి సరిపోయే మందు రాయడానికి వీలు లేకుండా పోతుందనీ, కంపెనీలను బట్టి జనరిక్ ఔషధాల నాణ్యతలోనూ తేడాలు తప్పవు గనక చికిత్స సమర్థంగా సాగదనీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మన దేశంలో నాణ్యతా ప్రమాణాల నియంత్రణ అంతంత మాత్రమే. కాబట్టి ఈ ఆందోళనను అంత తేలిగ్గా కొట్టిపారేయలేం. నాణ్యతకు హామీ లేకపోతే, మందుల్ని వాడినా ప్రయోజనం ఉండదన్నది నిష్ఠురసత్యం. ఈ రకమైన చికిత్స, ఔషధ వినియోగంతో వ్యాధి తగ్గకుంటే రోగికి నష్టం, డాక్టర్ పేరుకూ దెబ్బ. ఇన్ని లోతుపాతులున్న అంశంపై నిర్ణయాలు ప్రకటించే ముందు సంబంధిత వర్గాలన్నిటితో సమగ్రంగా చర్చించడం తప్పక అవసరం. అదేమీ లేకుండా మార్గదర్శకాలను నోటిఫై చేశారని వైద్యవర్గాల ఆరోపణ. నిజానికి, దేశంలోని జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో చేయాల్సింది చాలా ఉంది. అది డాక్టర్లు, మందుల ఉత్పత్తిదార్లు, పాలకులు – అంతా అంగీకరించే మాటే. తయారయ్యే మందుల్లో అన్ని బ్యాచ్‌లకూ ప్రభుత్వం నాణ్యతా పరీక్ష చేయడం ఆచరణ సాధ్యం కాదు. కేవలం 0.1 శాతం మందులకే పరీక్షలు జరుగుతున్నాయట. గత మూడేళ్ళ కాలంలో జనరిక్, బ్రాండెడ్ జనరిక్, బ్రాండెడ్ మందులన్నిటికీ జరిపిన పరీక్షల్లో దాదాపు 3 శాతం ప్రమాణాల మేరకు నాణ్యంగా లేవని సాక్షాత్తూ కేంద్ర ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మందుల తయారీలో నిర్దుష్టమైన విధానాల్ని అనుసరించడమే నాణ్యతను సాధించడానికి మూల మంత్రం. పాలకులు అందుకు కట్టుదిట్టమైన విధివిధానాలు పెట్టాలి.

ఆ మాటకొస్తే కొన్నేళ్ళ క్రితం దాకా జనరిక్స్ తయారీ సంస్థలకు కొన్ని టెస్టులు తప్పనిసరి కాదు. బ్రాండెడ్ మందులకు సమానంగా జనరిక్ మందు స్పందిస్తున్నట్టు నిర్ధరించే బయో–ఈక్వలెన్స్ పరీక్ష కానీ, నిర్ణీత వాతావరణ పరిస్థితుల్లో ఔషధ నాణ్యత ఏ మేరకు మారుతుందో చూసే స్టెబిలిటీ అధ్యయనాలు కానీ జరపకుండానే బండి నడిచింది. ఇప్పుడవి తప్పనిసరి చేశారు. కానీ, అవేవీ జరగకుండానే బయటకొచ్చిన జనరిక్స్ చాలానే ఇప్పటికీ విపణిలో ఉన్నట్టు ఔషధరంగ నిపుణులు అంగీకరిస్తున్నారు. అందుకే, ఇప్పటికైనా నిబంధనల అమలును వాయిదా వేసి, అన్ని వర్గాలతో కేంద్ర ప్రభుత్వం విస్తృత స్థాయి సంప్రతింపులు జరపాలన్నది వైద్య సంఘం డిమాండ్.

వైద్యవృత్తికి సంబంధించి నియంత్రణాధికారాలున్న ఎన్ఎంసీ ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. వైద్యులు నిరంతరం తమ వృత్తినైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్న మార్గదర్శకం ఆచరణలో ఏ మేరకు సాధ్యమో ఆలోచించాలి. పర్యవేక్షించే విధానమేమిటో చెప్పాలి. అన్నిటి కన్నా ముందు బ్రాండెడ్‌కు దీటుగా జనరిక్ ఔషధాలు పనిచేస్తాయనే భరోసా ప్రజల్లో కల్పించాలి. షాపుల్లో ఈ రకం ఔషధాలన్నీ పెద్దయెత్తున నిల్వ ఉండేలా, జన్ ఔషధీ కేంద్రాలు ఊరి నలుమూలలా నెలకొనేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఆ పని చేయకుండా మార్గదర్శకాలు, జరిమానాలంటూ హడావిడి చేస్తే ఏం లాభం? పుండు ఒకచోట ఉంటే, మందు మరొకచోట రాసినట్టే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.విదియ సా.5.46 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పుబ్బ రా.9.58 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** తె.5.50 నుండి 7.34 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.27 నుండి 1.18 వరకు, **అమృతఘడియలు:** ప.2.54 నుండి 4.40 వరకు, శుక్ర మూఢమి త్యాగం.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సాగుబడి లాభసాటి కావాలంటే...



విశ్లేషణ

దేవీందర్ శర్మ

న్యూఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండిలో కూరగాయలమ్మే వ్యక్తి తాలూకు ఒక వీడియో వైరల్ అయ్యింది. దిగమింగుకోవడం కష్టమైపోయిన ఆయన కన్నీళ్లలో తన ఆర్థిక బాధ స్పష్టంగా కనిపించింది. జీవనోపాధి కోసం ఎక్కువ మంది ఆధారపడి ఉన్నందున, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే సవాలును ఆర్థికవేత్తలు స్వీకరించాలి. ఇప్పుడున్న ఆర్థిక నమూనాను ధిక్కరించయినా రైతుల చేతులకు ఎక్కువ ఆదాయాన్ని అందించాలి. వచ్చే ఐదేళ్లను పూర్తిగా వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి కేటాయించాలి. సంస్కరణలు ప్రారంభించినప్పటి నుండి పరిశ్రమలకు ఇచ్చినన్ని వనరులు, ప్రోత్సాహకాలు, ఆర్థిక ఉద్దీపనలను ఇప్పుడు వ్యవసాయానికి అందించాలి. ప్రతి రైతు, కూలీ కన్నీళ్లు తుడవడానికి ఇది తప్ప వేరే మార్గం లేదు.

కొన్నిసార్లు మాటల కంటే నిశ్శబ్దం మరింత బిగ్గరగా మాట్లాడుతుంది. న్యూఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండిలో ఓ కూరగాయల అమ్మకందారుపై తీసిన, గుండెను పిండేసే వీడియో క్లిప్ వైరల్‌గా మారింది. పెరిగిన ధరలకు టమోటాలు కొనలేకపోతే ఖాళీ బండితో తిరిగి వెళతావా అని అడిగినప్పుడు, ఆయన మూగబోయాడు. అదే సమయంలో తన కన్నీళ్లను అదుపులో పెట్టుకోలేకపోయాడు. ఆయన మౌనమే శక్తిమంతమైన సమాధానం అయింది.

మార్కెట్‌లోకి వచ్చే కొత్త కార్ మోడళ్లు, సూపర్‌స్టోర్‌లను ముంచెత్తుతున్న సరికొత్త ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌ల వెంటపడుతున్న దేశ ప్రజల సున్నిత హృదయాలకు ఆ చిన్న వీడియో షాక్ కలిగించింది. తాజా ఆటోమొబైల్స్ గురించి, సరికొత్త ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌ల గురించి టీవీ షోలు నిత్యం మోతమోగిస్తున్నప్పుడు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గురించి ఎప్పటికప్పుడు నివేదికలు వెలువడుతున్నప్పుడు, ఒక వీడియో క్లిప్... మధ్యతరగతిని మైకం నుంచి బయటకు లాగడమే కాకుండా కఠినమైన వాస్తవాలను వారి ముఖాముఖి తీసుకొచ్చింది.

న్యూఢిల్లీకి చెందిన కూరగాయలమ్ముకునే రామేశ్వర్‌పై చిత్రించిన క్లిప్ సరిగ్గా అటువంటి ఉదాహరణే. దిగమింగుకోవడం కష్టమైపోయిన ఆయన కన్నీళ్లలో తన ఆర్థిక బాధ స్పష్టంగా కనిపించింది. ఎంత సంపాదించారని ప్రశ్నించగా, రోజుకు రూ.100–200కు మించి రావడం లేదన్నాడు. ఆయన సమాధానం భారతదేశ పేదరిక స్థాయిలనే కాకుండా, పెరుగుతున్న అసమానతల విస్ఫోటనాన్ని కూడా బయటపెట్టింది.

అయితే మహారాష్ట్రలోని తిక్‌పుర్లీకి చెందిన 45 ఏళ్ల చెరకు రైతు, కూలీ గురించి చాలామందికి తెలియదు. భారతి పాటిల్ అనే ఆ రైతు, ఒక పరిశోధనా వేదికతో మాట్లాడుతూ, ''గత ఐదేళ్లుగా మా కూలీలు పెద్దగా మారలేదు. నోట్ల రద్దుకు ముందు రోజుకు 100 రూపాయలు వచ్చేది, ఇప్పుడు సాయంత్రం 5 గంటల వరకు పనిచేసినా మాకు రూ. 150 మాత్రమే చేతికి అందుతోంది'' అని పేర్కొన్నారు. మరో మాటలో చెప్పాలంటే, ఒక సన్నకారు చెరకు రైతుకు ఒక రోజుకు దక్కుతున్న మొత్తాన్ని ఇది బయటపెడుతుండగా, మహారాష్ట్రలోని చక్కెర బెల్ట్‌లో రోజువారీ కూలీ గత ఐదేళ్లలో రూ.50 మాత్రమే పెరిగిందని కూడా వెల్లడవుతోంది. నిత్యావసరాల ధరలు పెరిగిపోతున్నా సన్నకారు రైతులు, రైతు కూలీలు ఏటా అదే తక్కువ కూలీ మొత్తంతో ఎలా బతుకుతున్నారనేది జీర్ణించుకోవడం కష్టం.

ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసినప్పుడు నిజమైన కూలీల పెరుగుదల సున్నాకు దగ్గరగానే ఉంది. ఏరకమైన అర్థవంతమైన పెరుగుదలా కనబడలేదు. వాస్తవానికి, కొన్ని అధ్యయనాలు 2013–17 మధ్య నిజమైన వేతనాలు తగ్గుముఖం పట్టడం లేదా స్తబ్ధుగా ఉండటాన్ని సూచించాయి. దేశంలోని 90 కోట్ల మంది కార్మికులలో చాలా మంది అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల పట్ల భ్రమలు కోల్పోయారనీ, దీంతో వారు ఉద్యోగాల కోసం వెతకడం కూడా మానేశారనీ 2022 ఏప్రిల్‌లో సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎమ్ఐఈ) పేర్కొంది.



ఈ కారణం వల్లే 2021–22లో దేశ ఉపాధిలో 45.5 శాతంగా ఉన్న వ్యవసాయ రంగం వాటా, మహమ్మారి ముందు స్థాయికి చేరలేదని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే పేర్కొంది. అప్పుడు శ్రామిక శక్తిలో 42.5 శాతంతో వ్యవసాయరంగ జనాభా వాటా సాపేక్షంగా తక్కువగా ఉందని ఈ నివేదిక తెలిపింది. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో లాక్‌డౌన్ విధించిన తర్వాత వారి గ్రామాలకు తిరిగి వచ్చిన 10 కోట్ల మంది కార్మికులలో గణనీయమైన భాగం మళ్లీ నగరాలకు తిరిగి రాలేదు.

అదేవిధంగా, బంగ్లాదేశ్‌లో కూడా ఈ సంవత్సరం వ్యవసాయంపై ఆధారపడటం పెరిగింది. బంగ్లాదేశ్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రకారం, వ్యవసాయ రంగంలో సంవత్సర ప్రాతిపదికన చూసినప్పుడు 2023 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో అత్యధిక ఉద్యోగాల కల్పన జరిగింది. అదే సమయంలో నగరాల్లో అధికారిక ఉపాధి అవకాశాలు లేకపోవడాన్ని సూచిస్తున్నందున ఇది మంచి సంకేతం కాదని కొందరు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

అసమానత ఎంత నిరుత్సాహకరంగా మారుతున్నదో ముందుగా చూద్దాం. ప్రపంచ స్థాయిలో అధ్వాన్నంగా పెరుగుతున్న అసమానతలను 'వరల్డ్ ఇన్–ఈక్వాలిటీ రిపోర్ట్' వెల్లడించింది. తాజా నివేదిక ప్రకారం, ప్రపంచ జనాభాలో అత్యంత సంపన్నులైన 10 శాతం మంది మొత్తం సంపదలో 76 శాతాన్ని కలిగి ఉన్నారు. అయితే దిగువ సగం మంది కేవలం 3 శాతం సంపద కలిగి ఉన్నారు. భారతదేశంలో కూడా అగ్రశ్రేణి 1 శాతం మంది, దేశ సంపదలో 40.5 శాతాన్ని కలిగి ఉన్నారని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ చెబుతోంది.

ధనికులు సంపదను కూడబెట్టుకోవడం కొనసాగిస్తుండగా, పేదలు పేదరికంలోకి మగ్గిపోయేలా ఆర్థిక రూపకల్పనను మన విధాన నిర్ణేతలు అల్లుకుంటూ వచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత బలంగా పాతుకుపోయిందంటే, అసమానతలను అంతం చేయడంపై పెద్ద చర్చ జరుగుతున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి 500 మంది అత్యంత సంపన్నులు 2023 మొదటి ఆరు నెలల్లోనే తమ సంపదకు మరో 852 బిలియన్ డాలర్లను జోడించుకున్నారు.

ప్రపంచ బ్యాంక్ ప్రమాణాల ప్రకారం, రోజుకు నాలుగు డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో బతుకుతున్న 'బ్రిక్స్' దేశాల జనాభాలో ఇండియా మొదటిస్థానంలో ఉంది. 91 శాతం జనాభా నిర్దేశిత ప్రమాణానికి కిందికి ఉంది. 50.3 శాతంతో రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా కంటే కూడా ఇది ఎంతో ఎక్కువ.

వ్యవసాయాన్ని అతి పెద్ద ఉపాధి కల్పనారంగంగా పరిగణనలోకి తీసుకుంటే, అసమానతలను తగ్గించడానికి ఉత్తమ మార్గం ఏమిటంటే, వనరులను అవసరం ఉన్న చోట ఉపయోగించడమే. పైనుంచి కిందికి ప్రవహించే విఫల 'ట్రికిల్ డౌన్' ఆర్థిక వ్యవస్థను కొనసాగించడానికి బదులుగా– దిగువ, మధ్య స్థాయులను పైకి తేవడం మీద దృష్టి పెట్టడమే అసలైన కర్తవ్యం కావాలి.

భారతదేశం, బంగ్లాదేశ్‌లలో జీవనోపాధి కోసం ఎక్కువ భాగం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నందున, గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే సవాలును ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు స్వీకరించాలి. దిగువ స్థాయి నుండి సంపదను పిండుకునే బదులు, ఇప్పుడున్న ఆర్థిక నమూనాను ధిక్కరించయినా రైతుల చేతులకు ఎక్కువ ఆదాయాన్ని అందించాలి. సజీవ వ్యవసాయం అనేది ఈ కాలపు అవసరం. ప్రతి రైతు, కూలీ కన్నీళ్లు తుడవడానికి ఇది తప్ప మరో మార్గం లేదు.

వచ్చే ఐదేళ్లను వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి కేటాయించాలని నా సూచన. సంస్కరణలు ప్రారంభించినప్పటి నుండి పరిశ్రమలకు మనం ఇచ్చినన్ని వనరులు, ప్రోత్సాహకాలు, ఆర్థిక ఉద్దీపనలను ఇప్పుడు వ్యవసాయానికి అందించాలి. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, పునరుత్పత్తి చేసే తదుపరి దశ సంస్కరణలకు నాంది పలికేందుకు కేవలం ఐదేళ్ల పాటు, చిన్న తరహా వ్యవసాయాన్ని, పర్యావరణపరంగా స్థిరమైన వ్యవసాయాన్ని పునర్నిర్మించాలి. కేవలం ఐదేళ్లు – ఇంతమాత్రమే నేను అడుగుతున్నది!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

టార్గెట్ గడ్కరీ?



కేంద్ర రోడ్డు, రవాణా, హైవేల మంత్రిత్వ శాఖకు సంబంధించిన స్కాములు, అవినీతిని 'కాగ్' ఎందుకు బయటపెడుతున్నారు? ఎవరిని లక్ష్యంగా చేసుకున్నారు? గమనిక: ప్రస్తుతం కాగ్ అయిన గిరీశ్ ముర్ము సాక్షాత్తూ మోదీకి నచ్చిన అధికారి.

– భావికా కపూర్, వ్యాఖ్యాత

మనుషులే డేంజర్



భద్రతా కారణాల రీత్యా స్వీయ చోదక కార్లను నిషేధించాలని ఏ రాజకీయ నాయకుడైనా కోరితే, మానవ చోదక వాహనాలను కూడా నిషేధించాలని వాళ్లు అడగాలి. ఎందుకంటే అవే మరింత తక్కువ సురక్షితం.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

అమ్మో సోషల్ మీడియా!



ట్విట్టర్‌లో ఉన్న భారతీయులు, భారత్‌లోని భారతీయులను ప్రతిఫలించరు. నేను ఇండియాకు ఎప్పుడు వెళ్లినా, 'సర్దార్‌జీ' అని గౌరవంగా సంబోధిస్తారు. అన్ని మతాల వాళ్లూ దయగా వ్యవహరిస్తారు. కానీ ఇంటర్నెట్‌లో ఫేక్ ప్రొఫైల్స్ పెట్టుకుని విషయం ఏమీ లేని చోట కూడా భగ్గుమంటుంటారు. భారతీయులు ప్రేమగలవాళ్లు. కానీ ట్విట్టర్ అలా కాదు.

– జస్‌దీప్ సింగ్, రచయిత

కనీసం గౌరవం లేదా?



మరే దేశంలోనూ దేశ నిర్మాణంలో పాలుపంచుకున్న నెహ్రూ, గాంధీ లాంటి నాయకులను దూషించడాన్ని పాలక పక్షమే అన్యాపదేశంగా సమర్థించడమో, ప్రాయోజకత్వం వహించడమో చేయదు. ఇక్కడ అలా కాదు. కారణం – ఇప్పటి పాలకుల మార్గదర్శకులు స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నది తక్కువ, లేదా శూన్యం.

– జయ్ ఎస్ఆర్, ఫిజీషియన్


పశు రాజ్య పాలనకు అద్దం



జార్జ్ ఆర్వెల్ నవల 'యానిమల్ ఫార్మ్' 78 ఏళ్ల క్రితం ఈరోజే (ఆగస్ట్ 17, 1945) విడుదలైంది. పరిహాసం ఏమిటంటే, ప్రాథమికంగా అందరు అమెరికన్, బ్రిటిష్ ప్రచురణకర్తలు దీన్ని నిరాకరించారు. కారణం కథలోని విమర్శ ఎక్కుపెట్టిన స్టాలిన్ (రష్యా)కు ఈ దేశాలు మిత్రపక్షం కాబట్టి! (రెండో ప్రపంచ) యుద్ధం ముగిసి, కూటమి విడిపోయాక మాత్రమే నవల ప్రచురితమైంది. వెన్వెంటనే బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

ఒకనాటి భారతం



యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధానమంత్రి రిషి సునాక్ ఒక ప్రవచనానికి హాజరయ్యి గర్వంగా తనను తాను హిందువునని చెప్పుకొన్నారు. కానీ ఒకప్పుడు ఢిల్లీలో జరిగిన సాహిత్య సదస్సులో నా ఉపన్యాసంలోంచి 'హిందువు' పదాన్ని తొలగించమని అడిగారు. నేను హాజరవడానికి తిరస్కరించాననుకోండి!

– స్వామి సమర్పణానంద, సాధువు

ద్వంద్వ పౌరసత్వం మేలు



ఇండియా ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించాలా? నేనయితే అవును అంటాను. అది భారతీయులనూ, విదేశీయులనూ ఇండియాలో మరింతగా పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తుంది. అది వారిని వెనక్కీ ముందుకీ సులభంగా పయనించేలా చేసి, తమ నైపుణ్యాలను తమ మాతృదేశం కోసం ఉపయోగించే వీలు కల్పిస్తుంది.

– ఫ్రాన్స్వా గోచియర్, జర్నలిస్ట్

బహుజన పోరాట యోధుడు పాపన్న

బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించ వచ్చని నిరూపించిన సామాన్యుడు, గొప్ప సామాజిక విప్లవ కారుడు సర్వాయి పాపన్న. రాచరికపు వ్యవస్థ నీడలో అగ్ర కులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, జాగీర్దారు అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడతను. 'ఖిలా షాపూర్'ను కేంద్రంగా చేసుకొని మొఘలాయిల ఆధిప త్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన వాడిగా ఆయన్ని జానపదులు కీర్తిస్తారు.

పాపన్న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలా షాపూర్‌లో జన్మించాడని (1650–1709) భావిస్తున్నారు. నాసగోని ధర్మన్న, సర్వమ్మల కుమారుడు. ప్రజలు ప్రేమతో అతన్ని 'పాపన్న దొర' అని పిలిచేవారు. పాపన్న ఎల్లమ్మకు పరమ భక్తుడు. తల్లి కోరిక మేరకు కులవృత్తి కల్లు గీతను వృత్తిగా స్వీకరించాడు. అయితే కొద్ది కాలానికే నాటి సమకాలీన సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకొని బానిసత్వం నుండి ప్రజలకు విముక్తి కల్పిస్తానని కులవృత్తి చేయనని తల్లితో ప్రతిజ్ఞ చేశాడు. పాపన్నకు ఎలాంటి వారసత్వ నాయకత్వం కాని, ధనంకాని, అధికారం కాని లేవు. కానీ సొంతంగా సైన్యం నిర్మించి తన సొంత ఊరు ఖిలా షాపూర్‌ని రాజధా నిగా చేసుకొని 1675లో సర్వాయి పేటలో తన రాజ్యాన్ని స్థాపించాడంటారు.



సర్దార్ సర్వాయి పాపన్న

పాపన్న తెలంగాణలో మొగలులకు వ్యతిరేకంగా పోరాడాడనీ, 21 కోటలు నిర్మించాడనీ, తాటికొండ, వేముల కొండలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడనీ చెబుతారు. ఆయన రాజ్యం తాటికొండ, కొలనుపాక, చేర్యాల నుండి కరీంనగర్ జిల్లా లోని హుస్నాబాద్, హుజూరాబాద్ వరకు విస్తరించింది. పాపన్న ముస్లిం మతానికి చెందిన ఒక స్త్రీని వివాహం చేసుకున్నాడనీ అంటారు. అలాగే గోల్కొండ కోటను స్వాధీన పర్చుకొని 7 నెలలపాటు అధికారం చలాయించాడనీ కథలు ప్రచారంలో ఉన్నాయి.

పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఖజానా కొరకు ధనవంతులు, సుబేదార్లపై తన గెరిల్లా సైన్యంతో దాడి చేసేవాడు. వారి వద్ద నుంచి దోచుకున్న సొమ్మును ప్రజలకు పంచిపెట్టాడు. వారి భూములను కూడా ప్రజలకు పంచాడు. తాటి కొండలో చెక్ డ్యామ్ నిర్మించాడంటారు. ఎల్లమ్మకు పరమ భక్తుడు కావున హుజురాబాద్‌లో ఎల్లమ్మ గుడి కట్టించాడని అంటారు.

ఢిల్లీ ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడుతూ సమ్మక ద్రోహం కారణంగా శత్రుపక్షానికి చిక్కి పాపన్న మరణించాడని కరుణ, వీర రసాలు ఉట్టిపడేలా అనేక జానపద కథలు ప్రచారంలో ఉన్నాయి. స్థానిక చరిత్రల నిర్మాణం ఆవశ్యకతను గుర్తించిన కొందరు చరిత్రకారులు... ఆధిపత్యకులాలు, రాచరికానికి వ్యతిరేకంగా పోరాడిన పాపన్నను కేవలం ఒక దోపిడీ దొంగగా చిత్రీకరించారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పాపన్న చరిత్రను ఆంగ్లేయ కవి జేయే బోయేల్ 'ఇండి యన్ అంటిక్వెరి'లో 1874లోనే రాశారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ బుక్‌లో పాపన్న గురించి రాశారు. తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్ దివంగత ఆచార్య పేర్వారం జగన్నాథం పాపన్న తెలంగాణ ప్రాంతంలోని ఖిలాషాపురానికి చెందినవాడని రుజువు చేశారు. ప్రముఖ కవులు మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆది రాజు వీర భద్రరావు, చొల్లేటి నృసింహశర్మ, రామరాజులు పాపన్న చరిత్రను వెలుగులోకి తెచ్చారు. నేటి తరానికి పాపన్న జీవితం స్ఫూర్తినిస్తుంది.

– పాకాల శంకర్ గౌడ్, టీచర్ | 98483 77734

(నేడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి)

బిచ్చమడుగొస్తెనే...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''ఎలచ్చన్లు దగ్గర బడుతున్నయి. లీడర్లు ఏం జేస్తున్నరు?'' అని సత్నారి అడిగిండు.

''ముందుగాల సర్వేలు జేపిచ్చిండ్రు'' అని యాద్గిరి జెప్పిండు.

''సర్వేలు ఎందుకు?''

''ఎవలకు ఎంత బలముందో ఎర్క జేస్కునేతందుకు.''

''ఎర్క జేస్కోని ఏం జేస్తరు?''

''ఎవ్వలికి ఎక్వ బలముంటె గాల్లకు ఎమ్మెల్యే టికిట్ ఇస్తరు.''

''టికిట్ రానోల్లు ఏం జేస్తరు?''

''గోడ దుంకుతరు. లేకుంటె రెబల్ క్యాండిడేట్లుగ పోటి జేస్తరు.''

''అన్ని పార్టీల లీడర్లు ఏం జేస్తరు?''

''పాదయాత్రలు జేస్తరు. బస్సు యాత్రలు జేస్తరు.''

''ఇంకేం జేసిండ్రు?''

''పార్టీ కార్యకర్తలకు ట్రేనింగ్ ఇప్పిచ్చిండ్రు.''

''ఎవలితోని ఇప్పిచ్చిండ్రు?''

''ముందుగాల బిచ్చపతి అనేటి బిచ్చగానితోని ట్రేనింగ్ ఇప్పిచ్చిండ్రు. 'ఒక్క పది రూపాయలు దానమియ్యి. దానమిస్తె పున్యమొస్తది. నీ పేరు జెప్పుకోని బత్కుత. నీ పెండ్లాం పిల్లలు సల్లగుంటరు అనుకుంట బిచ్చమడ్గాలె. బిచ్చమేసె దాంక సతాయించాలె. ఇండ్లల్ల అడుక్కునేటప్పుడు గింత బిర్యాని పెట్టమ్మా, సోర్వ ఎయ్యమ్మా అని పాడాలె. ధర్మతల్లీ! నాకు బిచ్చమేస్తె మీ ఇంటికి లచ్చిందేవొస్తది. నీ మొగని జీతం బెర్గుతది. నీ బిడ్డ పెండ్లి అయితది. నీ కొడ్కుకు కొల్వు దొర్కుతది. నీ మెడలకు బంగారి గొల్సు, నడ్మకు వడ్డాన వొస్తయి. చేతులకు బంగారి గాజులు, చెవులకు కమ్మలొస్తయి. నీ మొగడు దినాం నిన్ను మోటర్ల దిప్పుతడు. అమెరిక గొంచబోతడు. రొండంత్రాల బంగ్ల గట్టిస్తడు. నువ్వు ఏం గావాలన్నా ఇస్తడు. గింత ఉడుకుడు బువ్వెయ్యమ్మా! గింత కూర, మామిడి తొక్కు బెట్టమ్మా! గిలాసల జెరంత సల్లబొట్టు బొయ్యమ్మా అని అనాలె. బిచ్చం బెట్టెదాంక ఇంటి ముంగటనే ఉండాలె. ఇయ్యాల బిచ్చమడ్గొస్తె రేపు ఓట్లు అడ్గుడు మీకు అల్కగైతది' అనుకుంట బిచ్చపతి పాటం జెప్పిండు.



థియరీ క్లాసులైనంక ప్రాక్టికల్స్ షురువైనయి. చిన్గిన అంగి, పైంటును పార్టీ కార్యకర్తలు దొడుక్కున్నరు. ఒక చేత్ల బొచ్చె, ఇంకో చేత్ల కట్టె బట్టుకున్నరు. కొందరు గుడి మెట్ల మీద గూసోని బిచ్చమడిగిండ్రు. కొందరు రేల్‌టేషన్ల, బస్టాండ్లల్ల బిచ్చమడిగిండ్రు. కొందరు గుడ్డోల్లు, కుంటోల్ల లెక్క యాక్టింగ్ జేస్కుంట బిచ్చమడిగిండ్రు.

పొద్దు మీకినంక గా దినం అడ్క తెచ్చినయి గాల్లు బిచ్చపతికి సూబెట్టిండ్రు. గవ్విటిని జూసి గాడు మార్కు లేసిండు.''

''ఇంకెవలితోని ట్రేనింగ్ ఇప్పిచ్చిండ్రు?''

''తిట్ల మీద పాటం జెప్పెటందుకు నర్సమ్మ అనేటామెను బిల్సిండ్రు. గామె తిట్లల్ల మషూర్. ముందుగాల తిట్టినంకనే గామె మాట్లాడ్తది. 'నీ నోట్లె మన్ను వడ. నీ ఇంట్ల పీన్గెల్ల. నీ దొడల్ దగ్గర బడ. నీ తలపండు బల్గ. నీకు పిండం బెట్ట. నీ పెండ్లాం ముండమొయ్య. నీ ముక్కుల దూది బెట్ట. నీ చేత్ల జెష్ట మొల్వ. నీకు గజ్జి లెవ్వ. నీ యాపారం జెడ. నువ్వు ఆక ల్తోని సావ. నువ్వు లంగవు. లఫంగవు. బట్టె బాజ్ గానివి. బద్మాష్‌వి. సన్నా సివి. దద్దమ్మవు. బేకార్గానివి. నక్కవు. గజ్జి కుక్కవు. పందివి. జిల్ల పుర్గువు. నీ కాల్లు చేతులిర్గ. నీకు గత్తర్ దల్గ' అనుకుంట నర్సమ్మ తిట్ల దండకం సదివింది. తిట్ల దండకంను చపాయించి తలా ఒక కాపి ఇచ్చిండ్రు.''

''ఇంకెవ్వరితోనైన ట్రేనింగ్ ఇప్పిచ్చిండ్రా?''

''ఒక గూండాను బిలిసిండ్రు. మీటింగ్‌లను ఎట్ల చెడగొట్టాలెనో, సూటి జూసి కోడిగుడ్లు, టమాటలు, పాత చెప్పులు ఎట్ల ఎయ్యాలెనో గాడు నేర్పిచ్చిండు. ఒక బైరూపులోడు వొచ్చిండు. రంగు బూస్కోకుంటనే యేసాలు ఎట్ల ఎయ్యాలెనో జెప్పిండు. ఇంకొగాయిన వొచ్చిండు. ఏం లేకున్నా గంటలు, గంటలు ఎట్ల స్పీచ్ గొట్టాలెనో పాటాలు జెప్పిండు.''

గీ తీర్గ మా దోస్తులు మాట్లాడుకుండ్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

భాష రాక.. బాధ చెప్పుకోలేక!

- కామాంధులకు బలైన బాలిక ఉదంతంలో బాధితుల పరిస్థితి దారుణం
- 'గ్యాంగ్‌రేప్'పై సాగుతున్న విచారణ.. 3 పోలీస్ బృందాల ఏర్పాటు

సాక్షి, పెద్దపల్లి: వలస కుటుంబంలోని బాలికపై సామూహిక లైంగికదాడి ఘటనలో బాధితులు జరిగిన ఘోరాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి.. ఓ వైపు భాషరాదు.. మరోవైపు ఎవరికీ చెప్పుకోలేని బాధ.. పనికి తీసుకొచ్చిన వ్యక్తికి చెబితేనైనా న్యాయం జరుగుతుందనుకుంటే భరోసా కల్పించాల్సిందిపోయి బెదిరించడంతో ఆ వలసజీవులు అయోమయంలో పడ్డారు. ఈనెల 14న పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట శివారులో బాలిక సామూహిక లైంగికదాడికి గురికావడం, ఆమెను.. పనికి తీసుకున్న వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా స్వస్థలానికి తరలించే క్రమంలో ఆమె మృతిచెందడం తెలిసిందే. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాలిక అన్న ఫిర్యాదుతో బసంత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గురువారం పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ ఆధ్వర్యంలో రెండు బృందాలు బాలిక స్వస్థలమైన మధ్యప్రదేశ్‌కు వెళ్లాయి. గోదావరిఖని ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మరో బృందం స్థానికంగా నిందితులను పట్టుకోవడంలో నిమగ్నమైంది. పోలీసులు రైల్వేస్టేషన్, బస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించారు. ఇతర వలస కూలీల ద్వారా విషయం తెలుసుకున్నారు.

ఆ ఏడు గంటలు ఏం జరిగింది?

ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు బాలిక నిందితుడి బైక్‌పై వెళ్లగా.. ఆమెను రాత్రి 10 గంటలకు పెద్దపల్లి బస్టాండ్‌లో వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. అంటే దాదాపు ఏడు గంటల పాటు బాలిక నిందితులతోనే ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రైల్వే పట్టాల ప్రాంతంలో అత్యాచారం చేసినట్లయితే అన్ని గంటల పాటు ఆ పరిసరాల్లోకి జనం ఎవరు రాలేదా? లేకపోతే బాలికను దుండగులు కారులో తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడ్డారా? అనేది తేలాల్సి ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కాగా, మధ్యప్రదేశ్ పోలీసులు అక్కడే ఓ హాస్పిటల్‌లో బాలికకు శవపరీక్ష చేయించినట్లు సమాచారం.



300 కోట్ల ఏళ్ల క్రితం వచ్చింది..
100 కోట్ల ఏళ్ల తర్వాత పోతుందా..



దారెటు?

దొడ్డ శ్రీనివాసరెడ్డి

ఆక్సిజన్..ప్రాణాలు నిలబెట్టే వాయువు. ఐ-కొలి లాంటి కొన్ని రకాల బ్యాక్టీరియాలు మినహా భూమ్మీద సమస్త జీవజాలాల మనుగడకు ఈ ఆక్సిజన్ అవసరం. అయితే ఈ ప్రాణవాయువుకు జన్మనిచ్చింది ఓ బ్యాక్టీరియా అంటే వింతగా అన్పించినా వాస్తవం. కోటాది కోట్ల సంవత్సరాల క్రితం భూ వాతావరణంలో ఆక్సిజన్ అనేది లేదు. సుమారు 450 కోట్ల సంవత్సరాల క్రితం వాయువులు, దుమ్ము, ధూళి ఒకచోట స్థిరపడి భూగోళం ఏర్పడింది. ఆ తరువాత మరో వంద కోట్ల సంవత్సరాలకు భూమిపై ఏకకణ జీవితో జీవం ఆవిర్భవించింది. అప్పటికి ఇంకా భూమి మీద ఉన్న అనేక రకాల వాయువుల్లో ఆక్సిజన్ లేదు. ఆ కాలంలో ప్రోక్లోరోకాకస్ అనే బ్యాక్టీరియా తన మనుగడ కోసం నీరు, సూర్యరశ్మి, కార్బన్ డైఆక్సైడ్‌ల ద్వారా కిరణజన్య సంయోగ క్రియను జరిగించి అవసరమైన శక్తిని పొందడం మొదలుపెట్టింది. సముద్రంలో ఉండే ఈ బ్యాక్టీరియా నిర్వహించిన కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి అవుతూ వాతావరణంలో కలవడం మొదలయ్యింది. సుమారు 300 కోట్ల సంవత్సరాల క్రితం భూ వాతావరణంలో ఓ మోస్తరు ఆక్సిజన్ లభించడం మొదలయ్యింది. దీన్నే శాస్త్రవేత్తలు గ్రేట్ ఆక్సిడేషన్ ఈవెంట్‌గా అభివర్ణించారు. అలా మొదలైన ఆక్సిజన్ ఇప్పటికి భూమిపై ఉన్న వాతావరణంలో 21 శాతానికి పెరిగింది. కోటాను కోట్ల జీవరాశుల జన్మకు, మనుగడకు కారణమయ్యింది.

నైట్రోజన్‌దే రాజ్యం

భూ వాతావరణంలో అత్యధికంగా నైట్రోజన్ 78 శాతం ఉంది. అంటే ఆక్సిజన్, నైట్రోజన్ కలిసి గాలిలో 99 శాతం ఉన్నాయన్నమాట. ఇక ఆగాన్, కార్బన్ డైఆక్సైడ్ వంటి వాయువులన్నీ కలిపి ఒక్క శాతం ఉన్నాయి. సౌర కుటుంబంలోని మిగతా గ్రహాల్లో స్వచ్ఛమైన ఆక్సిజన్ దాదాపుగా లేదు. ఒకవేళ ఉన్నా ఇతర వాయువుల సంయోగంలో మాత్రమే ఉంది. ఉదాహరణకు వీనస్ (శుక్రుడు), మార్స్ (అంగారకుడు) గ్రహాల వాతావరణంలో కార్బన్ డైఆక్సైడ్, నైట్రోజన్ కలిసి 98 శాతం ఆక్రమిస్తున్నాయి. ఈ కారణంగానే ఇతర గ్రహాలతో పాటు వీటిల్లోనూ జీవావిర్భావానికి అనుకూలమైన వాతావరణం లేదు.

కిరణాలే జన్మదాతలు

భూమ్మీద లభించే ఆక్సిజన్ దాదాపుగా కిరణజన్య సంయోగక్రియ (ఫొటోసింథసిస్) సృష్టించిందే. అయితే కేవలం భూమ్మీది వృక్ష జాతుల్లో జరిగే ఫొటోసింథసిస్ వల్లే మొత్తం ఆక్సిజన్ ఉత్పత్తి అవుతోందనుకుంటే పొరపాటే. సగం సముద్రంలో కూడా పుడుతోంది. సముద్రంలో ఉండే మొక్కలు, నాచు వంటి వృక్ష సంబంధమైనవి కూడా తమకు కావలసిన శక్తి కోసం కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటి మాదిరిగానే ప్రోక్లోరొకాకస్ బ్యాక్టీరియా కూడా ఫొటోసింథసిస్ ద్వారా ఆక్సిజన్‌ను సృష్టిస్తోంది. అయితే సముద్రంలో ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్‌లో భూ వాతావరణంలో కలిసేది అత్యల్పమనే చెప్పవచ్చు. ఎందుకంటే అక్కడ ఉత్పత్తి అయిన ఆక్సిజన్ చాలావరకు సముద్ర జీవజాలాల మనుగడకే సరిపోతుంది. కాబట్టి భూమ్మీద మనకు లభ్యమయ్యే ఆక్సిజన్ దాదాపుగా వృక్ష జాతుల పుణ్యమే.

ఎంత చెట్టుకు అంత..


ఎదిగిన చెట్టుకు ఆకులు, కొమ్మలు, కాండం, వేర్లు ఉంటాయి. అయితే చెట్టులో ఐదు శాతంగా ఉండే ఆకులు మాత్రమే ఆక్సిజన్‌ను తయారు చేస్తాయి. వేర్ల నుంచి వచ్చే నీరు, సూర్యరశ్మి, వాతావరణంలో ఉండే కార్బన్ డైఆక్సైడ్‌ను ఆకులు గ్రహించి కిరణ జన్య సంయోగక్రియ ద్వారా చెట్టు ఎదుగుదలకు కావలసిన గ్లూకోజ్‌ను తయారుచేస్తాయి. ఈ ప్రక్రియలో ఆక్సిజన్‌ను వాతావరణంలోకి వదిలేస్తాయి. చెట్లు కూడా కొంత ఆక్సిజన్‌ను ఉపయోగించుకుంటాయి కానీ విడుదల చేసే ఆక్సిజన్‌తో పోల్చుకుంటే అది అతిస్వల్పం. ఇలా వాతావరణంలో ఆక్సిజన్ చేరుతూ ఈ రోజు మొత్తం గాలిలో 21 శాతాన్ని ఆక్రమించింది. సమయం, కాలం ఇతర వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఒక చెట్టు ఉత్పత్తి చేసే ఆక్సిజన్‌లో హెచ్చు తగ్గులు ఉంటాయి. అలాగే చెట్టు లేదా మొక్క రకాన్ని బట్టి ఆక్సిజన్ ఉత్పత్తి పరిమాణం మారుతూ ఉంటుంది. చాలావరకు మొక్కలు, చెట్లు పగలు మాత్రమే ఆక్సిజన్‌ను విడుదల చేస్తా యి. కొన్ని అరుదైన వృక్ష జాతులే 24 గంటలు ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఉదాహరణకు చాలామంది ఇంట్లో పెంచుకునే తులసి చెట్టు రోజులో 20 గంటల వరకు ఆక్సిజన్‌ను విడుదల చేస్తూనే ఉంటుంది. అలాగే అరెకాపామ్‌గా పిలిచే పోకచెట్టు 24 గంటల పాటూ ఆక్సిజన్‌ను వాతావరణంలోకి వదులుతూనే ఉంటుంది.

ఆరేడు చెట్లు = ఓ మనిషి మనుగడ

ఒక అంచనా ప్రకారం ఒక ఆకు గంటకు ఐదు మిల్లీలీటర్ల ఆక్సిజన్‌ను తయారుచేస్తుంది. వంద అడుగుల భారీ వృక్షం ఏడాదికి 6,000 పౌండ్ల ఆక్సిజన్‌ను ఉత్తత్తి చేయగలదు. చిన్నా పెద్ద చెట్లు సగటున 260 పౌండ్లు అంటే సుమారు 120 కిలోల ఆక్సిజన్ని ఏడాదికి సృష్టిస్తాయి. మనిషి సగటున ఏడాదికి 9.5 టన్నుల గాలిని పీల్చుకుంటాడు. అయితే ఇందులో ఆక్సిజన్ 21 శాతమే ఉంటుంది. మనిషి పీల్చుకునే ఆక్సిజన్‌లో కూడా మూడోవంతు మాత్రమే దేహం ఉపయోగించుకుని మిగతాది గాలిలోకి వదిలేస్తుంది. ఈ లెక్కన మనిషి ఏడాదికి 740 కిలోల ఆక్సిజన్‌ను వాడుకుంటాడు. అంటే సగటున ఆరు నుంచి ఏడు చెట్లు ఉత్పత్తి చేసే ఆక్సిజన్ ఓ మనిషి మనుగడకు సరిపోతుందన్నమాట.

భూమ్మీద శాశ్వతం కాదా?

ఆక్సిజన్ భూమ్మీద శాశ్వతంగా ఉంటుందా అన్నది సందేహాస్పదమేనంటున్నారు సైంటిస్టులు. ఒకప్పుడు భూమిపై ఆక్సిజన్ లేదు కాబట్టి భవిష్యత్తులో మళ్లీ అలాంటి పరిస్థితి ఏర్పడవచ్చునన్నది వారి అభిప్రాయం. నాసాకు చెందిన కజుమి ఒజాకి, క్రిస్టఫర్ రైన్‌హార్డ్ అనే శాస్త్రవేత్తలు.. ఓ ప్రయోగం ద్వారా ఇంకో వంద కోట్ల సంవత్సరాల తరువాత భూమ్మీద ఆక్సిజన్ శాతం గణనీయంగా పడిపోతుందనే అంచనాకు వచ్చారు. వంద కోట్ల సంవత్సరాల తర్వాత సూర్యుడు మరింత వేడిగా మారడం వల్ల భూమిపై కార్బన్ డైఆక్సైడ్ స్థాయి విపరీతంగా పెరిగి, ఆక్సిజన్ వెళ్లిపోయేలా చేస్తుందనేది వారి అంచనా.



20 వేల టన్నుల సామర్థ్యం

కోవిడ్ సమయంలో ఆక్సిజన్ లేక రోగులు పడిన అవస్థలు గుర్తుండే ఉంటాయి. భారతదేశం కోవిడ్ కాలానికి ముందు రోజుకి 6,900 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసేది. అందులో 1,000 టన్నులు మాత్రమే వైద్య అవసరాలకు అందుబాటులో ఉండేది. మొదటి విడత కోవిడ్ సమయంలో దీని అవసరం 3,095 టన్నులకు, రెండో విడత అంటే 2021లో 5,500 టన్నులకు పెరిగిపోయింది. ప్రభుత్వ, ప్రైవేటుపరంగా ప్రస్తుతం మనదేశంలో రోజుకు 20,000 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. కానీ వైద్య పరంగా ఇప్పుడు మనకు సగటున రోజుకు 1,250 టన్నుల ఆక్సిజన్ సరిపోతుంది. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక, వైద్య అవసరాల కోసం ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్ ద్వారా 7,054 కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతోంది.

'కేసీఆర్ పథకాలను కాపీకొడుతోంది'

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను మోదీ సర్కార్ కాపీ కొడుతోందని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆరోపించారు. అసలు మోదీ సర్కార్‌కు సొంతంగా ఆలోచించేశక్తి లేదని గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాలకు పేర్లు మార్చి కేంద్రంలో అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధును కేసీఆర్ తీసుకువస్తే కేంద్రంలో కిసాన్ సమ్మాన్ యోజన అని తీసుకువచ్చారని వివరించారు. ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడానికి మిషన్ భగీరథ పథకాన్ని విజయవంతంగా పూర్తిచేస్తే దాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్రంలోని బీజేపీ సర్కార్ హర్ ఘర్ జల్ పేరిట ముందుకు వచ్చిందని పేర్కొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

- ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా చర్యలు తీసుకోండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. గత నెల వరదలపై అదనపు అఫిడవిట్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 22వ తేదీ వరకు సమయం ఇస్తున్నామని స్పష్టం చేసింది. ఇటీవలి వరద కారణంగా మోరంచపల్లెలో మృతి చెందిన మహాలక్ష్మి, సంజీవయ్య పేర్లను ప్రభుత్వం జాబితాలో చేర్చలేదని పిటిషనర్ పేర్కొనగా, ఈ ఇద్దరు కూడా వరద కారణంగానే మృతి చెందితే, వారి వివరాలనూ అఫిడవిట్‌లో వెల్లడించాలని చెప్పింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)లో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ నెల 18 నుంచి 22 వరకు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా చర్యలు చేపట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని చిక్కుడు ప్రభాకర్ కోరారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ఒకరు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో గురు వారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీ సులు తెలిపిన కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సి పాలిటీ పరిధిలోని మరియపురంలో ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఓ కాంట్రాక్టర్ కూలీలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్(ప్రైవేట్), స్తంభాలకు వైరింగ్ పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలోనే విద్యుత్ వైర్లకు కరెంట్ సరఫరా అయ్యింది. దీంతో మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన రమావత్ హరి(28) విద్యుత్ స్తంభం వైర్లపైనే పడి మరణించాడు. అతనితోపాటు పనిచేస్తున్న అంబోతు మోహన్(35) స్తంభం మీద నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మోహన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి కూడా విషమంగానే ఉందని సమాచారం.

క్లుప్తంగా...

నెహ్రూ అంటే పేరు కాదు.. కృషి: రాహుల్ గాంధీ


న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ పేరుని ప్రధానమంత్రుల మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీగా పేరు మార్చడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నెహ్రూకి ఆయన పేరు వల్ల గుర్తింపు రాలేదని, ఆయన చేసిన కృషి వల్ల వచ్చిందని అన్నారు. గురువారం నాడు లద్దాఖ్‌కు వెళ్లిన రాహుల్ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. ''నెహ్రూకు వచ్చిన గుర్తింపు అంతా ఆయన చేసిన పనుల వచ్చింది. అంతే తప్ప ఆయన పేరు వల్ల కాదు'' అని అన్నారు. నెహ్రూ మ్యూజియం పేరు మార్చడంపై రాజకీయంగా వివాదాస్పదమైన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

విమానాశ్రయంలోనే కుప్పకూలిన పైలట్

నాగ్‌పూర్: ఇండిగో సంస్థ పైలట్ ఒకరు విమానాశ్రయంలోనే గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఈ ఘటన నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో గురువారం చోటుచేసుకుంది. నాగ్‌పూర్–పుణె విమానాన్ని నడపాల్సిన కెప్టెన్ మనోజ్ సుబ్రమణ్యం(40) మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎయిర్‌పోర్టుకు వచ్చారు. బోర్డింగ్ గేట్ వద్ద ఉండగా ఆయన హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయారు. సిబ్బంది వెంటనే కిమ్స్–కింగ్స్ వే ఆస్పత్రికి తరలించారు. సీపీఆర్ చేపట్టినా ఫలితం లేకపోయిందని, ఆకస్మికంగా వచ్చిన గుండెపోటుతో అప్పటికే ఆయన అప్పటికే చనిపోయారని వైద్యులు ధ్రువీకరించారు.

టెక్–ఫ్రెండ్లీగా కింది కోర్టులు
సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతికతకు మరింతగా వినియోగించుకుంటూ కింది స్థాయి న్యాయస్థానాలను 'టెక్–ఫ్రెండ్లీ'గా తయారుచేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. గురువారం ఆర్టికల్ 370 రద్దుపై రాజ్యాంగ ధర్మాసనం విచారణ సమయంలో సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే కింది కోర్టులు సాంకేతిక పుంజుకోవాల్సిన అవసరం ఉందంటూ చేసిన వాఖ్యపై సీజేఐ స్పందించారు. కోవిడ్ కష్టకాలంలో అన్ని వ్యవస్థలూ స్తంభించిపోయినా న్యాయస్థానాలను ప్రతిరోజూ నడపాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఈ–కోర్టుల ప్రాజెక్టు మూడో దశకు కేంద్రం కేటాయించిన భారీ బడ్జెట్ కారణంగా న్యాయవ్యవస్థ ముఖ్యంగా కింది కోర్టుల్లో సాంకేతిక పుంజుకొంటుందని సీజేఐ ఆశాభావం వ్యక్తంచేశారు. న్యాయస్థానాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ఇతోధిక నిధులు సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర అత్యంత ముఖ్యమైనదని గుర్తుచేశారు.



ఇక కన్నీళ్లేనా..?

ప్రపంచ జనాభాలో 25% మంది పరిస్థితి ఇదీ.!

భారత్ సహా 25 దేశాల్లో నీటికి కొరత

పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికా దేశాల్లో 83% జనాభాకు అందని సురక్షిత నీరు

నీటి కొరతతో ఆర్థికంగా నష్టపోతున్న భారత్, ఈజిప్టు, మెక్సికో, టర్కీ

వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ అధ్యయనంలో వెల్లడి

వానలు, వరదలతో ప్రపంచంలో కొన్ని దేశాలు అల్లాడిపోతుంటే, మరి కొన్ని దేశాల్లో గొంతు తడుపుకోవడానికి గుక్కెడు మంచినీళ్లకి కరువు వచ్చి పడింది. ప్రపంచంలో 25 దేశాలు నీటికి కటకటలాడుతున్నట్టుగా వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. అక్వెడక్ట్ వాటర్ రిస్క్ అట్లాస్ పేరుతో ఈ సంస్థ విడుదల చేసిన నివేదికలో ప్రపంచ జనాభాలో 25% మంది ప్రస్తుతం అత్యంత తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

నివేదిక ఏం చెప్పిందంటే..

- ప్రపంచంలోని 25 దేశాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. వాటిలో భారత్, సౌదీ అరేబియా, చిలీ, శాన్‌మెరినో, బెల్జియం, గ్రీస్ వంటి దేశాలున్నాయి.
- బహ్రెయిన్, సైప్రస్, కువైట్, లెబనాన్, ఒమన్ ప్రతీ ఏడాది నీటి కొరతతో అల్లాడిపోతున్నాయి. ప్రతీ ఏడాది కరువు బారిన పడుతున్నాయి.
- ప్రపంచంలో నీటి కొరత అత్యధికంగా ఎదుర్కొంటున్న ప్రాంతాలు పశ్చిమ ఆసియా, ఉత్తర ఆఫ్రికా. ఈ ప్రాంతాల్లో 83% జనాభా అత్యధికంగా నీటి కొరత సమస్యను ఎదుర్కొంటున్నారు.
- దక్షిణాసియా జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆ దేశాల్లో 74% మంది జనాభా నీటి కొరత అధికంగా ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారు.
- ప్రపంచ జనాభాలో 50% మంది అంటే 400 మంది కోట్ల వరకు ప్రతీ ఏడాది ఒక నెల రోజుల పాటు నీటికి కటకటగా ఉండే పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 60 శాతానికి చేరుకునే అవకాశాలున్నాయి.
- నీటి కొరత కారణంగా భారత్, మెక్సికో, ఈజిప్టు, టర్కీ దేశాలు ఆర్థికంగా భారీగా నష్టపోతున్నాయి.
- 2010లో నీటి కొరత వల్ల ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 15 లక్షల కోట్ల డాలర్లు (ప్రపంచ జీడీపీలో 24%) నష్టపోతే, 2050 నాటికి ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 31% నష్టం వాటిల్లుతుంది. అంటే 70 లక్షల కోట్ల డాలర్ల నష్టం వస్తుంది.
- ఆసియా దేశాల్లో భారత్ అత్యధికంగా నీటి కొరతను ఎదుర్కొంటుంది. 2050 నాటికి ఆసియా దేశాల్లో 80% మందికి సురక్షిత నీరు అందదు.
- ప్రపంచ వ్యవసాయ రంగం 60% నీటి కొరతను ఎదుర్కొంటోంది. దీని వల్ల వరి, గోధుమ, మొక్కజొన్న, చెరుకు పంటలపై ప్రభావం పడుతోంది.



నీరు మనకి జీవనాధారం. భూమ్మీద లభించే అత్యంత ముఖ్యమైన వనరు అదే. అయినా దాని నిర్వహణలో మనం విఫలమవుతూ వస్తున్నాం. జల సంరక్షణ అనే అంశంలో నేను 10 ఏళ్లుగా పని చేస్తున్నాను. దురదృష్టవశాత్తూ ప్రతీ ఏడాది అదే నివేదిక, అదే కథనం ఇవ్వాల్సి వస్తోంది. ఈ సంక్షోభ పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ప్రపంచ దేశాధినేతలు చిత్తశుద్ధితో పని చేస్తూ నీటి వనరుల సంరక్షణకి ఆర్థిక వనరులు కేటాయించాలి''
–సమంతా కుజ్మా, డబ్ల్యూఆర్‌ఐ నివేదిక రచయిత్రి

నీటి కటకటకి కారణాలివే..!

జనాభా పెరుగుదల , పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పులు, నీటి నిర్వహణ సమర్థంగా చేయకపోవడం వంటివెన్నో నీటి కటకటకి కారణాలు. భూమ్మీద 70% నీటితో నిండి ఉన్నా మన అవసరాలు తీర్చే నీరు అందులో 3% మాత్రమే. అందులో రెండింట మూడొంతులు మంచు రూపంలో ఉంది. జనాభా పెరిగిపోతూ ఉండడంతో నీటికి డిమాండ్ పెరుగుతోంది. 1960తో పోల్చి చూస్తే నీటికి డిమాండ్ రెట్టింపు కంటే ఎక్కువైంది. యూరప్, అమెరికాలో నీటికి డిమాండ్ స్థిరంగా ఉంటే ఆఫ్రికా దేశాల్లో పెరుగుతోంది. 2050 నాటికి నీటికి డిమాండ్ మరో 25% పెరుగుతుందని అంచనా. వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రపంచంలో సగం దేశాల్లో అనావృష్టి పరిస్థితులు నీటి కొరతకు కారణమవుతున్నాయి. పరిశ్రమలు పెరిగిపోతూ ఉండడంతో నీటి వినియోగం అధికమవడమే కాకుండా, కలుషిత నీరు పెరిగిపోయే ప్రజల అవసరాలు తీర్చలేకపోతోంది.

చేయాల్సింది ఇదే..!

ప్రతీ వాన బొట్టుని సంరక్షించడానికి ప్రపంచ దేశాలన్నీ శక్తివంచన లేకుండా కృషి చేయాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకే 70% నీటిని వాడాల్సి వస్తోంది. 2050 నాటికి పెరిగే జనాభాకి 2010 కంటే 56% అధికంగా పంటలు పండించాలి. తక్కువ నీటి వాడకంతో పంటలు పండించే సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం వల్ల 2050 నాటికి నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలు గణనీయంగా తగ్గుతాయని ఒక అంచనా. చిత్తడి నేలలు పెంచడం, భూగర్భ జలాల పెంపొందించే చర్యలు చేపట్టడం వంటివి చెయ్యాలి. ఇక గ్లోబల్ వార్మింగ్ అదుపు చేయడానికి ప్రపంచ దేశాలన్నీ కృషి చేయాల్సి ఉంది.

ఆ 25 దేశాలు ఇవే..!: భారత్, బహ్రెయిన్, సైప్రస్, కువైట్, లెబనాన్, ఒమన్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, ఈజిప్టు, లిబియా, యెమన్, బోత్స్వానా, ఇరాన్, జోర్డాన్, చిలీ, శాన్ మారినో, బెల్జియం, గ్రీస్, టునిషియా, నమీబియా, దక్షిణాఫ్రికా, ఇరాక్, సిరియా

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికలు ముగిసే వరకూ

ఆహార భద్రత !

- ఉచిత రేషన్ బియ్యం పథకం కొనసాగింపునకే కేంద్రం మొగ్గు
- ఎల్పీజీ సబ్సిడీ సిలిండర్లపై ఇస్తున్న సాయం కొనసాగించే అవకాశం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని నిరుపేద కుటుంబాలకు ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం పథకాన్ని ఈ ఏడాది డిసెంబర్ తర్వాత సైతం కొనసాగించే అవకాశాలున్నాయని కేంద్రప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రాజకీయ కారణాలు, వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని మరో ఆరు నెలల పాటు కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పథకం ద్వారా 81 కోట్ల మంది లబ్ధిదారులకు కేంద్రప్రభుత్వం ప్రతి నెల ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తోంది. నిజానికి ఈ ఉచిత బియ్యం పంపిణీ ఈ ఏడాది డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్రం ఈ ఏడాది జనవరిలోనే నిర్ణయించడం తెల్సిందే. అయితే సార్వత్రిక ఎన్నికల్లో ఉచిత బియ్యం పథకాన్ని ప్రధానాస్త్రంగా చేసుకుని అధికార బీజేపీ ఇప్పటికే ప్రచారాన్ని మొదలుపెట్టింది. గతంలో రెండుసార్లు బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు దేశంలోని పేద, మధ్య తరగతి వర్గాలు అండగా నిలిచిన నేపథ్యంలో ఈ పథకాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించి ఈసారీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ యోచిస్తోంది. దీంతోపాటే ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు రెండేళ్లుగా ఏడాది గరిష్టంగా ఒక్కో రీఫిల్‌కు రూ.200 సబ్సిడీ చొప్పున 12 సిలిండర్లను రాయితీ ధరకు అందిస్తోంది. వంటగ్యాస్ ధరలు ఎక్కువ స్థాయిలోనే కొనసాగితే ఈ గడువును మరో ఆరు నెలల పాటు పొడిగించే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

స్వావలంబనకు చిహ్నం 'వింధ్యగిరి'

కోల్‌కతా: భారత నౌకాదళం కోసం దేశీయంగా నిర్మించిన యుద్ధ నౌక 'వింధ్యగిరి' దేశ స్వావలంబనకు చిహ్నమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. గురువారం ఆమె కోల్‌కతాలోని హుగ్లీ తీరంలో ఉన్న గార్డెన్ రీచ్ షిప్‌యార్డులో వింధ్యగిరిని జలప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. ఆత్మనిర్భర్ భారత్‌కు, దేశం సముపార్జించిన సాంకేతిక ప్రగతికి ఇది నిదర్శనమన్నారు. సముద్ర జలాలపై భారత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఇదొక ముందడుగని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమబెంగాల్ గవర్నర్ ఆనందబోస్, సీఎం మమతా బెనర్జీ పాల్గొన్నారు. దేశీయంగా ఏడు యుద్ధ నౌకల తయారీ లక్ష్యంతో కేంద్రం 2019లో 'ప్రాజెక్ట్ 17 ఆల్ఫా'చేపట్టింది. 2019–22 వరకు అయిదు యుద్ధ నౌకలను నిర్మించి, నేవీకి అప్పగించారు. ఈ ప్రాజెక్టులో వింధ్యగిరి ఆరోది. ఆధునిక ఈ నౌకలో వినియోగించిన పరికరాలు, వ్యవస్థలు 75 శాతం వరకు దేశీయంగా తయారైనవి. విస్తృత ట్రయల్స్ తర్వాత భారత నేవీకి అప్పగించనున్నారు. సుమారు 149 మీటర్ల పొడవైన పీ17ఏ రకం ఈ యుద్ధ నౌకల్లో గైడెడ్ మిస్సైల్స్ ఉంటాయి. భూమి, ఆకాశం, నీటి లోపలి నుంచి ఎదురయ్యే విపత్తులను గుర్తించి నిర్వీర్యం చేయగలవు.


జలప్రవేశం చేస్తున్న వింధ్యగిరి యుద్ధనౌక. (ఇన్‌సెట్లో) కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము, సీఎం మమత

'చంద్రయాన్–3'లో కీలక ఘట్టం ఆవిష్కృతం

- ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయిన ల్యాండర్ మాడ్యూల్
- చంద్రుడి వైపు దూసుకెళ్తున్న ల్యాండర్ 'విక్రమ్'



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామపై అధ్యయనం కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జూలై 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్‌లో గురువారం మధ్యాహ్నం 1.35 గంటలకు కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వ్యోమనౌకలోని ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి రోవర్ 'ప్రజ్ఞాన్'తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' విజయవంతంగా విడిపోయింది. ఇక జాబిల్లి ఉపరితలంపై క్షేమంగా దిగడమే తరువాయి. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయిన తర్వాత 'థ్యాంక్స్ ఫర్ ది రైడ్, మేట్' అంటూ ల్యాండర్ మాడ్యూల్ ఒక సందేశాన్ని పంపించినట్లు ఇస్రో వెల్లడించింది. ప్రస్తుతం ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రుడికి వంద కిలో మీటర్ల ఎత్తులో లూనార్ ఆర్బిట్‌లో వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తూ ల్యాండర్ సమాచారాన్ని భూనియంత్రిత కేంద్రానికి అందిస్తోంది. ఈ నెల 18న, 20న ల్యాండర్ మాడ్యూల్‌ను చందమామకు మరింత సమీపానికి తీసుకెళ్లే ప్రక్రియలు చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఈ ప్రక్రియల్లో ల్యాండర్ వేగాన్ని క్రమంగా తగ్గిస్తారు. ఈ నెల 23న సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపై దక్షిణ ధ్రువ ప్రాంతంలో ల్యాండింగ్ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ ఆరోగ్యకరంగా ఉండి చక్కగా పని చేస్తున్నాయని ఇస్రో ప్రకటించింది. ప్రస్తుతం ప్రొపల్షన్ మాడ్యూల్ లూనార్ ఆర్బిట్‌లో పరిభ్రమిస్తుండగా, ల్యాండర్ చంద్రుడివైపు దూసుకెళ్లే పనిలో ఉంది. ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రుడి చుట్టూ కక్ష్యలో నెలలు/సంవత్సరాల తరబడి తన ప్రయాణం కొనసాగించనుంది. ఈ నెల 23న ఆవిష్కృతం కాబోయే అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు ప్రపంచమంతా భారత్ వైపే చూస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కోర్టు ఆవల రాజీ ఒప్పందం కుదుర్చుకోండి

వారణాసి(యూపీ): వారణాసిలోని జ్ఞానవాపి మసీదును గతంలో ఆలయం ఉన్న ప్రదేశంపై నిర్మించారా? అన్న దానిని తేల్చే విషయంలో న్యాయస్థానంలో నలుగుతున్న అంశాన్ని కోర్టు ఆవల రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని విశ్వ వేదిక్ సనాతన్ సంఘ్ పిలుపునిచ్చింది. జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో పురావస్తు శాఖ సర్వే కొనసాగుతున్న ఈ తరుణంలో సనాతన సంఘ్ చీఫ్ జితేంద్ర ఇలా బహిరంగ లేఖ రాయడం గమనార్హం. ఈ లేఖ తమకు అందిందని దీనిపై అంతర్గత సమావేశంలో చర్చిస్తామని ఇంతెజామియా మస్జిద్ కమిటీ సంయుక్త కార్యదర్శి మొహమ్మద్ యాసిన్ చెప్పారు.

'ఇండియా' కూటమితో మోదీలో గుబులు: నితీశ్

పాట్నా: విపక్షాలతో 'ఇండియా' కూటమి ఏర్పాటు కావడంతో ప్రధాని మోదీలో గుబులు మొదలైందని జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ అన్నారు. 'ఇండియా' ఏర్పాటైన తర్వాత ఎన్డీయే పక్షాల సమావేశాలు నిర్వహిస్తున్నారని పరోక్షంగా ప్రధాని మోదీని ఎద్దేవా చేశారు. ఎన్డీయే పగ్గాలు మోదీ చేతుల్లోకి వచ్చాక భాగస్వామ్య పక్షాలను గౌరవించడం మానేశారన్నారు. 'ఇండియా' అధికారంలోకి వస్తే దేశానికి మంచి జరుగుతుందన్నారు.

అసెంబ్లీ సమరానికి బీజేపీ సన్నద్ధం

ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో అభ్యర్థుల తొలి జాబితాలు విడుదల

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఇంకా వెలువడలేదు. అయినా బీజేపీ ఈ రాష్ట్రాలకు సంబంధించి తమ అభ్యర్థుల తొలి జాబితాలను గురువారం విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో 21 మంది, మధ్యప్రదేశ్‌లో 39 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. ఒక్కో రాష్ట్రంలో ఐదుగురు చొప్పున మహిళలకు అవకాశం కల్పించింది. ఛత్తీస్‌గఢ్‌లోని పఠాన్ శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌పై పోటీగా తమ పార్టీ ఎంపీ, సీనియర్ నేత విజయ్ బఘేల్‌ను బరిలోకి దించుతోంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. అంతకంటే ముందు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నాయి.

కూలిన చిన్న విమానం..10 మంది మృతి



కౌలాలంపూర్: మలేసియాలోని సెంట్రల్ సెలంగోర్‌లో గురువారం చిన్న విమానం కూలిన ఘటనలో మొత్తం 10 మంది చనిపోయారు. లంగ్‌క్వావి నుంచి సుబంగ్ విమానాశ్రయం వైపు వస్తున్న ప్రైవేట్ చార్టర్డ్ విమానంలో ఆరుగురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. మరికొద్ది నిమిషాల్లో ల్యాండ్ అవుతుందనగా విమానం పల్టీలు కొడుతూ రహదారిపై కుప్పకూలింది. రహదారిపై వెళ్తున్న బైక్, కారుపై పడటంతో విమానంలోని 8 మందితోపాటు మరో ఇద్దరు చనిపోయారు. ఘటనకు కారణం తెలియాల్సి ఉంది. విమానం బ్లాక్‌బాక్స్ కోసం గాలింపు జరుగుతోంది.

సలహా బోర్డు అనుమతిస్తే.. 3 నెలలకుపైగా నిర్బంధించొచ్చు

న్యూఢిల్లీ: ముందస్తు నిర్బంధానికి సరైన కారణం ఉందని అడ్వైజరీ బోర్డు అభిప్రాయపడిన సందర్భాల్లో.. ' 3 నెలలకు మించి ముందస్తు నిర్బంధంలో ఉంచరాదు' అనే నిబంధన వర్తించబోదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. గత ఏడాది ఆగస్టులో తనను అరెస్టుచేశారని, కాకినాడ జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన ముందస్తు నిర్బంధ ఉత్తర్వు చెల్లదంటూ పెసల నూకరాజు అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలుచేయగా దానిని హైకోర్టు కొట్టేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా గురువారం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఆయనకు వ్యతిరేకంగా తీర్పును వెలువరించింది. ' ముందుస్తు నిర్బంధం సహేతుకమని అడ్వైజరీ బోర్డు భావిస్తే మూడునెలలకు మించి కూడా సంబంధిత వ్యక్తులను నిర్బంధంలో కొనసాగించవచ్చు. నిర్బంధం మూడు నెలలకు మించకూడదనే నిబంధన ఇలాంటి సందర్భాల్లో వర్తించదు' అని కోర్టు తీర్పు చెప్పింది. 'కింది కోర్టు ఉత్తర్వుల్లో ఇంతకాలం నిర్బంధించండి అని పేర్కొంటే అంత కాలానికే నిర్బంధంలో ఉంచుతారు. ఒకవేళ కాలావధిని కోర్టు పేర్కొనకపోతే ఆ వ్యక్తిని గరిష్ఠకాలం(12 నెలలు) నిర్బంధంలో ఉంచుతారు. నిర్బంధ ఉత్తర్వులొచ్చాక ప్రతీ మూడు నెలలకు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వును సమీక్షించాల్సిన అవసరంలేదు' అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

సంక్షోభం వస్తే ఆయన సైలెంట్

ప్రధాని మోదీపై కేజ్రీవాల్ విమర్శ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. గురువారం ఢిల్లీ రాష్ట్ర శాసనసభ ఇందుకు వేదికైంది. ' కూతురు లాంటి మణిపూర్ తీవ్ర విద్వేషాగ్నిలో చిక్కుకున్నపుడు తండ్రి స్థానంలో ఉన్న ప్రధాని మోదీ.. ఆమెన కాపాడాల్సిదిపోయి, పట్టించుకోకుండా మరో వైపు తిరిగి నిల్చున్నారు. మోదీ మౌనంగా ఎందుకున్నారని దేశం యావత్తు ప్రశ్నిస్తోంది. ఆయన ఇలా మౌనముద్రలో ఉండటం ఇదే తొలిసారి కాదు. గత తొమ్మిదేళ్ల పాలనా కాలంలో దేశంలో ఎక్కడ సంక్షోభం ఎదురుపడ్డా ఆయన ఇలాగే సైలెంట్ అయిపోయారు' అని కేజ్రీవాల్ విమర్శించారు. ' పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిల్చిన మహిళా మల్లయోధులు బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ యాదవ్‌పై లైంగిక ఆరోపణలు చేసినపుడూ మోదీ మౌనవ్రతం చేశారు. ఇదే మహిళా రెజ్లర్లు పతకాలు గెల్చినపుడు వారితో ఫొటోలు దిగేందుకు మొదట ముందుకొచ్చింది మోదీనే. 'మీరు నా బిడ్డలు' అని భరోసా ఇచ్చారు. కానీ తీరా వాళ్లు ధర్నాలు చేస్తుంటే మోదీ మౌనముద్రలోకి జారుకున్నారు. కనీసం ప్రధాని హోదాలో 'నేనున్నాను. ఎంక్వైరీ చేయించి సంబంధిత వ్యక్తుల్ని శిక్షిస్తానని హామీ ఇవ్వలేకపోయారు. కనీసం ఎఫ్‌ఐఆర్ నమోదు కోసం మహిళలు ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఇక మణిపూర్ అంశంలోనూ ఇంతే ' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.


వర్షబీభత్సానికి చివురుటాకులా వణికిన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ముంపు ప్రాంతంలోని మహిళను హెలికాప్టర్ సాయంతో కాపాడుతున్న భారత వాయుసేన సిబ్బంది.

మధ్యప్రదేశ్ ఇన్‌చార్జిగా సూర్జేవాలా

- యూపీసీసీ చీఫ్‌గా అజయ్ రాయ్
- కీలక నియామకాలను ప్రకటించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ గురువారం సంస్థాగతంగా కీలక మార్పులను ప్రకటించింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన మధ్యప్రదేశ్‌కు పార్టీ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జిగా రణదీప్ సూర్జేవాలాను నియమించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే అజయ్ రాయ్‌కు అప్పగించింది. గుజరాత్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జిగా ముకుల్ వాస్నిక్‌ను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారని ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పార్టీ కర్ణాటక ఇన్‌చార్జిగా ఉన్న సూర్జేవాలా మధ్యప్రదేశ్ బాధ్యతలు అదనంగా నిర్వహిస్తారు. సూర్జేవాలాను మధ్యప్రదేశ్ సీనియర్ ఎన్నికల పరిశీలకుడిగా ఇటీవలే పార్టీ నియమించింది. అజయ్ రాయ్ 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నియోజకవర్గం నుంచి ప్రధాని మోదీపై పోటీ చేశారు. దళిత నేత, యూపీ పార్టీ చీఫ్ బ్రిజ్‌లాల్ ఖబ్రి స్థానంలో రాయ్ తక్షణమే నూతన బాధ్యతలు చేపడతారని పార్టీ ప్రకటన పేర్కొంది.

మణిపూర్ మండిపోతుంటే బీజేపీ ప్రచారంలో బిజీ: ఖర్గే

న్యూఢిల్లీ: మణిపూర్ తగలబడుతుంటే బీజేపీ మాత్రం ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మునిగి తేలుతోందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపించారు. గురువారం ఆయన ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగిన మహిళా కాంగ్రెస్ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. మహిళా నేతలు కష్టపడి పని చేయాలన్నారు. 'మన నేత రాహుల్ మణిపూర్‌కు వెళ్లగా లేనిది ప్రధాని ఎందుకు వెళ్లడం లేదు? 'అని ఖర్గే ప్రశ్నించారు. మణిపూర్‌లో అత్యాచారాలు జరుగుతున్నా మౌనంగా ఉండిపోయిన ప్రధాని మోదీ..అవిశ్వాస తీర్మానం తెచ్చిన తర్వాత మాత్రమే పార్లమెంట్‌లో మాట్లాడారన్నారు.

వసుంధర రాజే లేకుండానే బీజేపీ ఎన్నికల కమిటీలు

జైపూర్: రాజస్థాన్‌లో కాంగ్రెస్‌ను అధికార పీఠంపై నుంచి కిందకు దించేందుకు కంకణం కట్టుకున్న బీజేపీ తన పార్టీ కీలక నేతలతో కమిటీలను ఏర్పాటుచేసింది. ఈ మేరకు రెండు కీలక ఎలక్షన్ కమిటీలను ప్రకటించింది. అయితే ఈ రెండూ కమిటీల్లోనూ బీజేపీ రాష్ట్ర నేత, మాజీ మహిళా ముఖ్యమంత్రి వసుంధ రాజే పేరు చేర్చకపోవడం గమనార్హం. 21 మంది సభ్యులున్న ఎన్నికల నిర్వహణ కమిటీకి మాజీ ఎంపీ నారాయణ్ పాంచారియా నేతృత్వం వహిస్తారు. మేనిఫెస్టో కమిటీకి కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ సారథ్యం వహించనున్నారు. రాజేకు ప్రాతినిధ్యం కల్పించని అంశాన్ని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అరుణ్ సింగ్ ముందు ప్రస్తావించగా.. 'ఎన్నికల ప్రచారంలో ఆమె కీలకంగా ప్రచారం చేస్తారుగా. అయినా ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు. పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొంటారు. ఆమె అంటే మాకెంతో గౌరవం' అని అసలు విషయాన్ని దాటవేశారు.


సందర్శకులకు తాజా టీను తయారుచేసి అందిస్తున్న రోబోటిక్ చేయి. గురువారం చైనాలోని బీజింగ్ నగర శివారులో నిర్వహించిన వార్షిక ప్రపంచ రోబోట్ సదస్సులో తీసిందీ ఫొటో.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



ఉత్తర భారతీయులకు ప్రభుత్వం అండ

నగరంలోని ఉత్తర భారతీయులకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. -8లో



నిలిచిన వందేభారత్ సేవలు

సికింద్రాబాద్ నుంచి విశాఖకు గురువారం బయలుదేరాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సేవలకు ఆటంకం కలిగింది. దాని స్థానంలో అధికారులు మరో రైలును ఏర్పాటు చేశారు. -8లో

మాజీ విదేశాంగ కార్యదర్శిని కలిసిన పాస్‌పోర్టు అధికారి



రాంగోపాల్‌పేట్: నగరానికి వచ్చిన మాజీ విదేశాంగ కార్యదర్శి అనుపమా రావును ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య కలిశారు. వీరి వెంట ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులున్నారు.


ఒక్క ఫొటో చాలు

వంద వార్తా కథనాలతో సమానం: ఎంపీ జోగినపల్లి సంతోష్

ఫొటోగ్రఫీ ఒక కళ అని రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం రవీంద్ర భారతిలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఒక మంచి ఫొటో వంద వార్తా కథనాలతో సమానమన్నారు. ఫొటో జర్నలిస్టు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని అందుకోసం తన ఎంపీ నిధుల నుంచి రూ.2 లక్షలను అందజేస్తానని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. ఉత్తమ ఫొటోలను ఎంపిక చేసి వారికి అవార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సర్వేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. – గన్‌ఫౌండ్రీ



ఫొటోలను తిలకిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్, అల్లం నారాయణ తదితరులు



రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాల ప్రదర్శన

39 కేసులు.. 15 సార్లు జైలు

అయినా తీరు మారలేదు..



చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ మహ్మద్ సద్దాం

హిమాయత్‌నగర్: ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా అతడిపై 39 కేసులు. ఇప్పటి వరకు దాదాపు 15 పర్యాయాలు జైలుకు వెళ్లొచ్చాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. చైన్ స్నాచింగ్‌లు చేస్తూనే ఉన్నాడు.

ఇటీవల నారాయణగూడ పోలీసుస్టేషన్‌లో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి మెడలో నుంచి బంగారు చైన్‌ను దొంగలించిన ఘటనలో మరోసారి జైలు పాలయ్యాడు. రంగారెడ్డి జిల్లా చిన్న మంగళారం గ్రామానికి చెందిన బ్యాగరి పోచయ్య ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఓ కారు షోరూంలో హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా చేస్తున్నాడు. బుధవారం ఇంటి నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరిన పోచయ్య మెహిదీపట్నంలో బస్సు దిగి అక్కడి నుంచి 113ఎస్ బస్సులో క్రాస్ రోడ్‌కు బస్సు ఎక్కాడు. నారాయణగూడ బస్టాప్ వద్దకు రాగానే అతని మెడలో ఉన్న 1.5 తులాల గోల్డ్ చైన్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురై నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చైన్‌ను దొంగిలించింది పాత నేరస్తుడు మహమ్మద్ సద్దాంగా గుర్తించారు. గురువారం ఓల్డ్ సిటీ టపాచబుత్రలోని అతని ఇంట్లో అరెస్టు చేశారు. గోల్డ్ చైన్‌ను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ చెప్పారు. నిందితుడిపై గతంలో పీడీ యాక్ట్ కూడా నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

అదే పదివేలు!



మూసీ నివాసితులకు 'డబుల్' ఇళ్లు



- పదివేల గృహాలు కేటాయించనున్న ప్రభుత్వం
- కబ్జాలు తొలగించి ప్రాజెక్టు పనులకు శ్రీకారం
- ఎమ్మెల్యేలతో సమావేశంలో మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: దుర్భర పరిస్థితుల్లో జీవనం గడుపుతున్న మూసీ నివాసితులైన పేదలకు సదుపాయాలు కలిగిన డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి మూసీ కబ్జాలను తొలగిస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. గ్రేటర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో వారి పునరావాసం కోసం దాదాపు పదివేల ఇళ్లను కేటాయించనున్నట్లు తెలిపారు. వరద నివారణ కోసం మూసీ కబ్జాలను తొలగించి మూసీని బలోపేతం చేస్తామన్నారు. తద్వారా భవిష్యత్ ప్రణాళికలను అమలు చేసేందుకు కూడా ఆక్రమణల సమస్య లేకుండాపోతుందన్నారు. గురువారం జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో నగరాభివృద్ధి తదితర అంశాలపై కేటీఆర్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. నగరంలో చేపట్టిన వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) పనుల వల్ల ఈ సంవత్సరం వరద కష్టాలు తగ్గాయని, ఎస్ఎన్‌డీపీతో పాటు మూసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వానికి తాము అండగా ఉంటామని ముక్త కంఠంతో తెలిపారు. అందుకుగాను మూసీ వద్ద నివసిస్తున్న పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని ఏకగ్రీవంగా కోరారు. వరద నివారణకు ఎమ్మెల్యేలే ముందుకు రావడం ముదావహమంటూ మంత్రి అందుకు అంగీకరించారు. కబ్జాలు తొలగించాక మూసీ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. మూసీ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్ట్ ప్రాథమిక ప్రణాళిక కూడా పూర్తయిందని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. మూసీ వెంట వరద ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న నిర్మాణాలను తొలగించి, మూసీని బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే గుర్తించిన మూసీ నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయిస్తుందని తెలిపారు.

తప్పనున్న వరద ముప్పు..

మూసీ వరద నుంచి పేద ప్రజలను, నగరాన్ని కాపాడే ఉదాత్తమైన ప్రభుత్వ కార్యక్రమానికి ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలే స్వయంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొంటామని తెలపడంపై మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. తద్వారా భవిష్యత్తులో మూసీ పరీవాహక ప్రాంతాలకు వరద ప్రమాదం తగ్గుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులను త్వరలో మంజూరు చేస్తామన్నారు. నగరంలో వాననీటి నిర్వహణ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటికే ప్రకటించిన విధంగా వచ్చే వారంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తుందని తెలిపిన కేటీఆర్, ఈ మేరకు ఆయా నియోజకవర్గాల్లో గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామన్నారు.

ప్రజల్లోకి వెళ్లండి.. చేసిన అభివృద్ధి చెప్పండి..

నగరంలో గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్న నివేదికలు తమ వద్ద ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో వారి మద్దతు కోరాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరం కోసం ప్రత్యేకంగా చేస్తున్న అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

న్యూస్‌రీల్

తొంభై ఏళ్ల వృద్ధుడికి బీటింగ్ హార్ట్ బైపాస్ సర్జరీ



రోగితో వైద్య బృందం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో 90 ఏళ్ల వృద్ధుడికి బీటింగ్ హార్ట్ బైపాస్ సర్జరీ విజయవంతంగా చేశారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్డియాక్ సర్జరీ డైరెక్టర్ డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ మాట్లాడుతూ.. ఎలాంటి కోతలు లేకుండా, గుండె ఆగకుండా బైపాస్ సర్జరీ చేశామన్నారు. రాయపూర్‌కు చెందిన పరశురామ్‌కు విశ్రాంతి సమయంలో ఛాతీలో నొప్పి రాగా ఆంజియోగ్రఫీ చేశారు. ఎడమ వైపు ప్రధాన కరోనరీ ఆర్టరీ బిగుతుగా ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఈ సర్జరీ చేశామన్నారు. రోగి కోలుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నీలేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'మైనారిటీ బంధు'

- గ్రేటర్ పరిధిలో 4,500 మంది లబ్ధిదారులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మైనారిటీ బంధు పథకం కింద రూ. లక్ష సాయం పంపిణీ చేయనున్నారు. ఈ నెల 19న ఎల్బీ స్టేడియం వేదికగా చెక్కులను పంపిణీ చేయనున్నారు. గ్రేటర్ పరిధిలో 4,500 మందికి రూ.లక్ష చొప్పున సాయం అందజేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. మైనారిటీ బంధు పథకం కింద చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో ఈ సాయం అందించనుంది.

1,641 వాహనాల వేలం

- రూ.92.70 లక్షల ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 1,641 వాహనాలను గోషామహల్ పోలీసు గ్రౌండ్స్‌లో హైదరాబాద్ సిటీ పోలీసులు గురువారం బహిరంగ వేలం వేశారు. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ జాయింట్ సీపీ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో 17వ వేలం జరిగింది. వీటిలో 1,604 బైక్‌లు, 25 త్రీవీలర్స్, 12 ఫోర్ వీలర్ వాహనాలున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 550 మంది బిడ్డర్‌లు వేలంలో పాల్గొన్నారు. రూ.92.70 లక్షల ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు.

రాయదుర్గం మెట్రో భూమి తాకట్టు!

15 ఎకరాల వాణిజ్య స్థలంపై సబ్ లైసెన్స్ హక్కులు

- లీజు కాల పరిమితి ఉన్నంత వరకు కొనసాగింపు
- భూమిని విక్రయించలేదని ఎల్అండ్‌టీ స్పష్టీకరణ
- సబ్ లైసెన్స్ హక్కులు మాత్రమే ఇచ్చినట్లు వెల్లడి
- నష్టాలను అధిగమించేందుకు పడరాని పాట్లు



సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న అత్యంత విలువైన 15 ఎకరాల భూమిని ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో తాకట్టుపెట్టింది. ఈమేరకు రాఫర్టీ డెవలప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు సబ్‌లైసెన్స్ హక్కులను కల్పించింది. ఎల్అండ్‌టీకి లీజు గడువు ఉన్నంత కాలం తాకట్టు కొనసాగనుంది. మరోవైపు ఈ భూమిని విక్రయించలేదని, అది ప్రభుత్వ అధీనంలోనే ఉందని, సబ్‌లైసెన్సింగ్ హక్కులను కల్పిస్తూ తాము తాకట్టు మాత్రమే పెట్టినట్లు ఎల్అండ్‌టీ వెల్లడించింది. సబ్‌లైసెన్సింగ్‌కు సంబంధించిన ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, మరిన్ని ఆమోదాలు పొందాల్సి ఉందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. అవసరమైన అన్ని ఆమోదాలను పొందిన తర్వాత లావాదేవీల విలువ ఖరారవుతుందని చెప్పారు. ఈ మేరకు ఈజీఎంలోని షేర్‌హోల్డర్ల ఆమోదం పొందిన తర్వాత బీఎస్ఈకి సైతం తెలియజేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు రాయదుర్గం మెట్రోస్టేషన్ పక్కనే అత్యంత విలువైన ఈ స్థలంలో ఒక వాణిజ్య భవనం కూడా ఉంది. దీనిపై సబ్‌లైసెన్సు హక్కులను కల్పిస్తూ మానిటైజ్ చేయడం ద్వారా ఎల్అండ్‌టీ మెట్రోకు పెద్ద మొత్తంలోనే ఆదాయం లభించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాఫర్టీతో పాటు బ్రూక్‌ఫీల్డ్, రహేజా కార్పొరేషన్లు కూడా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్లు సమాచారం. మెట్రో రైలు అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రభుత్వం ఈ విలువైన స్థలాన్ని ఎల్అండ్‌టీకి 33 ఏళ్ల లీజు రాసిచ్చిన విషయం తెలిసిందే. ఈ లీజు ఒప్పందం మేరకు రాయదుర్గంలోని పదిహేను ఎకరాల వాణిజ్య స్థలంలో 9 ఎకరాల్లో సుమారు రూ.200 కోట్లతో వాణిజ్య భవనాన్ని నిర్మించారు. ఈ భవనంతో పాటు మొత్తం స్థలాన్ని ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ తాకట్టు పెట్టడం గమనార్హం.

నష్టాల నుంచి గట్టెక్కేందుకు..

- ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో ఎల్అండ్‌టీ తీవ్ర నష్టాలను చవిచూస్తోంది. ప్రస్తుతం దాదాపు రూ.3500 కోట్ల వరకు నష్టాలు ఉన్నట్లు అంచనా. ఎలాంటి నష్టం లేకుండా మెట్రో రైళ్లు నడిపేందుకు నగరంలో ప్రతి రోజు కనీసం 16 లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకోవాలి. కానీ ప్రస్తుతం 5.10 లక్షల మంది ప్రయాణికులు మెట్రోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు కోవిడ్ ఆ సంస్థను మరింత దారుణంగా దెబ్బతీసింది. కోవిడ్ అనంతరం క్రమంగా కోలుకున్నప్పటికీ ప్రయాణికుల టిక్కెట్లపై 40 శాతం కూడా ఆదాయం లభించడం లేదని ఎల్అండ్‌టీ వర్గాలు పేర్కొన్నాయి. వాణిజ్య ప్రకటనలపైనా పెద్దగా ఆదాయం లభించడం లేదు. మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లపై వచ్చే ఆదాయం కూడా తక్కువే. దీంతో ప్రతిరోజు రూ.కోటికి పైగా నష్టాలతో రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే నష్టాల నుంచి గట్టెక్కేందుకు ఎల్అండ్‌టీ ఇటీవల కొంతకాలంగా వివిధ మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిసింది.
- మెట్రోరైల్ అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రభుత్వం ఎల్అండ్‌టీకి పెద్ద ఎత్తున భూములను లీజుకు ఇచ్చింది. సుమారు 104 ఎకరాల్లో మియాపూర్ వద్ద ఒక డిపోను, మరో 110 ఎకరాల్లో నాగోల్ వద్ద మరో డిపోను నిర్మించారు. ఇవి కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 69 ఎకరాల అత్యంత విలువైన (ప్రైమ్ ల్యాండ్స్)కూడా ఆ సంస్థకు లీజు ద్వారా దక్కాయి. ఈ 69 ఎకరాల్లోనే ప్రస్తుతం రాయదుర్గం మెట్రోస్టేషన్ వద్ద ఉన్న 15 ఎకరాలపై సబ్‌లైసెన్స్ హక్కులను కల్పిస్తూ సదరు సంస్థకు తాకట్టు పెట్టడం గమనార్హం. నిజానికి ప్రభుత్వం ఎల్అండ్‌టీకి లీజుకు ఇచ్చిన భూములను వాణిజ్యపరంగా వినియోగించుకొని ఆదాయాన్ని ఆర్జించేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆ భూములను విక్రయించేందుకు ఎలాంటి హక్కులు లేవు. కానీ లీజు గడువు ఉన్నంత వరకు ప్రాతిపదికన తాజాగా తాకట్టుకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని పొందేందుకు చర్యలు చేపట్టింది.

ప్రభుత్వానికి తిరిగి దక్కేనా..

రాయదుర్గం వద్ద ఉన్న 15 ఎకరాలను తాకట్టు పెట్టగా మరో 54 ఎకరాలు మాత్రమే ఎల్అండ్‌టీ వద్ద ఉంది. నష్టాల నుంచి గట్టెక్కేందుకు ఈ భూములను సైతం ఇదే పద్ధతిలో సబ్‌లైసెన్సింగ్ హక్కుల రూపంలో తాకట్టు పెడుతూ పోతే పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. లీజు గడువు ముగిసిన అనంతరం ప్రభుత్వానికికే మేరకు తిరిగి దక్కుతాయా లేదా అనేది కూడా సందేహాస్పదమే. అలాగే సబ్‌లైసెన్సింగ్ హక్కులు కల్పించే నెపంతో తాకట్టుపెట్టడం ఏ మేరకు చట్టసమ్మతమనేది కూడా సందేహాలనే రేకెత్తిస్తోంది.



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న కొత్వాల్ సీవీ ఆనంద్

లగ్జరీ కార్లలో గాంజా సరఫరా

- ఆర్టీఏ, పోలీసుల కంట పడకుండా వాహనాల్లో రహస్య క్యాబిన్లు
- 44 కిలోల గంజాయితో పాటు రూ.కోటి సొత్తు స్వాధీనం

నైజీరియన్ నేరస్తులకు న్యాయ సేవలు

- ఏకంగా అసోసియేషన్‌ను ఏర్పాటు చేసిన డ్రగ్ పెడ్లర్
- బెయిళ్లు, డిపోర్టేషన్ వంటి సర్వీస్‌లు
- పోలీసులకు చిక్కిన ఒగ్బాగు డేవిడ్ ఉకా

ఇక డ్రగ్ పెడ్లర్ల ఆస్తులు వేలం!

- నేరస్తుల స్థిర, చరాస్తులపై సఫేమా అస్త్రం
- చెన్నైలో కాంపిటెంట్ అథారిటీ ఏర్పాటు
- డ్రగ్ పెడ్లర్ వీరన్న రూ.4 కోట్ల ఆస్తులు జప్తు

- వివరాలు 8లో

నెక్నాంపూర్ చెరువుకు నీతి ఆయోగ్ గుర్తింపు



నెక్నాంపూర్ చెరువు

మణికొండ: సమస్త ప్రాణకోటికి జీవనాధారమైన చెరువులను ప్రస్తుత పరిస్థితిలో ఎలా పరిరక్షించుకోవాలి? ఎలా నిర్వహించుకోవాలి? అనే విషయాల్ని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువును చూసి నేర్చుకోవాలని నీతి ఆయోగ్ పేర్కొంది. పర్యావరణ పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ, ప్రజల సందర్శన తదితర అంశాలపై దేశవ్యాప్తంగా చేపట్టిన చెరువుల వివరాలను ఆన్‌లైన్‌లో పంపాలని నీతి ఆయోగ్ కోరింది. దీంతో దేశ వ్యాప్తంగా అనేక చెరువుల వద్ద చేపట్టిన చర్యలను వివరిస్తూ నివేదికలను వచ్చాయి. వీటిలో దేశంలోనే నెక్నాంపూర్ చెరువును మార్గదర్శకంగా ఉందని ప్రకటించారు. ఇదే తరహాలో రాబోయే రోజుల్లో అన్ని చెరువులు తిరిగి పునరుజ్జీవం పొందాల్సిన అవసరం ఉందన్నారు. తమ అధీనంలో పునరుజ్జీవం పొందిన నెక్నాంపూర్ చెరువును నీతి ఆయోగ్ గుర్తించటం ఎంతో ఆనందంగా ఉందని ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి పేర్కొన్నారు.

దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

● మంత్రి శ్రీనివాస్ గౌడ్



ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మాదాపూర్: ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఆర్ట్ గ్యాలరీ సంయుక్తంగా మేరీ మాటి-మేరా దేశ్ పేరిట ఏర్పాటు చేసిన ప్రముఖ తెలుగు స్వతంత్ర సమరయోధుల ఛాయా చిత్ర ప్రదర్శనను, ఫొటోగ్రాఫర్ కుల్వంత్‌రాయ్ (1914-1984) మధ్య కాలంలో తీసిన అరుదైన చిత్రాల ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆ ప్రదర్శనలో 30కి పైగా సమరయోధుల చరిత్రను తెలిపే విధంగా ఫొటో చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రదర్శనలు అన్ని చోట్ల నిర్వహించాలన్నారు. కుటుంబాలతో వచ్చి చూడాల్సిన ప్రదర్శనలని తెలిపారు. చిన్నారులకు చిన్నపటి నుంచే సమరయోధుల చరిత్రను వివరించాలన్నారు. అప్పుడే సామాజిక బాధ్యతతో ప్రయోజకులు అవుతారని తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. కార్యక్రమంలో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జికి 'నాయిని' పేరు

రేపు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



ఎమ్మెల్యే ముఠా గోపాల్



సాక్షి, సిటీబ్యూరో: ముషీరాబాద్: ఇందిరాపార్కు నుంచి వీఎస్టీ వరకు ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మీదుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.426 కోట్లతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జి ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఇందిరాపార్కు చౌరస్తాలో మంత్రి కేటీఆర్ స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించనున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తీరుతుందని, నగరంలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మీదుగా వెళ్లే వాహనాదారులకు ఇది ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని తెలిపారు. ఎటువంటి రోడ్డు వెడల్పు లేకుండా దుకాణదారులకు నష్టం కలిగించకుండా అనుకున్న సమయానికి స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో మెట్రో ట్రైన్ మీదుగా అత్యంత ఎత్తు నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేవలం స్టీల్ మాత్రమే ఉపయోగించి నిర్మించినట్లు తెలిపారు. ఇది నగరానికే తలమానికమని ఆయన కొనియాడారు. కాగా.. స్టీల్ బ్రిడ్జికి మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేరును ఖరారు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం తొలి హోంమంత్రిగా నాయిని నర్సింహారెడ్డి పనిచేశారని, స్టీల్ బ్రిడ్జికి ఆయన పేరు పెడుతున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వు జారీ చేయనుందన్నారు. నాయిని నరసింహారెడ్డి సుదీర్ఘ కాలం పాటు ముషీరాబాద్ కేంద్రంగా రాజకీయాల్లో పాల్గొని తెలంగాణ ఉద్యమానికి అనేక సేవలందించారన్నారు. అక్కడే ఉన్న వీఎస్టీ ఫ్యాక్టరీ కార్మికుల యూనియన్ నాయకుడిగా దశాబ్దాల పాటు పనిచేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండు ప్రాంతాల్లో నాయిని సేవలను దృష్టిలో ఉంచుకొని స్టీల్ బ్రిడ్జికి నాయిని నర్సింహారెడ్డి పేరు పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి కేటీఆర్ తెలిపారు.

నిలిచిన వందేభారత్ సేవలు

- సికింద్రాబాద్ నుంచి విశాఖకు సంప్రదాయ ఎక్స్‌ప్రెస్ ఏర్పాటు
- అదనపు చార్జీలను తిరిగి చెల్లించిన ద.మ.రైల్వే
- విశాఖ నుంచి వచ్చే వందేభారత్‌లో సాంకేతిక సమస్య

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ నుంచి విశాఖకు గురువారం బయలుదేరవలసిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సేవలకు ఆటంకం కలిగింది. దీంతో దాని స్థానంలో దక్షిణమధ్య రైల్వే అధికారులు మరో ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. దీంతో ఆ రైలు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరింది. వందేభారత్‌లో ప్రయాణం చేసేందుకు టిక్కెట్‌లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు చార్జీల్లోని వ్యత్యాసాన్ని తిరిగి చెల్లించినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ తెలిపారు. వంద శాతం ఆక్యుపెన్సీతో ట్రైన్ బయలుదేరిందని, 24 మంది ప్రయాణికులు మాత్రమే తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారని పేర్కొన్నారు. వారికి చార్జీలను పూర్తిగా రీఫండ్ చేసినట్లు చెప్పారు. విశాఖపట్నం – సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం కారణంగా అసాధారణమైన పరిస్థితి ఏర్పడింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే అత్యవసర చర్యలు చేపట్టింది. ప్రయాణికుల డిమాండ్ మేరకు సంప్రదాయ రేక్‌తో ప్రయాణ సదుపాయం కల్పించినట్లు సీపీఆర్వో వివరించారు. పూర్తిగా ఏసీ సదుపాయం ఉన్న ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వందే భారత్ షెడ్యూల్ ప్రకారమే ఇది బయలుదేరింది. అలాగే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఆగే స్టేషన్‌లలో మాత్రమే దీనికి హాల్టింగ్ కల్పించారు. ప్రయాణికుల సౌకర్యార్థం స్టాపింగ్ స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు దిశానిర్దేశం చేసేందుకు స్టేషన్లలో అదనపు సిబ్బందిని కూడా నియమించారు.మరోవైపు ప్రయాణికులకు సహాయం చేసేందుకు అదనపు టిక్కెట్ చెకింగ్ సిబ్బందితో పాటు భద్రతా సిబ్బందిని కూడా నియమించారు. వందేభారత్ రైలు సేవలతో సమానమైన క్యాటరింగ్ ఏర్పాట్లను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ప్రయాణ అవసరాలను తీర్చడానికి చాలా తక్కువ వ్యవధితో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులకు తగిన వసతులను అందించడంతో పాటు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సత్వర చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగుల బృందాన్ని ఆయన అభినందించారు.

ప్రమాదవశాత్తు కిందపడి గర్భిణి మృతి



శ్రీనిఖ (ఫైల్)

హఫీజ్‌పేట్ : రెండో అంతస్తుపై నుంచి కిందపడి ప్రమాదవశాత్తు గర్భిణి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పాలవెల్లి తెలిపిన ప్రకారం.. లింగంపల్లి గ్రామంలోని వెంకట్‌రెడ్డి కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి అన్న కూతురు శ్రీనిఖకు గతేడాది డిసెంబర్‌లో వివాహమైంది. ఆమె ఇప్పుడు ఐదు నెలల గర్భిణి. కాగా రెండు రోజుల క్రితం కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో చెకప్ కోసం తన బాబాయ్ ఇంటికి వచ్చింది. వీరు మూడంతస్తుల భవనంలోని రెండవ అంతస్తులో ఉంటున్నారు. గురువారం ఉదయం 7.10 గంటలకు శ్రీనిఖ నిద్రలేచి బాల్కనిలోకి వచ్చి వాకింగ్ చేసింది. కొద్దిసేపటికి కళ్లు తిరుగుతున్నాయని చెప్పగా ఆమె పిన్ని ఇంట్లోకి వెళ్లమని సూచించి కిందకు దిగింది. ఇంతలోనే శ్రీనిఖ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు వెంటనే మదీనాగూడలోని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని చందానగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లగ్జరీ కార్లలో 'గాంజా' సరఫరా!

- కరడుగట్టిన గంజాయి ముఠా ఆటకట్టు
- ఏజెన్సీ ప్రాంతాలలో కొనుగోలు.. హైదరాబాద్, మహారాష్ట్రలో విక్రయం
- ముఠాలో సభ్యులుగా ఇద్దరు ఆక్టోపస్, గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు
- 44 కిలోల గంజాయి, రూ.కోటి సొత్తు స్వాధీనం
- సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: ఆంధ్రా–ఒరిస్సా ఏజెన్సీ ప్రాంతాల నుంచి అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి హైదరాబాద్, మహారాష్ట్రలలో విక్రయిస్తున్న ముఠా ఆటకట్టించారు హైదరాబాద్ పోలీసులు. ఆరుగుర్ని అరెస్టు చేసి రూ.కోటి విలువ చేసే 44 కిలోల గంజాయి, 4 లగ్జరీ కార్లు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్‌న్యాబ్) డైరెక్టర్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం మీడియాకు వెల్లడించారు.

◆ మహబూబాబాద్ జిల్లా ఈపూరు గ్రామానికి చెందిన వంకుడోతు వీరన్న అలియాస్ వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చెడు మార్గం పట్టాడు. ఈ మేరకు సూర్యాపేటలోని నివాసం ఉంటున్న తన మేనమామ తేజావత్ చందా దగ్గరికి వెళ్లాడు. ఇతను ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తుండేవాడు. ఇతని వద్ద వీరన్న డ్రైవర్‌గా చేరాడు. గంజాయి నెట్‌వర్క్‌పై పట్టు సాధించిన వీరన్న కొద్ది కాలంలోనే బాగా డబ్బు సంపాదించాడు. 2018 నుంచి గంజాయి పెడ్లర్‌గా అవతారం ఎత్తాడు. ఈపూరుకు చెందిన అజ్మీరా వీరన్న అలియాస్ లాలు, సూర్నేని మనోజ్ అలియాస్ మనోజ్/మణి, మెరుగు మధు, గ్రేహౌండ్స్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మరిపెడ మండలం తోప్లా తండాకు చెందిన ప్రశాంత్ నాయక్, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మహ్మద్ జహంగీర్‌లతో ముఠాను ఏర్పాటు చేశాడు.

◆ మల్కనగిరి, సీలేరు, డొంకరాయి వంటి ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి హైదరాబాద్, మహారాష్ట్రలో విక్రయించడం మొదలుపెట్టాడు. మల్కనగిరి చెందిన గంజాయి సాగు చేసే సోమరాజు వద్ద కిలో గంజాయి రూ.4 వేలకు కొనుగోలు చేస్తాడు. దీన్ని మహారాష్ట్రలోని బీడ్‌కు చెందిన నిఖిలేష్ అలియాస్ బాబుకు కిలో రూ.20–25 వేలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 16న రెండు కార్లలో గంజాయిని సరఫరా చేస్తుండగా..విశ్వసనీయ సమాచారం అందుకున్న టీఎస్ న్యాబ్, లంగర్‌హౌస్ పోలీసులు నిందితులను పట్టుకున్నారు. ఇప్పటికే వీరన్నపై సుబేదారి, ఉస్మానియా యూనివర్సిటీ, మోతుగూడెం, షాద్‌నగర్ పీఎస్‌లలో నాలుగు కేసులున్నాయి.

విమానంలో వెళ్లి గంజాయి విక్రయం..

ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి డ్రైవర్‌ను వాహనం తీసుకొని మహారాష్ట్రలోని బీడ్‌కు వెళ్లమని చెప్తాడు. ఆ తర్వాత వీరన్న హైదరాబాద్‌కు వచ్చి విమానంలో మహారాష్ట్రకు వెళతాడు. అప్పటికే అక్కడ ఎదురు చూస్తున్న డ్రైవర్ నుంచి గంజాయిని సేకరించి, నిఖిలేష్‌కు విక్రయిస్తాడు. గంజాయి సరఫరా కోసం నిందితుడు వీరన్న బినామీ పేర్లతో కార్లను కొనుగోలు చేశాడు. ఆయా వాహనాలలో రహస్య క్యాబిన్లను ఏర్పాటు చేయించాడు.

పోలీసు సైరన్ మోగిస్తూ..

గాంజా సప్లయి చేసేక్రమంలో మార్గం మధ్యలో పోలీసులు, ఆర్టీఏ అధికారుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు పోలీసు సైరన్ మోగిస్తూ వెళ్తుంటాడు. నిజమైన పోలీసుల లాగా ప్రవర్తించేందుకు వీరన్నకు ఆక్టోపస్ కానిస్టేబుల్ ప్రశాంత్, గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ రాములు శిక్షణ ఇచ్చారు. నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు సృష్టించారు. చెక్‌పోస్టులు, టోల్‌గేట్ల వద్ద పోలీసు సైరన్ వేసుకుంటూ కార్లకు డిప్యూటీ తహశీల్దారు, సబ్ ఇన్‌స్పెక్టర్ నకిలీ నేమ్‌ప్లేట్లు పెట్టుకొని టోల్‌గేట్ సిబ్బందిని బోల్తాకొట్టిస్తారు. గంజాయి దందాలో వీరన్న గత మూడేళ్లలో దాదాపు రూ.4 కోట్లు సంపాదించినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు.

ఇక డ్రగ్ పెడ్లర్ల ఆస్తులు వేలం!

- నేరస్తుల స్థిర, చరాస్తులపై 'సఫేమా' అస్త్రం
- చెన్నైలో కాంపిటెంట్ అథారిటీ ఏర్పాటు
- డ్రగ్ పెడ్లర్ వీరన్న రూ.4 కోట్ల ఆస్తులు జప్తు

సాక్షి, సిటీబ్యూరో: మాదక ద్రవ్యాల సరఫరా మీదనే కాదు ఈ దందాతో పెడ్లర్లు సంపాదించే సంపాదనపై కూడా పోలీసులు ఉక్కుపాదం మోపనున్నారు. ఇంతకాలం నేరస్తులను పట్టుకొని, రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. ఇక నుంచి నేరస్తుల ఆస్తులను జప్తు చేసి, వాటిని వేలం వేసేందుకు నిర్ణయించారు. ఈమేరకు స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మానిప్యులేటర్స్ (ఎస్ఏఎఫ్ఈఎంఏ-సఫేమా) ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తాజాగా పోలీసులకు పట్టుబడ్డ గంజాయి స్మగ్లర్ వంకుడోతు వీరన్న రూ.4 కోట్లు సంపాదించినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. దీంతో ఎన్‌డీపీఎస్–1985 చట్టంలోని చాప్టర్ (5 ఏ) కింద ఆయా ఆస్తులను జప్తు చేసి, నివేదికను సఫేమా ట్రిబ్యునల్‌కు పంపించేందుకు నిర్ణయించామని తెలిపారు.

వీరన్న గంజాయి ఆస్తులివే..

విలాసవంతమైన జీవనంతో పాటు భవిష్యత్తు అవసరాల కోసం వీరన్న పలు విభాగాలలో పెట్టుబడులు సైతం పెట్టినట్లు గుర్తించారు. సొంతూరిలో రూ.30 లక్షలు వ్యయంతో జీ+1 అంతస్తులో విలాసవంతమైన ఇండిపెండెంట్ గృహాన్ని నిర్మించాడు. మా మార్ట్ సూపర్ మార్కెట్‌లో రూ.50 లక్షల పెట్టుబడితో పాటు మోహినీ వైన్స్‌లో రూ.15 లక్షల పెట్టుబడితో 13 శాతం వాటాను కొనుగోలు చేశాడు. ఉప్పల్‌లో రూ.12 లక్షలు పెట్టి ఒక ప్లాట్ కొనుగోలు చేశాడు. స్వాధీనం చేసుకున్న నాలుగు వాహనాలతో పాటు మరొక ఇన్నోవా క్రిస్టా, జేసీబీ కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ప్రకాశం జిల్లాలో మైనింగ్‌లో జేసీబీని అద్దెకు ఇచ్చాడు.

ఏంటీ సఫేమా?

◆ సఫేమా అనేది అక్రమ రవాణా, విదేశీ మారక ద్రవ్యాల అవకతవకలకు పాల్పడే నేరస్తులు అక్రమంగా సంపాదించిన సంపదను జప్తు చేయడానికి ఉద్దేశించబడిన చట్టం. నేరస్తుల ఆర్థిక బలాన్ని దెబ్బతీసి, వారి వనరులను తగ్గిచడం దీని ప్రధాన లక్ష్యం. ఈ చట్టం కింద రెండు విధాలుగా చర్యలుంటాయి. 1. నేరస్తుడి నేర ప్రవృత్తిపై చర్యలు తీసుకోవటం 2.నేరస్తుడు సంపాదించిన అక్రమ ఆస్తులు, లాభాలకు రాష్ట్రానికి పరిహారాన్ని చెల్లించడం.

◆ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చెన్నై ప్రధాన కార్యాలయంగా సఫేమా కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీనికి న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కత్తాలో కాంపిటెంట్ అథారిటీ (సీఏ) లున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు కర్నాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లు చెన్నై సీఏ పరిధిలోకి వస్తాయి.

ఏ తరహా ఆస్తులు జప్తు చేస్తారంటే..

నేరస్తుల అక్రమ సంపాదన, ఆస్తులను గుర్తించడం డ్రగ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దర్యాప్తులో అత్యంత కీలకం. నేరస్తులు, బినామీ పేర్ల మీద ఉన్న స్థిర చరాస్తులులతో పాటు వాహనాలు, నగదు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం, వజ్రాలు ఇతరత్రా ఆభరణాలు, గృహోపకరణాలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, లైఫ్ స్టాక్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డిమాండ్ డ్రాఫ్టులు (డీడీ), షేర్లు, బిబెంచర్లతో సహా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో అన్ని రకాల పెట్టుబడులను సఫేమాలో జప్తు చేస్తారు.

నైజీరియన్ నేరస్తులకు న్యాయ సేవలు

- ఏకంగా అసోసియేషన్‌ను ఏర్పాటు చేసిన డ్రగ్ పెడ్లర్
- బెయిల్, డిపోర్టేషన్ వంటి సర్వీస్‌లు
- పోలీసులకు చిక్కిన ఒగ్బాగు డేవిడ్ ఉకా
- పాస్‌పోర్టు, వీసా, గుర్తింపు కార్డులు అన్నీ నకిలీవే



నైజీరియన్ పెడ్లర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న నైజీరియన్ డ్రగ్ పెడ్లర్..తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్‌న్యాబ్)కు చిక్కాడు. అక్రమంగా దేశంలో ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్న ఒగ్బాగు డేవిడ్ ఉకాను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ.10.56 లక్షలు విలువ చేసే 264 ఎక్స్‌టసీ మాత్రలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను టీఎస్‌న్యాబ్ డైరెక్టర్, సీపీ సీవీ ఆనంద్ గురువారం మీడియాకు వెల్లడించారు.

◆ నైజీరియాకు చెందిన ఒగ్బాగు డేవిడ్ ఉకా అలియాస్ పాస్టర్ డావిసన్ అలియాస్ ఈవూ రెండు నెలల బిజినెస్ వీసా మీద ఇండియాకు వచ్చాడు. వీసా గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉంటూ బెంగళూరు, హైదరాబాద్, ముంబైలకు మకాం మారుస్తూ డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. ఇటీవల కాచిగూడ, కేపీహెచ్‌బీ పోలీసులు పలువురు డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేసిన కేసులలో పెడ్లర్లకు డ్రగ్స్ సరఫరా చేసింది ఒగ్బాగు డేవిడ్ ఉకా అని దర్యాప్తులో తేలింది. దీంతో టీఎస్‌న్యాబ్ పోలీసులు ఉకా కదలికలపై నిఘా పెట్టారు.

◆ ఈక్రమంలో ఈనెల 16న హైదరాబాద్‌లోని పెడ్లర్లకు డ్రగ్స్ సరఫరా చేసేందుకు రాగా.. విశ్వసనీయ సమాచారం అందుకున్న టీఎస్‌న్యాబ్, ఫిల్మ్‌నగర్ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఇప్పటికే ఇతనిపై బెంగళూరులోని డీజే హాలీ పీఎస్‌లో డ్రగ్స్ కేసు ఉంది.

నైజీరియన్ నిందితులకు న్యాయ సేవలు..

మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాల వంటి కేసులలో చిక్కుకున్న నైజీరియా దేశానికి చెందిన నిందితులను న్యాయ సేవలను అందించేందుకు ఒగ్బాగు డేవిడ్ ఉకా ఏకంగా ఆల్ ఇండియా నైజీరియన్ స్టూడెంట్స్ అండ్ కమ్యూనిటీ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశాడు. వెల్ఫేర్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ నిందితులకు బెయిలు ఇప్పించడం, డిపోర్టేషన్ మీద సొంత దేశానికి వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్న నైజీరియన్లకు విమాన టికెట్లు, వీసాలను ఏర్పాటు చేయటం వంటి సేవలను అందిస్తున్నాడు. నకిలీ పేర్లతో గుర్తింపు కార్డులు సృష్టించి వాటి మీద సిమ్ కార్డులను తీసుకొని నేర కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. నకిలీ పాస్‌పోర్టు, వీసాలను సైతం సృష్టించాడు.

'మా భూమి ఆక్రమించి.. బెదిరిస్తున్నారు'

హిమాయత్‌నగర్: మేము కొనుగోలు చేసిన భూమిని మంత్రి మల్లారెడ్డి అనుచరులు తమదంటూ బెదిరిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు ఆరోపించారు. ఈమేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గుడ్లపోచంపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, దయాసాగర్‌రెడ్డి, నాగేందర్ రెడ్డిలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లారెడ్డి యూనివర్సిటీ సమీపంలో ఉన్న సుంకర పోచయ్య, రమేష్, బాలమణిలకు సంబంధించిన పది ఎకరాల భూమిలో తాము నాలుగున్నర ఎకరాలు కొనుగోలు చేశామన్నారు. ఈ పది ఎకరాల భూమిలో గతంలో రెండు ఎకరాల భూమి మంత్రి మల్లారెడ్డి సతీమణి పేరుపై రిజిస్ట్రేషన్ అయి ఉందన్నారు. కాగా మిగతా 8 ఎకరాల భూమి వద్దకు ఎవరూ రాకుండా మంత్రి మల్లారెడ్డి బంధువు శ్రీనివాస్‌రెడ్డి, మరికొందరు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, మొత్తం భూమి తమదే అంటున్నారని ఆరోపించారు. దీనిపై పేట్‌బషీర్‌బాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..తమ ఫిర్యాదును స్వీకరించకపోగా మంత్రి నుంచి ఒత్తిడి ఉందంటూ పోలీసులు బహిరంగంగా చెబుతున్నారని ఆరోపించారు.

ఒత్తిడిపై గవాస్కర్‌తో కలిసి రెడ్డీస్ ప్రచారం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ అంతర్జాతీయ ఔషధ కంపెనీ అయిన డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, టెన్షన్ మత్ లో (ఒత్తిడికి గురికావద్దు) అంటూ అవగాహన పెంచే ప్రచార కార్యక్రమం చేపట్టింది. దీని కోసం క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్‌తో కలిసి ఈ ప్రచారం నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. హైపర్‌టెన్షన్, దాని లక్షణాలు, కారణాల గురించి అవగాహన పెంచడం రక్త పోటును నియంత్రణలో ఉంచాల్సిన అవసరాన్ని తెలియజేయడం...వంటివి ఈ ప్రచారంలో భాగంగా ఉంటాయని, గవాస్కర్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకోవడం ద్వారా ఎక్కువ మందిని చేరుకోవచ్చునని ఆశిస్తున్నామన్నారు.

ఆంగ్ల నైపుణ్యంతోనే అవకాశాలు

సాక్షి, సిటీబ్యూరో: ఆంగ్ల భాషా నైపుణ్యం ద్వారా అభివృద్ధికి అవకాశాలు అపారమని నవతరం అభిప్రాయపడుతోంది. ఈ విషయాన్ని ప్రముఖ ఆన్‌లైన్ విద్యావేదిక డ్యుయోలింగో నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఫ్రెష్–ఆఫ్–ది–ప్రెస్ సర్వేలో వెల్లడైంది. ఈ అధ్యయనంలో కెరీర్ వృద్ధికి ఇంగ్లీష్ నేర్చుకోవడం సమగ్ర అభివృద్ధికి కీలకమైన అంశంగా 18–50 ఏళ్ల మధ్య వయస్కులు అభిప్రాయపడతున్నారని తేల్చింది. అధ్యయనంలో పాల్గొన్నవారిలో 81 శాతం మంది కెరీర్‌కు ఆంగ్లభాషా ప్రావీణ్యం గణనీయంగా దోహదపడుతుందని చెప్పగా, 67శాతం మంది తమ భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి వీడియోలు, సినిమాలు, అలాగే యాప్‌ల వైపు మొగ్గు చూపుతున్నారని వెల్లడించింది.

ఉత్తర భారతీయులకు ప్రభుత్వం అండ

మంత్రి తలసాని హామీ



అబిడ్స్: నగరంలోని ఉత్తర భారతీయులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఉత్తర భారతీయులైన బీఆర్ఎస్ నాయకులు బబూత్ సింగ్ రాజు పురోహిత్, దీప్ సింగ్ జి. రాథోడ్ తదితర నాయకులు గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తర భారతీయుల సమస్యలను పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారులను కలిసి సమస్యలు వివరిస్తే వెంటనే పరిష్కారం చూపుతారన్నారు. నగరంలోని ఉత్తర భారతీయులందరూ కేసీఆర్‌కే మద్దతివ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బబుత్ సింఘ్ రాజపురోహిత్, ఉదయ్ సింగ్ చవాన్, రాథోడ్, రన్మల్ సింగ్, గంగా సింగ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి బీఐఎస్ నూతన నియమావళి

ముసాయిదాపై చర్చించిన నిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాల భద్రత, నాణ్యతను మరింత పటిష్టం చేసేందుకు, భవిష్యత్తు విపత్తులను తట్టుకుని నిలబడేలా నిర్మాణాలు చేపట్టేందుకు భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) కొత్త నియమాలను రూపొందించింది. నూతన సాంకేతికతల్ని అనుసంధానం చేస్తూ రూపొందించిన భవప నిర్మాణ నిబంధనల ముసాయిదాపై తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో బీఐఎస్ ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాప్ గురువారం నగరంలో ప్రారంభమైంది. బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధిపతి కేవీ రావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ ఐ.గణపతిరెడ్డి, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ముఖ్య ప్రణాళికాధికారి రాజ్‌పాల్ కౌశిక్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణపతి రెడ్డి మాట్లాడుతూ..భవనాల నిర్మాణంలో దేశవ్యాప్తంగా ఒకే నియమావళిని అమలు చేయాల్సిన అవసరముందన్నారు. అప్పుడే నాణ్యమైన ఫలితాలు అందుకోవచ్చని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి తలామానికంగా నిలుస్తోన్న సెక్రటేరియట్ భవనం, తెలంగాణ అమరుల స్మారకం తదితర నిర్మాణాల్లో జాతీయ భవన నియమావళి కీలక పాత్ర పోషించిందన్నారు. భవనాల నిర్మాణమే కాదు డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనతో జరిగే అభివృద్ధికి జాతీయ భవన నియమావళి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నిపుణులకు బీఐఎస్ ఢిల్లీ సంయుక్త కార్యదర్శి మధురిమా మాధవ్, రాజ్‌పాల్ కౌశిక్‌లు నూతన నియమావళి ముసాయిదాను వివరించారు. నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అనుభవజ్ఞులైన నిపుణుల కృషితో నూతన జాతీయ భవన నియమావళి రూపుదిద్దుకుందని, దీన్ని సద్వినియోగం చేసుకుని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ నియమాలను, జాతీయ నియమావళితో అనుసంధానం చేసుకుంటూ అనుమతుల ప్రక్రియలో పారదర్శకతను తీసుకురావొచ్చని బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి కేవీ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులు, పట్టణ ప్రణాళిక, విపత్తు నివారణ విభాగం, అగ్నిమాపకశాఖ అధికారులు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, విశాఖ డెవలప్‌మెంట్ అథారిటీ, యాదాద్రి ఆలయ అభివృద్ధి సంస్థల నుంచి అధికారులు పాల్గొని అభిప్రాయాలు తెలిపారు.

నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు..

- నేను ప్రిన్స్ ముఖరంజా వారసురాలినే...
- జైరిన్ ముఖరంజా



బంజారాహిల్స్: తాను ప్రిన్స్ ముఖరంజా కూతుర్ని కాదని కొంతమంది సమాజంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నకిలీ డీఎన్ఏ రిపోర్ట్ సోషల్ మీడియాలో చలామణి చేస్తున్నారని ప్రిన్స్ ముఖరంజా బహదూర్ కూతురు జైరిన్ ముకరంజా ఆరోపించారు. గురువారం బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను ప్రిన్స్ ముఖరంజా, ప్రిన్సెస్ జమీలా బౌలారాస్‌లకు 1994 జూలై 6న జన్మించానని అన్నారు. తన తల్లి జమీలా 1993 సెప్టెంబర్ 8న ముఖరంజాను పెళ్లి చేసుకున్నారని అన్నారు. వారిద్దరి పెళ్లి సర్టిఫికెట్, తన బర్త్ సర్టిఫికెట్‌లను ఈ సందర్భంగా ఆమె విలేకరుల ఎదుట ప్రదర్శించారు. డీఎన్ఏ రిపోర్టును కూడా ప్రదర్శించిన ఆమె తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. తాను ముఖరంజా కూతురినని, ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా భారతీయ విద్యాభవన్, పద్మాలయ స్టూడియో 11కేవీ ఫీడర్లు, ఫిల్మ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరుచూరి గోపాలకృష్ణ ఇల్లు, బాబూమోహన్ ఇల్లు, బి.వి.మోహన్ ఇల్లు, ఆంధ్రజ్యోతి లైన్లు, కోట శ్రీనివాసరావు ఇల్లు, రామానాయుడు గల్లీ, రోడ్-79, వాటర్‌వర్క్స్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఎమ్మెల్యేకాలనీ, సినీఫుర్ 11కేవీ ఫీడర్లు ఫిల్మ్‌నగర్, ఎమ్మెల్యేకాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని దుర్గాభవానీనగర్, దీన్‌దయాల్‌నగర్, జగపతిబాబు ఇల్లు, ఒమేగా ఆస్పత్రి, వీ6 పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. నాందారి, ఈ-సేవ 11కేవీ ఫీడర్లు రోడ్-13, రోడ్-2 సబ్‌స్టేషన్ల పరిధిలోని నాందారి టెంట్‌హౌస్, అజహరుద్దీన్ ఇల్లు, రోడ్-4, 7, 14, కుక్కల ఆస్పత్రి, ఉడుపి హోటల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

కళలపై విద్యార్థులకు అవగాహన



పోచంపల్లి చేనేత పరిశ్రమను తిలకిస్తున్న విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు సంప్రదాయ కళలను, చేనేత కళాకారుల నైపుణ్యాన్ని తెలుసుకొని కళలపై అవగాహన పెంచుకున్నారు. ఎర్రగడ్డకు చెందిన సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు గురువారం పోచంపల్లిలోని సంప్రదాయ చేనేతకళాకారుల చీరలు ఎలా తయారు చేస్తారో తెలుసుకున్నారు. ప్రాచీన కాలం నుంచి చేస్తున్న చేనేత పరిశ్రమ పట్ల అవగాహనను పెంచుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని, వారికి ప్రోత్సాహాన్ని అందించాలని, మీ కుటుంబ సభ్యులను ఈ విషయాన్ని తెలపాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



ఫిల్మ్‌నగర్: ఫిల్మ్‌నగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి 1071 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఏటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పాఠశాలలో విద్యార్థులకు క్రమం తప్పకుండా నోట్‌బుక్స్ అందజేస్తున్నామని ఆమె తెలిపారు.

వర్గీకరణకు మద్దతిస్తే మూల్యం తప్పదు


- టీడీపీకి పట్టిన గతే పడుతుంది
- మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య

పంజగుట్ట: గతంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన టీడీపీ మట్టికొట్టుకు పోయిందని... తిరిగి ఏ పార్టీ అయినా వర్గీకరణకు మద్దతు తెలిపితే టీడీపీకి పట్టిన గతే పడుతుందని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య హెచ్చరించారు. గురువారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ జరగని వర్గీకరణను పట్టుకుని పదేపదే దళితుల మధ్య అగాథం సృష్టించేందుకు ప్రయత్నిస్తు మాలలపై విశం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ వర్గీకరణ జరగదని రాజ్యసభలో చెప్పేసరికి మంద కృష్ణ తిరిగి వర్గీకరణ అంశం తెరపైకి తీసుకువచ్చి భట్టి విక్రమార్కను, మల్లికార్జున ఖర్గేను బూచిగా చూపిస్తూన్నారని ఇది తిరిగి బీజేపీకి మద్దతు తెలిపేందుకే అనే విషయాన్ని మాదిగ సోదరులు గమనించాలన్నారు. రేవంత్‌రెడ్డి కూడా వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పునకు కట్టుబడి ఉండి దళితులనందరినీ సమానంగా చూడాలన్నారు. జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు బురుగుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నె శ్రీధర్ రావు, పుణ్య భానుప్రకాష్, కన్వీనర్లు బైండ్ల శ్రీనివాస్, తలారి రాజు, గోకుల కళ్యాణ్, మాతంగి శశికాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ప్రమాదకరం

- ఎప్పుడు విద్యుదాఘాతం సంభవిస్తుందోననే ఆందోళన
- వర్షాలకు పరిస్థితి మరింత ఆందోళనకరం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

వానాకాలంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోకండి, ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన నిలబడకండి... వైర్లకు దూరంగా నడవండంటూ ఊకదంపుడు ప్రచారాలు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు ప్రజల గోసను మాత్రం పట్టించుకోవడం లేదు. అయ్యా మా బస్తీల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియడంలేదు. వానాకాలంలో అయితే మరీ ఘోరంగా భయపెడుతున్నాయంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నా లైన్‌మెన్ నుంచి ఈఈ వరకు చీమ కుట్టినట్టుగా కూడా వ్యవహరించడం లేదు.







వెంగళరావునగర్: నగరంలో ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు పోతున్న సమయంలో మాత్రం అవగాహనా శిబిరాల నిర్వహణ, ప్రచారాల హడావుడి చేయడం తప్ప వాస్తవంగా పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో విద్యుత్ సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా దాదాపు పాతికేళ్ల కిందట వేసిన ఇనుప స్తంభాలు కొన్ని చోట్ల ఇంకా అలాగే ఉన్నాయి.
- వాస్తవంగా ఐరన్ పోల్స్ వల్ల వర్షాలు వచ్చినపుడు షాక్ కొడుతున్నాయని, వాటిని తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ ఉన్నతాధికారులు దశాబ్దం క్రితమే నిర్ణయించారు.
- అప్పట్లో హడావుడిగా కొన్ని ప్రాంతాల్లో స్తంభాలను మార్చారు. మరికొన్ని ఏరియాల్లో మాత్ర అలాగే వదిలేశారు.
- అలా వదిలేసిన వాటిలో ఈస్ట్ రహమత్‌నగర్‌లోని చర్చి గల్లీ, వీడియోగల్లీ, చికెన్ గల్లీ తదితర ప్రాంతాలు ఉన్నాయి. కొన్ని స్తంభాలు ఒరిగిపోయి ఎప్పుడు కింద పడిపోతాయోనని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లబుచ్చుతున్నారు.
- ఇదిలా ఉంటే చర్చి గల్లీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే దాని వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇటీవల కురిసిన గాలివానలకు దాని పక్కనే ఉన్న వైర్లు తగలబడి ఈ ట్రాన్స్‌ఫార్మర్ కొంత కాలిపోయింది.
- మరికొంత దూరంలో రెండేళ్ల కిందట సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయడానికి తెచ్చి వేశారు. అయితే దానిని మాత్రం ఏర్పాటు చేయలేదు.
- ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చాలని, ప్రాణాలు పోకముందే స్పందించాలని, సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ఎన్నోసార్లు విద్యుత్ అధికారులకు తెలియజేసినా ఇంతవరకు స్పందించలేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- డివిజన్ కార్పొరేటరైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుతున్నారు. నిద్రపోతున్న విద్యుత్‌శాఖ అధికారులు ఇకనైనా మేల్కొని ఇటువైపు దృష్టి సారించాలని, వానాకాలంలో జరగకూడని ప్రాణాపాయం జరిగితే విద్యుత్‌శాఖ బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

అట్టుడికిన పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీ

- 8 మంది బీఆర్ఎస్ నేతలపై హత్యాయత్నం కేసు నమోదు
- విషమంగా బాధితుల పరిస్థితి



బాధితుడు దేవరాజ్ (ఫైల్)



గాయపడిన ఆకాశ్



గాయపడిన లలిత

ఫిల్మ్‌నగర్: బీజేపీ నేతలపై దాడి ఘటనలో ఎనిమిది మంది బీఆర్ఎస్ నేతలపై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది. వివరాలివీ... ఫిలింనగర్‌లోని పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీలో నివసించే బీజేపీ నేత రాజారాంయాదవ్ తన ఇంటిని ఆనుకొని స్థానిక బీఆర్ఎస్ నేత కిర్పుల్ కృష్ణ పెట్టిన టైల్స్‌ను తొలగించాలని బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొంత కాలంగా 40 గజాల ప్రభుత్వ కమ్యూనిటీ హాల్ స్థలంపై కూడా ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తుంది. పాత కక్షలు మనసులో పెట్టుకొన్న కృష్ణతోపాటు ఆయన సోదరుడు మోహన్, తండ్రి నర్సింహా, తల్లి జయమ్మ, భార్య పునీత తదితరులు వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరిగి గొడవకు దిగారు. కొద్ది సేపట్లోనే ఆగ్రహంతో ఊగిపోతూ కృష్ణ కుటుంబంతో కలిసి రాజారాం యాదవ్ ఇంటి ముందుకు వెళ్లి చూసుకుందాం.. రా! అంటూ హెచ్చరించాడు. మరోసారి గొడవ తీవ్రమైంది. ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకొంది. అరుపులు కేకలతో రాత్రి వేళ బస్తీ అట్టుడుకుంది. కర్రలు, రాడ్‌లతో విరుచుకుపడ్డారు. కృష్ణ భార్యకు ఈ ఘటనలో దెబ్బలు తగులగా, ఇదే విషయాన్ని కృష్ణ సోదరుడు, బావమరిది సాయికి ఫోన్‌లో చెప్పాడు. గంజాయి మత్తులో ఉన్న సాయి బోరబండ కార్మికనగర్ నుంచి తన స్నేహితులు ఈశ్వర్, సైఫ్‌తోపాటు మరో పది మందిని కారు, ఆటోల్లో తీసుకొచ్చి రాజారాం యాదవ్ ఇంటిపైకి దాడికి వెళ్లారు. తమతోపాటు తెచ్చుకున్న కర్రలు, రాడ్‌లతో విరుచుకుపడ్డారు. అడ్డం వచ్చిన వారిని తీవ్రంగా కొట్టారు. రాజారాం యాదవ్ బామ్మర్ది దేవరాజ్ తల పగులగా వెంటనే అపోలో ఆస్పత్రిలో చేర్చారు. ఆయన భార్య లలిత, చిన్నకొడుకు ఆకాశ్‌లకు కూడా తీవ్ర గాయలవగా వారిని కూడా ఆస్పత్రిలో చేర్చారు. రెండు గంటలపాటు బస్తీ అట్టుడుకుంది. రక్తస్రావంతో విలవిలలాడుతూ దేవరాజ్, లలిత, ఆకాశ్ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఘటనాస్థలాన్ని జూబ్లీహిల్స్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సందర్శించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బాధితుడు రాజారాంయాదవ్ పెద్దకుమారుడు రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కృష్ణ, మోహన్, నర్సింహా, జయమ్మ, పునీత, సాయి, ఈశ్వర్, సైఫ్‌లపై ఐపీసీ సెక్షన్ 307, 143, 148, 452, 324, 427, రెడ్ విత్ 149 కింద ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

స్టార్ ఆస్పత్రిలో 'ఇల్యూమినా'



రాయదుర్గం: అందానికి సొబగులద్దే 'ఇల్యూమినా'ను నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ మహిళా భద్రతా విభాగం డీఐజీ సుమతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటన్నింటిని రోగులకు అందుబాటులోకి తీసుకురావడంతో హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గూడపాటి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో అధునాతన అవకాశాలను స్టార్ ఆస్పత్రులలో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫేస్‌లిఫ్ట్ నుంచి బ్రెస్ట్ రిడక్షన్, హ్యాండ్ సర్జరీ, బర్న్స్, ట్రామా, పోస్ట్ బెరియాట్రిక్, ట్రీట్‌మెంట్స్, సర్జరీలతోపాటు నాన్ సర్జికల్ చికిత్సలను పొందాలంటే యూరప్, అమెరికా వంటి దేశాలకు వెళ్ళాల్సి వచ్చేదని ప్రస్తుతం ఈ టెక్నాలజీని స్టార్ ఆస్పత్రిలో అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఐడబ్ల్యూఎన్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, ఫ్యాషన్ ఐకాన్ శిల్పారెడ్డి, విభాగాధిపతి డాక్టర్ రాజేష్‌వాసు, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

సమస్యలపై బసవతారకనగర్‌వాసుల ఎమ్మెల్యే వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న బస్తీవాసులు

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలో స్వామి వివేకానందనగర్‌కు లింకు రోడ్డును నిర్మాణం చేపట్టాలని కోరుతూ బసవతారకనగర్ బీఆర్ఎస్ పార్టీ కమిటీ గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. బస్తీకి సరైన రోడ్డు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వివేకానందనగర్ బస్తీ మీద నుంచి ఖాళీగా ఉన్న స్థలం మీదుగా లింకు రోడ్డు పూర్తి చేయాలని వారు కోరారు. ఫిలింనగర్‌లోని నవనిర్మాణ్‌నగర్ బస్తీలో డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించాలని గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చాలంటూ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, సుల్తాన్, సీహెచ్ లక్ష్మణ్ తదితరులు ఎమ్మెల్యే దానంకు వినతిపత్రం సమర్పించారు. గత 30 ఏళ్లుగా సెప్టిక్ ట్యాంకుపై గుడిసెలు వేసుకొని బతుకుపోరాటం చేస్తున్నామని, ఇళ్లు కట్టుకొనే స్థోమత లేదని డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. 35 మందికి గృహలక్ష్మి పథకం కింద సహాయం చేయాలని కోరారు. బండారు బాల్‌రెడ్డి నగర్ బస్తీకి చెందిన శ్రీమణికంఠ యూత్ అసోసియేషన్ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తూ ఖాళీగా ఉన్న స్కూల్ బిల్డింగ్‌ను కొంత భాగం అంగన్‌వాడీకి, మరికొంత భాగం ఆశా వర్కర్లకు మిగిలిన భాగాన్ని మహిళా భవన్‌కు కేటాయించాలని కోరారు. ఈ భవనానికి కరెంటు, నీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఛాతీ ఆస్పత్రి కార్మికులకు జీతాలు విడుదల చేయాలని ఆందోళన

వెంగళరావునగర్: ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు తక్షణమే జీతాలను విడుదల చేయాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. ఎర్రగడ్డ ఛాతీ ఆస్పత్రి వద్ద గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం డీఎంఈ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ... నగరంలో నివసించే కార్మికులకు ఒక నెల జీతాలు రాకపోయినా విలవిల లాడే పరిస్థితులు ఉన్నాయని, అలాంటిది రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణనే జూన్, జులై నెలల జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు శ్రీనివాస్, అమృత, నస్రీన్, అనిత, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సింగాడికుంటలో బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ!



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ వెంకటేశ్వరకాలనీ డివిజన్ నేతలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-10లోని సింగాడికుంట బస్తీలో గురువారం బీఆర్ఎస్, బీజేపీ నేతలు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొంది. గురువారం ఉదయం స్థానిక బీజేవైఎం నేత కరణ్‌గౌడ్ ఓటు లేని వారి వివరాలు సేకరిస్తూ ఓటుహక్కు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించేందుకు బస్తీలో పర్యటిస్తున్న నేపథ్యంలో స్థానిక బీఆర్ఎస్ నేతలు అధికారులు చేయాల్సిన పనులు మీరు ఎందుకు చేస్తున్నారంటూ ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ తీవ్రతరమైంది. ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగారు. బీజేపీ నేతలు తమ కార్యకర్తపై కళ్లల్లో కారం కొట్టి దాడికి పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసేందుకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అయితే తమపై బీఆర్ఎస్ నేతలు దాడికి పాల్పడ్డారని తీవ్రంగా కొట్టారని కళ్లల్లో కారం చల్లారని ఫిర్యాదు చేసేందుకు బీజేవైఎం ఉపాధ్యక్షులు కరణ్‌గౌడ్‌తో సహా బీజేపీ నేతలు అదే సమయానికి స్టేషన్‌కు వచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య స్టేషన్ ఆవరణలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగారు. పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం ఉండటంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. స్థానిక కార్పొరేటర్ పోలీస్ స్టేషన్‌కు విచ్చేసి తమ బీఆర్ఎస్ నేతలను తీసుకెళ్లారు. ఇది సహించని బీజేపీ నేతలు స్టేషన్ ఆవరణలో ఆందోళనకు దిగారు. తమను స్టేషన్‌లో ఉంచి బీఆర్ఎస్ నేతలను ఎలా పంపిస్తారని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసు ఠాణాలు బీఆర్ఎస్‌కు కార్యాలయాలుగా మారాయని దుయ్యబట్టారు. అరగంటపాటు బైఠాయించి పోలీసుల తీరు, బీఆర్ఎస్ కార్యకర్తలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టేషన్లో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకొంది. పరస్పర ఫిర్యాదుల మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బస్తీల్లో ఎమ్మెల్యే దానం పర్యటన



బస్తీవాసుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే దానం

ఫిల్మ్‌నగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్‌లోని బసవతారకనగర్, నవనిర్మాణ్‌నగర్, బండారు బాల్‌రెడ్డి నగర్ బస్తీల్లో గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. నిధులు మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ, మంచినీరు, రోడ్డు పనులను పూర్తిచేయాలన్నారు. బాల్‌రెడ్డి నగర్‌లో స్కూల్ బిల్డింగ్ నిరుపయోగంగా ఉందని, దానిని అంగన్‌వాడీ కేంద్రానికి లేదా మహిళా భవన్‌కుగానీ కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం హరిశంకర్, సెక్షన్ మేనేజర్ పవన్, జీహెచ్ఎంసీ సర్కిల్ 18 డీఎంసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, ఏఎంహెచ్‌ఓ రజనీకాంత్, నవనిర్మాణ్‌నగర్, బసవతారకనగర్, బాల్‌రెడ్డి నగర్ బస్తీ నేతలు, మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపులో జాప్యంపై బీజేపీ ధర్నా



షేక్‌పేట మండల కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

బంజారాహిల్స్: డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో జాప్యం పట్ల బీజేపీ శ్రేణులు గురువారం షేక్‌పేట మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాయి. ఖైరతాబాద్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డితోపాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొని ప్రభుత్వ నిర్వాకాన్ని ఎత్తిచూపుతూ ప్లకార్డులు ప్రదర్శించడమే కాకుండా నినాదాలు చేశారు. 35 లక్షల మంది పేదలు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం 35 వేల ఇళ్లు కూడా ఇవ్వలేదని చింతల ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిన ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఇది చేతకాని ప్రభుత్వమని దుయ్యబట్టారు. గతేడాది ఆగస్టు 15న సీఎం కేసీఆర్ గొల్కొండ సాక్షిగా 2.91 లక్షల ఇళ్లను ఇస్తున్నట్లు ప్రకటించారని, ఇవి పూర్తిగా అవాస్తవమన్నారు. కేంద్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం రూ. 4476 కోట్లు మంజూరు చేసిందని, అలాగే హడ్కో రుణం రూ. 12500 కోట్లు ఇచ్చిందని ఇప్పటివరకు 35వేల ఇళ్లు మాత్రమే నిర్మించారన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి 4500ల ఇళ్లు ఇస్తామని చెప్పారని, కేవలం 201 ఇళ్లనే ఇచ్చారన్నారు. అడుగడుగునా ఈ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని ఆరోపించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి 38 మంది బీజేపీ నేతలను అదుపులోకి తీసుకొన్నారు.

మందుబాబులకు జైలు

బంజారాహిల్స్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్లో పట్టుబడ్డ 25 మంది వాహనదారులను జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గురువారం నాంపల్లిలోని ఎనిమిదో మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండోసారి పట్టుబడ్డ వీరబాబు అనే వాహనదారుడికి 2 రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అలాగే ఎం.కమల్ అనే మరో వాహనదారుడు రెండోసారి పట్టుబడగా ఆయనకు జరిమానాతోపాటు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. మిగితా 23 మందికి ఒకొక్కరికి రూ. 2100ల చొప్పున జరిమానా విధించారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా

జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 18 మంది వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని గురువారం నాంపల్లిలోని పదో ప్రత్యేక ఎంఎం కోర్టులో హాజరుపర్చగా వీరిందరికి రూ. 11,800ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

న్యూసెన్స్ కేసులో నిందితుడికి పది రోజుల జైలు



సాగర్ బాబు

బంజారాహిల్స్: దారిన వచ్చి పోయేవారిని అడ్డగిస్తూ అకారణంగా తిడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు పది రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ ఎస్ఐ నవీన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్ నంబరు 5లోని దేవరకొండ బస్తీలో నివసించే సాగర్‌బాబు(23) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. కొంత కాలంగా స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తూ సంబంధం లేని వారిని లక్ష్యంగా చేసుకొని వెంటపడి వేధిస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 186, 70బి, సి సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి గురువారం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

'బీసీలను చులకనగా చూస్తే సహించం'



మాట్లాడుతున్న మానుక రాజుయాదవ్

శ్రీనగర్‌కాలనీ: బీసీ మంత్రులు, నేతలను దూషించడం టీ పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డికి తగదని, బీసీలను చులకనగా చూస్తే సహించేది లేదని బీఆర్ఎస్ బీసీ నేత, బాడీ బిల్డర్ మానుక రాజుయాదవ్ అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని బీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలను సేవలందిస్తున్న శ్రీనివాసగౌడ్‌ను ఇష్టం వచ్చినట్లు అహంకారంతో మాట్లాడటం సబబు కాదన్నారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించనిపక్షంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నాను, దీక్షలను చేస్తామని హెచ్చరించారు. మంత్రులు గంగుల కమలాకర్, తలసానిపై కూడా రేవంత్‌రెడ్డి చులకనగా, అగ్ర కుల అహంకారంతో మాట్లాడారని గుర్తుచేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

హిమాయత్‌నగర్: విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ ఇష్టానుసారమైన పనులు చేస్తే చూస్తూ ఊరుకోమని రౌడీషీటర్స్‌కు సెక్రటరియేట్(లేక్) పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దెబోరా హెచ్చరించారు. గురువారం పీఎస్ వద్ద 8 మంది రౌడీషీటర్స్‌కు ఆమె డీఐ రామకృష్ణతో కలసి వార్నింగ్ ఇచ్చారు. ఇటీవలికాలంలో ఈ ఎనిమిది మంది అనవసరమైన విషయాల్లో పాల్గొనడం, ఇతరులకు ఇబ్బందులు కలిగించడం వంటివి తమ దృష్టికి రావడంతో కౌన్సెలింగ్‌తో పాటు వార్నింగ్ ఇచ్చామని ఇన్‌స్పెక్టర్ దెబోరా తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

బంజారాహిల్స్: వేర్వేరు సంఘటనల్లో ఓ జూనియర్ ఆర్టిస్ట్‌తోపాటు ఇద్దరు మహిళలు అదృశ్యమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

వెంకటగిరిలో జూనియర్ ఆర్టిస్ట్...



కార్తీక్

అనుమానాస్పద స్థితిలో జూనియర్ ఆర్టిస్ట్ అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం సంకీస గ్రామానికి చెందిన కె.కార్తీక్(18) సినిమాల మీద మోజుతో హైదరాబాద్‌కు వచ్చి వెంకటగిరిలో గదిలో అద్దెకుంటున్నాడు. గత ఆదివారం తన కొడుకును ఫోన్‌లో పలకరించేందుకు తండ్రి కనకం వెంకటేష్ ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆందోళన చెందిన ఆయన స్వగ్రామం నుంచి ఇక్కడికి వచ్చి గదికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారిని ఆరా తీయగా ఈ నెల 13 నుంచి గదికి తాళం వేసి ఉన్నట్లు చెప్పారు. అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో కుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 99498 52581లో సంప్రదించాలని కోరారు.

వివాహిత...



ప్రియాంక

వెంకటగిరి వాటర్‌ట్యాంక్ సమీపంలో నివసించే ప్రియాంక(22) ఈ నెల 13న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. గతంలో కూడా ఆమె మూడుసార్లు ఇలానే ఇంట్లో చెప్పకుండా వెళ్లడంతో జూబ్లీహిల్స్ పోలీసులు గాలించి భర్త బిశ్వంత్‌కు అప్పగించారు. మరోసారి అదృశ్యం కావడంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61278లో సంప్రదించాలని సూచించారు.

జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో...



సింధు

వివాహం జరిగిన అయిదేళ్లలో తన భార్య నాలుగుసార్లు తప్పిపోయిందని వెళ్లిన ప్రతిసారీ వారం పది రోజులకు తిరిగి వచ్చేదని అనుమానాస్పద స్థితిలో మరోసారి అదృశ్యం అయిందంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.సింధు(23)పై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు గాలిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61278రులో సంప్రదించాలని కోరారు.

ప్లాట్ల ధరలు ఇలా పెరిగితే
కొనుగోలు ఎలా..?

మోకిల ప్రీబిడ్డింగ్ సమావేశంలో కొనుగోలుదారులు
- ప్రీ బిడ్ మీటింగ్‌కు అనూహ్యమైన స్పందన

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో అనూహ్యంగా ప్లాట్ల ధరలు పెరగడంపట్ల కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మోకిలలో రెండోదశ ప్లాట్ల అమ్మకాల కోసం గురువారం నిర్వహించిన ప్రీబిడ్డింగ్ సమావేశానికి కొనుగోలుదారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఇటీవల మొదటిదశలో గజం రూ.లక్షకుపైగా ధర పలకడంపట్ల కొందరు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం విక్రయించే స్థలాలను సైతం సామాన్య, మధ్యతరగతి వర్గాల కొనుగోలుకు అవకాశం లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో భూములకు ఉన్న విలువకు అనుగుణంగా వాటి ధరలను ఏదో ఒకస్థాయి వద్ద స్థిరీకరిస్తే బాగుంటుందని కొందరు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ అధికారులు మాట్లాడుతూ కేవలం ఒకటి, రెండు ప్లాట్లకే రూ.లక్షలకుపైగా డిమాండ్ వచ్చిందని, మిగతావి మార్కెట్ ధరలకనుగుణంగానే అమ్ముడుపోయాయని తెలిపారు. దాదాపు 165 ఎకరాల విస్తీర్ణంలో హెచ్ఎండీఏ 1,321 ప్లాట్లలతో భారీ రెసిడెన్షియల్ లేఅవుట్‌ను మోకిలలో అభివృద్ధి చేస్తోంది. మొదటి దశలో 50 ప్లాట్లను విక్రయించగా, రెండోదశలో మరో 300 ప్లాట్లను ఈ నెలాఖరులో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. గురువారం నాటి ప్రీబిడ్ సమావేశంలో ఎన్నారైలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

జాతీయస్థాయిలో సత్తాచాటిన సాక్షి ఫొటోగ్రాఫర్లు

19న విజయవాడలో బహుమతుల ప్రదానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/ నాగాయలంక/తిరుపతి కల్చరల్: అంత ర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసి యేషన్ (ఏపీపీజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఫొటో కాంపిటీషన్ ఫలి తాలను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు విడుదల చేశారు. గురువారం విజయవాడలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏపీపీజేఏ అధ్యక్షుడు సీహెచ్‌వీఎస్ విజయ భాస్కర రావు, ప్రధాన కార్యదర్శి వి.రూబెన్ బెసాలి యల్‌తో కలిసి కలెక్టర్ ఫలితాలను విడుదల చేశారు. పోటీల్లో జనరల్ కేటగిరీలో ఎండీ నవాజ్ (సాక్షి, వైజాగ్) ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఫొటో జర్నలిజం కేటగిరీలో సాక్షి ఫొటోగ్రాఫర్లు పి.లీలా మోహన్‌రావు (వైజాగ్), వి. శ్రీనివాసులు (కర్నూలు), కందుల చక్రపాణి (విజయవాడ), పి.మను విశాల్ (విజయవాడ), కె.శివకుమార్ (యాదాద్రి), కె.జయ శంకర్ (శ్రీకాకుళం), కేతారి మోహన్‌కృష్ణ (తిరుపతి), ఎస్.లక్ష్మీ పవన్ (విజయవాడ) కన్సొలేషన్ బహుమ తులు గెలుచుకున్నారు. జనరల్ కేటగిరీలో సాక్షి ఫొటోగ్రాఫర్ ఎస్ లక్ష్మీపవన్ (విజయ వాడ) కన్సొలేషన్ బహుమతి గెలుచుకు న్నాడు. ఈ సందర్భంగా ఏపీపీజేఏ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పత్రికా ఫొటోగ్రాఫర్ల నుంచి 700 ఎంట్రీలు వచ్చాయన్నారు. విజేతలకు ఈనెల 19న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వ హించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

జాతీయ ఫొటో పోటీల్లో కృష్ణప్రసాద్‌కు మెరిట్ అవార్డు


సింహాద్రి కృష్ణప్రసాద్

వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా నిర్వహించిన నేషనల్ ఫొటో కాంటెస్ట్-2023లో కృష్ణాజిల్లా నాగాయ లంకకు చెందిన ఫొటోగ్రాఫర్ సింహాద్రి కృష్ణప్రసాద్ పంపిన ఛాయా చిత్రానికి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు దక్కింది. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ), ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ) ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఫొటో పోటీల్లో స్పెషల్ థీమ్ మ్యాని ఫెస్టేషన్స్ ఆఫ్ నేచర్‌లో అండర్ స్టాండింగ్ ది క్లౌడ్స్ విభాగంలో ఆయన పంపిన 'క్లౌడ్స్ అంబరిల్లా టూ గాడ్' ఛాయచిత్రం ప్రథమ సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు దక్కించుకుంది.

అమెరికా నుంచి తెలుగు విద్యార్థులు వెనక్కి!

▶ మొదటి పేజీ తరువాయి
భారత విద్యార్థులు ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. అక్కడి వీసా నిబంధనలకు అనుగుణంగా అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుంటారు. ముందే టోఫెల్, జీఆర్ఈ వంటి పరీక్షలు రాస్తారు. వాటి మార్కుల ఆధారంగానే అక్కడి యూనివర్సిటీలలో సీట్లు వస్తాయి. తర్వాత అమెరికాలో చదువుకున్నన్ని రోజులు జీవించడానికి అవసరమయ్యే మేర సొమ్మును బ్యాంకు బ్యాలెన్స్‌గా చూపిస్తారు. ఇందుకోసం విద్యార్థులు కన్సల్టెన్సీల సహకారం తీసుకుంటున్నారు. ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఏదో ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టుగా అనుభవం సర్టిఫికెట్లు కూడా సమర్పిస్తున్నారు. ఈ వ్యవహారంలోనే మన విద్యార్థులు ఇబ్బందుల్లో పడుతున్నారని అమెరికాలోని తెలుగు అసోసియేషన్లు చెప్తున్నాయి.

డాక్యుమెంట్లపై అనుమానాలు.. సోషల్ మీడియా ఖాతాలు

- అమెరికాలో 'సాక్షి' ప్రతినిధికి అందిన సమాచారం ప్రకారం.. పలువురు తెలుగు విద్యార్థులు బ్యాంక్ ఖాతాలో సొమ్మును చూపిన అంశంపై అమెరికా అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఖాతాలో ఒకేసారి భారీగా డబ్బులు పడటం, లావాదేవీలు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించి, తిప్పి పంపారు.
- అమెరికాలో ఆటా సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమెరికాలో ఎన్నారై వ్యవహారాల సలహాదారు డాక్టర్ వాసుదేవరెడ్డి అందించిన వివరాల ప్రకారం.. అమెరికాకు వచ్చే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను ఆ దేశ ఇమిగ్రేషన్ విభాగం క్షుణ్నంగా పరిశీలిస్తోంది. వీసాకు అనుమతించిన మరుక్షణమే నిఘా పెడుతోంది. అందులో అమెరికా నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు, సమాచారం, వ్యాఖ్యలు ఉంటే వాటి ఆధారంగా ఎయిర్‌పోర్టులోనే ఆపేస్తున్నారు. ఉదాహరణకు భారత విద్యార్థి అమెరికా వస్తూ.. ఇక్కడి స్నేహితులతో అమెరికాలో చదువుకునే రోజుల్లో ఉండే పార్ట్‌టైం ఉద్యోగాల గురించి వాకబు చేశాడు. ఇది నిబంధనలకు విరుద్ధంగా పరిగణించి వెనక్కి పంపేశారు.
- నాటా సభ్యుడు సింహ అందించిన సమాచారం ప్రకారం.. అమెరికా మన విద్యార్థులను తిప్పి పంపడానికి కారణాలను కేవలం భారత కాన్సులేట్‌కు మాత్రమే చెబుతుంది. దీనితో ఆ వివరాలు తెలుసుకునేందుకు అమెరికాలో తెలుగు అసోసియేషన్లు ప్రయత్నిస్తున్నాయి.

ధాన్యం రవాణాకూ జీపీఎస్

▶ మొదటి పేజీ తరువాయి
జీపీఎస్ వ్యవస్థను అమర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఇప్పటికే ఈ అంశంపై అధికారులతో చర్చించారు.

మిల్లులకు తీసుకెళ్లే వాహనాలన్నింటికీ...
రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో రైతుల నుంచి ధాన్యం సేకరణ జరుగుతుంది. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చాక తూకం వేసి రైస్‌మిల్లులకు పంపిస్తారు. ఈ ధాన్యం రైస్‌మిల్లులకు వెళ్లాక మిల్లింగ్ అయి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) రూపంలో ఎఫ్‌సీఐ గోదాములకు తరలుతుంది. ఈ క్రమంలో తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయని కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో మిల్లులకు ఎంత ధాన్యం వస్తోంది? మిల్లుల నుంచి బియ్యం రూపంలో గోదాములకు ఎంత పరిమాణంలో తిరిగి వెళ్తోందనే అంశంపై నిఘా కోసం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తీసుకెళ్లే ప్రతి వాహనాన్ని జీపీఎస్‌తో అనుసంధానించాలని ఆదేశించింది. రాష్ట్రంలో ప్రతి సీజన్‌లో సుమారు 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఒక్కో కేంద్రం నుంచి మిల్లుల లభ్యతను బట్టి పక్క జిల్లాలకు, దూర ప్రాంతాలకు కూడా పంపుతున్నారు.

సాధ్యాసాధ్యాలపై మల్లగుల్లాలు..
బియ్యం లారీలు గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు... అక్కడి నుంచి పౌరసరఫరాల దుకాణాలకు చేరేందుకు 2016లోనే జీపీఎస్ ట్రాకింగ్ విధానాన్ని రాష్ట్రంలో అమల్లోకి తీసుకొచ్చారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా సీవీ ఆనంద్ ఉన్న కాలంలో ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ ఇప్పటికీ సక్రమంగా అమలు కావట్లేదు. దీన్ని పర్యవేక్షించే యంత్రాంగం కూడా లేదు. బియ్యం లారీల కోసం కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానించి ప్రతినెలా బియ్యం పంపిణీ జరుపుతుండగా దీన్నే తూతూమంత్రంగా అమలు చేస్తున్న పౌరసరఫరాల సంస్థ... ధాన్యం సేకరణలో జీపీఎస్ ట్రాకింగ్ చేయడం కష్టమేనని చెబుతోంది. ఎందుకంటే ప్రతి సీజన్‌లో రెండు నెలలపాటు సాగే ధాన్యం రవాణాకు అందుబాటులో ఉన్న అన్ని లారీలతోపాటు గ్రామాల్లో ఎక్కువగా ట్రాక్టర్లను వినియోగిస్తారు. రాష్ట్రంలోని 130కిపైగా ఉన్న సెక్టార్ల నుంచి సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వచ్చే ధాన్యాన్ని సేకరించి మిల్లులకు పంపేటప్పుడు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమలు చేయడం సాధ్యం కాదని అధికారులు తేల్చినట్లు సమాచారం. అయితే కేంద్రం ఈ విషయంలో కఠినంగా ఉండటంతో వానాకాలం సీజన్ నుంచే ఎలా అమలు చేయాలనే దానిపై ఈ నెల 21న ఢిల్లీలో జరిగే కార్యదర్శుల సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు ఓ అధికారి తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు కన్నుమూత

గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, ఇతర ప్రముఖుల నివాళి



హఫీజ్‌పేట్/సాక్షి, హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు సీహెచ్‌వీఎం కృష్ణారావు (64) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు పత్రికా రంగంలో కొనసాగిన ఆయన వివిధ మీడియా సంస్థల్లో పనిచేశారు. రాజకీయ వర్గాల్లో 'బాబాయ్'గా పేరుపొందిన ఆయన పూర్తిపేరు చిర్రావూరి వెంకట మాణిక్య కృష్ణారావు. 1959 ఆగస్టు 9న ఆయన జన్మించారు. పాత్రికేయ రంగంలో కృష్ణారావు ప్రయాణం 1975లో ఒక రిపోర్టర్‌గా ప్రారంభమైంది. ఆతర్వాత ఒక్కో మెట్టు ఎక్కుతూ పైకి వచ్చారు. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, డెక్కన్ క్రానికల్, ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికల్లో పనిచేశారు. డెక్కన్ క్రానికల్ పత్రికలో న్యూస్ బ్యూరో చీఫ్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. గత ఏడాది ఆయన కేన్సర్ బారిన పడ్డారు. కృష్ణారావుకు భార్య లక్ష్మి, కుమారుడు కిరీటి, కూతురు కిన్నెర ఉన్నారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. కుమారుడు హైదరాబాద్‌లోనే పనిచేస్తుండగా కుమార్తె అమెరికాలో ఉన్నారు. కాగా, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కృష్ణారావు మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

గవర్నర్, ముఖ్యమంత్రి సంతాపం
కృష్ణారావు మరణం పట్ల రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు , ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. కృష్ణారావు మరణం తెలుగు రాష్ట్రాల్లో పత్రికా రంగానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ప్రముఖుల నివాళి
కృష్ణారావు మరణ వార్త తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టు ముఖ్యులు గోపన్‌పల్లిలోని జర్నలిస్ట్‌కాలనీలో ఆయన నివాసానికి చేరుకొని నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి హరీశ్‌రావు, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర బీజేపీ నేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కేవీపీ రాంచందర్‌రావు, జూలూరి గౌరిశంకర్, కొమ్మినేని శ్రీనివాసరావు, దేవులపల్లి అమర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కృష్ణారావుకు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు. కాగా, శుక్రవారం రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో కృష్ణారావు అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించినట్లు తెలిసింది.

సర్దార్ పాపన్నకు సీఎం నివాళి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన కృషిని, పోషించిన చారిత్రక పాత్రను కేసీఆర్ స్మరించుకున్నారు. విశ్వకీర్తిని పొందిన పాపన్న గొప్పతనాన్ని స్మరించుకునేందుకు ఏటా ఆయన జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహిస్తోందని సీఎం గుర్తు చేశారు.

నగర వార్తలు

బావుల మూసివేత పనులు ప్రారంభం


బాలుడి మృతికి కారణమైన బావిని పూడ్చివేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి

మణికొండ: మనుషుల ప్రాణాలకు ముప్పుగా ఉన్న పురాతన బావులను పూడ్చివేసే పనులను నార్సింగి మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు ప్రారంభించారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఒకరి స్థలంలో ఉన్న చేదుడు బావిలో మంగళవారం పడి బన్నీ(6) అనే చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. దాంతో సీడీఎంఏ కార్యాలయం నుంచి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పురాతన బావులు, బోరు బావులు ఎన్ని ఉన్నాయి..? ఇప్పటి వరకు ఎందుకు మూయలేదని..? ప్రశ్నించారు. వెంటనే వాటిని మూసి వేయాలని ఆదేశించారు. దాంతో స్పందించిన మున్సిపల్ కమీషనర్ బి.సురేందర్‌రెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బోర్లు, బావులపై మధ్యాహ్నం వరకు సర్వే నిర్వహించారు. దాంతో నార్సింగిలో 3, కోకాపేటలో 2, మంచిరేవులలో 1, వట్టినాగులపల్లిలో 2 బావులను గుర్తించారు. బాలుడి మృతికి కారణమైన బావి నివాసాల మధ్య ప్రమాదకరంగా ఉండటంతో కమిషనర్ స్వయంగా వెళ్లి దగ్గర ఉండి గురువారం పూడ్చివేశారు. మిగతా బావులను రెండు రోజుల్లో పూడ్చివేయాలని టీపీఎస్ పావనిని ఆదేశించారు.

హక్కుల సాధనకు పోరాడాలి



మల్లాపూర్: సంచార జాతుల సాంస్కృతిక సేవలు వెలకట్ట లేనివని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. గురువారం మల్లాపూర్ అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వీరభద్రీయ సంఘం నూతన కార్యవర్గం పదవీ బాధ్యతల కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వకుళభరణం కృష్ణమోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరభద్రీయులతో సహా సంచార కులాలు, జాతులు సమిష్టి వేదికగా ఏర్పాడి హక్కుల సాధనకు పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, వీరభద్రీయ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉపేందర్ కర్నె పాల్గొన్నారు.

నూతన వంగడాల రూపకల్పనకు
యువ శాస్త్రవేత్తలు కృషి చేయాలి


వినోద్‌కుమార్‌కు నాగలిని బహూకరించిన విశ్వవిద్యాలయం ఉద్యోగులు

ఏజీవర్సిటీ: రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులకనుగుణమైన నూతన వంగడాల రూపకల్పనకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని యువ శాస్త్రవేత్తలు కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం వ్యవసాయ విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాగునీటి వసతి పెరగడంతో రాష్ట్రంలో వరి పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని అలాగే పప్పు దినుసులు, నూనెగింజల వంటి పంటల సాగు విస్తీర్ణం కూడ పెంచడానికి శాస్త్రవేత్తలు తగిన సూచనలు చేయాలని అన్నారు. తెలంగాణ పర్యాటక సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్,టీఎన్జీవో సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు ముజీబ్ పాల్గొన్నారు.

వీరన్న కుటుంబానికి అండగా ఉంటాం


వీరన్న సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

- ఎమ్మెల్యే ముఠా గోపాల్
- కుటుంబానికి పలువురి ఆర్థికసాయం
- సాక్షి జర్నలిస్టుకు పలువురి నివాళి

ముషీరాబాద్: ఇటీవల మరణించిన సాక్షి కవాడిగూడ విలేకరి మద్దినేని వీరన్న సంతాప సభ గురువారం రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్, వీరన్న మిత్ర బృందం ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై వీరన్నకు నివాళులర్పించారు. వీరన్న కుటుంబానికి అండగా ఉంటామంటూ రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. అదే విధంగా గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సీఎండి, వీరన్న మిత్రుడు సయ్యద్ ఇమామ్ రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్య వీరన్న కుమారుడు ధనుష్ చదువు నిమిత్తం అయ్యే ఖర్చు రూ.50 వేలు చెల్లిస్తానని ముందుకు వచ్చారు. రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.శ్రీనివాస్‌రెడ్డి నాయిని నర్సింహ్మారెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 20 వేలు అందించి ధనుష్ మాస్టర్ డిగ్రీ కోసం అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ ఐదు వేల రూపాయలను, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి.రచనశ్రీ, తండ్రి వెంకటేష్‌లు 11 వేల రూపాయలను అందజేశారు. బీజేపీ నాయకులు ప్రఫుల్‌రాంరెడ్డి, పద్మజ దంపతులు రూ.11 వేలు, టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీష్ రూ.10 వేలు అందించారు. తెలంగాణ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి రూ.10 వేలు అందించారు. ఇంకా పలువురు ఆర్థికసహాయం చేశారు. మొత్తం 4.25 లక్షల ఆర్థిక సహాయాన్ని వీరన్న కుటుంబానికి అందజేశారు.

బుల్లితెరపైనా యాక్షన్ సీన్లు

సాక్షి, సిటీబ్యూరో: సినిమాల్లోనే కాదు బుల్లి తెరపైన కూడా యాక్షన్ సీన్‌లకు మంచి ఆదరణ లభిస్తోందని ప్రముఖ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌లు తెలిపారు. నటనా రంగంలో బుల్లితెర, వెండితెర అంటూ తేడా లేకుండా అన్ని ఫార్మాట్లలోనూ వినూత్న పంథా కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. జీ తెలుగు వేదికగా ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్న జగద్ధాత్రి సీరియల్ ప్రారంభ వేడుక గురువారం జూబ్లీహిల్స్‌లోని రామానాయుడు స్టూడియో వేదికగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. సీరియల్ యాక్షన్‌సీన్ల కోసం పనిచేయడం కొత్త అనుభూతని అన్నారు. ఇందులో దీప్తి చేసిన యాక్షన్ పోరాటాలు అందరినీ ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. జగద్ధాత్రి థీమ్ సాంగ్‌కు ఒక్క రోజులోనే మిలియన్ వ్యూస్ రావడం మరచిపోలేని అనుభవమని ముఖ్య కథనాయిక దీప్తి తెలిపారు.

నిమ్స్‌లో ఇక బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌లకు చెక్

లక్డీకాపూల్ : నిమ్స్ మరో సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంతం చేసుకుంది. శస్త్రచికిత్స ద్వారా బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్‌లకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టేందుకు నిమ్స్ ప్లాస్మా స్టెరిలైజర్ యంత్రాన్ని సమకూర్చుకుంది. సాధారణంగా శస్త్రచికిత్సల అనంతరం సర్జికల్ పరికరాలను క్లీనింగ్ కోసం సాధారణ స్టెరిలైజర్ మిషన్‌లో సుమారు రెండు మూడు గంటలు పెట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నిమ్స్ యాజమాన్యం తాజాగా ప్లాస్మా స్టెరిలైజర్ యంత్రాన్ని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యానారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ ఆధునాత పరికరాన్ని రోబోటిక్ సంబంధించిన శస్త్ర చికిత్సలకు వినియోగించే పరికరాలను శుభ్రపరిచేందుకు (స్టెరిలైజర్) ఉపయోగిస్తారు. అంతే కాకుండా ల్యాప్రో స్కోపీ సర్జరీలకు వినియోగించే సూక్ష్మ పరికరాలను సైతం శుభ్రం చేస్తుంది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో యూరాలజీ హెచ్ ఓడి రాహుల్ దేవరాజ్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ డాక్టర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.


ప్లాస్మా స్టెరిలైజర్ యంత్రాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ బీరప్ప

గిరిజన మహిళపై థర్డ్‌డిగ్రీ..

రాత్రంతా ఠాణాలోనే ఉంచి చిత్రహింసలు

ఒళ్లు కమిలేలా లాఠీలతో కొట్టారు.. బూటుకాళ్లతో తన్నారు

ఎల్‌బీనగర్ స్టేషన్ పరిధిలో ఘటన..


నడవలేని స్థితిలో బాధితురాలు

నాగోలు: ఒంటరిగా ఉన్న ఓ గిరిజన మహిళను అనుమానించారు. అంతటితో ఆగకుండా బలవంతంగా అర్ధరాత్రివేళ స్టేషన్‌కు తీసుకెళ్లారు. రాత్రంతా స్టేషన్‌లో నిర్బంధించి లాఠీలు, బూటు కాళ్లతో తంతూ చిత్రహింసలకు గురి చేశారు. ఈ ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగ్గా, ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లితండాకు చెందిన వడిద్యా లక్ష్మి, భర్త శ్రీను చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో మీర్‌పేటలోని నందిహిల్స్‌కు వచ్చింది. స్థానికంగా ఇళ్లలో పనికి కుదిరి ఇక్కడే నివాసముంటోంది. ఇటీవల లక్ష్మి పెద్ద కూతురుకు పెళ్లి సంబంధం కుదిరింది. ఎంగేజ్‌మెంట్ కూడా అయ్యింది. ఈనెల 30న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. పెళ్లి ఖర్చుల కోసమని దేవరకొండలోని బంధువుల ఇంటికి ఈ నెల 15వ తేదీన వెళ్లింది. వారి వద్ద రూ.3లక్షల నగదు అప్పుగా తీసుకుంది. అక్కడి నుంచి ఎల్‌బీనగర్‌కు బస్సులో వచ్చింది. అప్పటికే అర్ధరాత్రి అయ్యింది. మీర్‌పేటకు వెళ్లేందుకు ఆటోలు, బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఎల్‌బీనగర్ చౌరస్తాలో రోడ్డు పక్కన లక్ష్మి నిలబడింది. అదే సమయంలో పెట్రోలింగ్ వాహనం ఆమె వద్దకు వచ్చి ఆగింది. ఎక్కడకు వెళుతున్నావు... చేతిలో డబ్బు ఎక్కడిదని పోలీసులు గట్టిగా ప్రశ్నించారు. ఊరి నుంచి వస్తున్నానని, ఆటో కోసం ఎదురుచూస్తున్నానని చెప్పినా పోలీసులు వినలేదు. కూతురు పెళ్లికార్డు చూపించినా పట్టించుకోలేదు. అర్ధరాత్రి వేళ లక్ష్మిని ఎల్‌బీనగర్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ క్రమంలో లక్ష్మికి పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులకే ఎదురు మాట్లాడతావా అంటూ లక్ష్మిపై హెడ్ కానిస్టేబుల్ శివశంకర్, మహిళా కానిస్టేబుల్ సుమలత, మరో ఇద్దరు సిబ్బంది లాఠీలు, బూటు కాళ్లతో దాడి చేశారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఉదయం ఆటోలో పోలీసులు లక్ష్మిని ఇంటికి పంపించారు. లక్ష్మి నడవలేని పరిస్థితిని గమనించిన ఆమె కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడిని ఇంటికి పిలిపించి వైద్యం చేయించారు.


లక్ష్మి ఒంటిపై గాయాలు

డబ్బు, ఆభరణాలు లాక్కొన్నారు

ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, రాత్రంతా అక్కడే ఉంచి చితకబాదారు. తన చేతిలోని నగదు, మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ పోలీసులు బలవంతంగా తీసుకున్నారు. ఈ క్రమంలో వారితో వాగ్వాదం జరిగింది. నాపై దాడి చేసిన ఎస్‌ఐపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. **– బాధితురాలు లక్ష్మి**

అర్ధరాత్రి ముఠాగా సంచరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు

ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ముఠాగా ఏర్పడి అర్ధరాత్రి ఎల్‌బీనగర్ చౌరస్తాలో సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు పెట్రోలింగ్ సమయంలో పోలీసులు గుర్తించారు. దీంతో వారిపై ఐపీసీ సెక్షన్ 290 కింద కేసు నమోదు చేసి ఈనెల 16న రిమాండ్‌కు తరలించారు. అయితే మర్నాడు ఉదయం లక్ష్మి మినహా మిగిలిన నిందితులు జరిమానా చెల్లించారని ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు. **– ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి**

పూజ ఫిర్యాదు.. పోలీసులపై అట్రాసిటీ కేసు

లక్ష్మి కూతురు వడ్యా పూజ ఫిర్యాదు మేరకు దాడి చేసిన పోలీసులపై ఎల్‌బీనగర్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. పూజ ఫిర్యాదు ప్రకారం...ఈనెల 15వ తేదీన తల్లి లక్ష్మి తన పెళ్లికి కోసం రూ. 3లక్షల అప్పుగా తేవడానికి మేనమామ చంద్రుని వద్దకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. సాయంత్రం వరకు నేనే నా తమ్ముడు అమ్మకోసం ఎదురుచూశాం. కానీ ఆమె రాలేదు. 16వ తేదీన ఎల్‌బీనగర్ స్టేషన్ అమ్మ ఉన్నట్టు సమాచారం తెలిసి కొంతమందితో కలిసి వెళ్లాను. అమ్మ గురించి పోలీసులను అడిగితే తనను కులం పేరుతో దూషించారని, తల్లిపై పోలీసులు తొడలు, మోకాలు ఇతర శరీర భాగాలపై తీవ్రంగా కొట్టి గాయాలు చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. తన తల్లి వద్ద ఉన్న రూ. 3లక్షల నగదు, బంగారు చెవి రింగులు కూడా కనిపించడం లేదని ఆ ఫిర్యాదులో వివరించింది. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు 354, 324, 379,సెక్షన్3(1) (ఆర్)(ఎస్), 3(2)(వీఏ), అట్రాసిటీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇద్దరి సస్పెన్షన్..

జరిగిన సంఘటనపై ప్రాథమిక విచారణ చేసిన రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్, మహిళా కానిస్టేబుల్ సుమలతలను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని, ఇతరుల పాత్ర రుజువైతే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు.

లక్ష్మికి సొంత ఖర్చులతో వైద్యం చేయిస్తా..

గాయపడిన లక్ష్మి వైద్య ఖర్చులు మొత్తం తానే భరిస్తానని ఎల్‌బీనగర్ ఏసీపీ జానకిరెడ్డి తెలిపారు. లక్ష్మిని వైద్య పరీక్షల కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించామన్నారు.

గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం: మాజీ మంత్రి రవీంద్రనాయక్

➤ గిరిజన సంఘాల నేతలు, ఇతర ప్రజాసంఘాల నాయకులు గురువారం బాధితురాలు లక్ష్మితో కలిసి ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రవీంద్ర నాయక్ మాట్లాడుతూ జరిగిన ఘటనపై గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. దాడి చేసిన పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేష్, ప్రధానకార్యదర్శి బాలు, ఆల్ ఇండియా బంజారాసేవా సంఘం రాష్ట్ర అధ్య క్షుడు రాజు, గిరిజన విద్యార్థి నేత వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కస్టోడియల్ మరణంపై సీసీటీవీ ఫుటేజీ అందజేయండి

గచ్చిబౌలి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కస్టోడియల్ మరణం చోటుచేసుకున్న హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లోని జూలై 7వ తేదీ నాటి సీసీటీవీ ఫుటేజీని అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆ ఫుటేజీని చాంబర్‌లోగానీ, లేదా వీలైతే కోర్టుహాల్‌లోగానీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.. ఎన్నిచోట్ల పనిచేస్తున్నాయి.. ఎన్నిచోట్ల పనిచేయడంలేదు.. లాంటి వివరాలతో నివేదిక అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో భవన నిర్మాణకార్మికుడు గత నెల 7న అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. బిహార్‌కు చెందిన నితీశ్ నానక్‌రాంగూడలో భవన నిర్మాణకార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడి భద్రతాసిబ్బంది, కార్మికులు రెండువర్గాలుగా విడిపోయి దాడులకు దిగారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నితీశ్‌ని అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. పత్రికల్లో వచ్చిన నితీశ్ మృతి వార్తపై న్యాయవాది రాపోలు భాస్కర్ స్పందించి కస్టోడియల్ మరణంపై న్యాయ విచారణ జరపాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు.

15 రోజులు గడువు కావాలి..

➤ 'మద్యం సేవించేందుకు అర్ధరాత్రి భవన నిర్మాణకార్మికులు బయటకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో గొడవ జరిగింది. ఈ వివాదంలో నితీశ్‌ను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లిన పోలీసులు మూడు రోజులపాటు లాకప్‌లో ఉంచి విచారణ చేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన నితీశ్‌ను ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. పోలీసుల చిత్రహింసల వల్లే అతడు చనిపోయాడని పత్రికల్లో వచ్చింది. అయితే ఆయన గుండెపోటుతోనే చనిపోయాడని పోలీసులు పేర్కొంటున్నారు' అని న్యాయవాది లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను సుమోటో రిట్ పిటిషన్‌గా హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఉన్నాయని, ఫుటేజీ సమర్పిస్తామని చెప్పారు. దీనికి 15 రోజుల గడువు కావాలని కోరారు. గుండెపోటు కారణంగానే బాధితుడు మృతి చెందాడన్నారు. సీసీటీవీ ఫుటేజీని సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ఆ ఫుటేజీని సమర్పించాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

పోలీసులకు సున్నితత్వం ముఖ్యం

- ఒకరిద్దరు చేసే తప్పులతో శాఖకే అప్రదిష్ట
- 'పోలీస్ పతక విజేతల సత్కారం'లో డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో 99% మంది పోలీసులు బాగా పనిచేస్తున్నా.. ఒకరిద్దరు చేస్తున్న తప్పులతో పోలీస్ ప్రతిష్ట దిగజారుతోందని డీజీపీ అంజనీకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది వృత్తిలో సున్నితత్వం కలిగి ఉండాలని కోరుతున్నానని అన్నారు. సెన్సిటివిటీ అనేది పోలీసు ఉద్యోగానికి అత్యంత ముఖ్యమన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ స్థాయి పోలీస్ పతకాల జాబితాలో తెలంగాణ నుంచి స్థానం పొందిన 38 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని డీజీపీ తన కార్యాలయంలో గురువారం ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోలీసులు 50 నుంచి 70 పతకాలు సాధించారని సంతోషపడుతున్నంతలోనే ఇద్దరు కానిస్టేబుల్ అధికారులు చేసిన తప్పుతో ఆ పతకాల గౌరవం కింద పడిపోయినట్టయిందన్నారు. మన పతకాల విషయాన్ని పక్కనపెట్టి ప్రజలు సోషల్ మీడియాలో తాజాగా చోటుచేసుకున్న ఘోరం గురించే చర్చిస్తారన్నారు. పోలీసులింకా క్రూరంగానే వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం చేస్తారు' అన్నారు.

గర్భసంచి తొలగించమంటే.. పెద్దపేగు కట్ చేశారు!

ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన..

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఘటన..


ఇందిర మృతదేహం వద్ద రోదిస్తున్న ఆమె బంధువులు

నర్సాపూర్: గర్భసంచి తొలగింపు నిమిత్తం ఆసుపత్రిలో చేరిన తమ సోదరికి వైద్యులు ఆపరేషన్ చేసి పెద్దపేగు కత్తిరించారని, ఆరోగ్యం విషమించి ఆమె మృతి చెందిందని మృతురాలి సోదరుడు, కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. నర్సాపూర్‌లోని చైతన్యపురి కాలనీకి చెందిన ఇటికె ఇందిర(43) గర్భసంచి తొలగింపు ఆపరేషన్ కోసం స్థానిక పద్మజ ఆసుపత్రిలో ఈ నెల 14న చేరింది. 15న ఆపరేషన్ చేసే సమయంలో కడుపులోని పెద్దపేగును వైద్యులు కత్తిరించారు. దీంతో గురువారం ఉదయానికల్లా ఆమె ముఖం నలుపురంగులోకి మారింది. మధ్యాహ్నం శ్వాస తీసుకునేందుకు ఇబ్బందులు పడుతుండగా కుటుంబసభ్యులు మళ్లీ అదే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో చనిపోయిందని చెప్పారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇందిర చనిపోయిందని కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. కాగా, తమ తప్పేమి లేదని ఆసుపత్రి ఎండీ డాక్టర్ సిద్ధార్థ తెలిపారు. పేగు కట్ అయిందని, అంత మాత్రాన రోగికి ప్రాణహాని ఉండదన్నారు. ఆమె గుండెపోటుతో చనిపోయిందని పేర్కొన్నారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

ఉన్నత విద్యలో గేమ్ చేంజర్

ఏపీ విద్యార్థులు ప్రపంచ స్థాయి వర్సిటీల నుంచి కోర్సులు ఉచితంగా చదివే చాన్స్

ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ప్రభుత్వం ఒప్పందం

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యారంగంలో మరో విప్లవాత్మక మార్పునకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు సైతం ప్రపంచ స్థాయి కోర్సులను అందించేందుకు మార్గం సుగమం చేసింది. హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి సహా ఇతర ప్రపంచ అత్యుత్తమ వర్సిటీల సర్టిఫికేషన్ పొందేలా ప్రముఖ మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎడెక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో, పద్మశ్రీ అవార్డు గ్రహీత అనంత్ అగర్వాల్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు రూపొందించిన ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులతో రాష్ట్ర వర్సిటీ కోర్సులను మిళితం చేసి ఉత్తమ విద్య అందించేలా రోడ్ మ్యాప్ రూపొందించనున్నారు. ఎడెక్స్ ఒప్పందాన్ని ఉన్నత విద్యలో గేమ్ ఛేంజర్‌గా ముఖ్యమంత్రి జగన్ అభివర్ణించారు. ప్రపంచంలో అనూహ్యంగా మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి వివిధ రకాల సబ్జెక్టులను ఉచితంగా నేర్చుకునే అవకాశం మన విద్యార్థులకు దక్కుతుందన్నారు. విదేశాలకు వెళ్లి చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన వర్సిటీలు రూపొందించిన కోర్సులను సులభంగా నేర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్ చాలా గొప్పది. విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద విద్యార్థుల కోసం ప్రపంచం మెచ్చిన అత్యుత్తమ వర్సిటీల నుంచి ఉత్తమ కోర్సులను, నిపుణులైన అధ్యాపకులతో బోధన అందించాలని తపిస్తున్నారని ఎడెక్స్ వ్యవస్థాపకుడు అనంత్ అగర్వాల్ ప్రశంసించారు.

విద్యార్థులకు ప్రయోజనం ఇలా

రాష్ట్ర ప్రభుత్వం ఎడెక్స్ సంస్థతో చేసుకున్న ఒప్పందం ద్వారా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంఐటీ, హార్వర్డ్ లాంటి అత్యున్నత స్థాయి సంస్థలు అందించే పలు కోర్సులను ఆన్‌లైన్‌లో అభ్యసించే అవకా శం మన విద్యార్థులకు లభిస్తుంది. ఈ సంస్థలు అందించే సర్టిఫికెట్లు, క్రెడిట్ల ద్వారా మన విద్యార్థులకు మంచి వేతనాలతో కూడిన ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయి. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న మేజర్ కోర్సులతో పాటు మైనర్ కోర్సులుగా వీటిని అమలు చేయనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యా సంస్థల్లో పలు కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంస్కరించి పైథాన్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటివి సిలబస్‌లో చేర్చింది. ఈమేరకు కరిక్యులమ్ సిద్ధమైనా బోధనా సిబ్బంది తగినంతగా అందుబాటులో లేనందున విద్యార్థులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదు. ఈ నేపథ్యంలో ఎడెక్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మన విద్యార్థులు వరల్డ్‌క్లాస్ వర్సి టీలు, ఇతర విద్యాసంస్థలు అందించే కోర్సులను రెగ్యు లర్ కోర్సులతో పాటుగా అభ్యసించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మేజర్ కోర్సుల సర్టిఫికెట్లు, క్రెడిట్లతో పాటు ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ విద్యా సంస్థల నుంచి మైనర్ కోర్సుల సర్టిఫికెట్లు, క్రెడిట్లు కూడా విద్యార్థుల ఖాతాలో జమ కానున్నాయి. తద్వారా చదువులు పూర్తైన అనంతరం అవకాశాలను గరిష్టంగా అందుకోగలుగుతారు.

మార్గదర్శి మరో 'అగ్రిగోల్డ్'!

సోదాల్లో బయటపడ్డ పలు వాస్తవాలు..

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఒక మేడి పండు అన్న నిజం వెలుగు చూసింది. పొట్ట విప్పి చూస్తే ఆర్థిక అక్రమాలు గుట్టలు గుట్టలుగా బయటపడ్డాయి. ఫోర్జరీ సంతకాలతో మోసాలు.., చందాదారులకు తెలియకుండానే చిట్టీ పాటలు.., మేనేజ్‌మెంట్ టికెట్లు పేరిట బురిడీలు.., ఏజంట్ల ద్వారా కనికట్టు.., బ్రాంచిల నుంచి ప్రధాన కార్యాలయానికి అక్రమంగా నిధులు మళ్లింపు.., నిధుల్లేక ఖాళీగా ఉన్న బ్యాంకు ఖాతాలు.. ఇలా మార్గదర్శి చిట్‌ఫండ్స్ లోగుట్టు ఆధారాలతో సహా వెలుగు చూసింది. చందాదారుల సొమ్ముతో రామోజీరావు అక్రమ వ్యాపార సామ్రాజ్యం విస్తరణకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఇం'ధనం'గా ఉపయోగపడుతోందన్నది రుఢీ అయ్యింది. అదే సమయంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ సొంత ఆర్థిక పరిస్థితి దినదిన గండంగా ఉందన్న అసలు వాస్తవం వెల్లడైంది. చందాదారుల సొమ్ముకు ఏమాత్రం భద్రత లేదన్న విషయం ఆధారాలతో సహా బయటపడింది. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే మార్గదర్శి చిట్‌ఫండ్స్ మరో అగ్రిగోల్డ్ కానున్నదన్నది విస్పష్టమైంది. వేలాదిమంది మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు నిండా మునిగిపోయే ప్రమాదం ఉందన్న విషయం రూఢీ అయింది. రాష్ట్రంలో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 37 శాఖల్లో స్టాంపులు – రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు గురువారం సోదాలు చేశారు. ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో చేపట్టిన ఈ ఆకస్మిక సోదాల్లో సంస్థ ఆర్థిక అక్రమాలు భారీగా వెలుగులోకి వచ్చాయి. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం, ఆర్‌బీఐ నిబంధనలే కాదు.. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) కింద కూడా పలు నేరాలకు సంస్థ యాజమాన్యం పాల్పడినట్టు వెల్లడైంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలపై ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు ఏ–1గా, మేనేజింగ్ డైరెక్టర్ శైలజ కిరణ్ ఏ–2గా, బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) ఏ–3గా సీఐడీ కేసు నమోదు చేసి, చార్జిషీటు కూడా దాఖలు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్టాంపులు – రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల బృందాలు చేపట్టిన సోదాలు గురువారం అర్ధరాత్రి కూడా కొనసాగుతున్నాయి. ఈ సోదాలు మరో రెండు రోజులు కొనసాగే అవకాశాలున్నాయి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

ఇదే పరిస్థితి కొనసాగితే బోర్డు తిప్పేయడమే

విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో జరిగిన సోదాల్లో పలు విస్మయకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రామోజీరావు ఘనంగా చెప్పుకొనే ఈ సంస్థ ఆర్థికంగా కుదేలవుతుందనేందుకు స్పష్టమైన ఆధారాలు బయటపడ్డాయి. సంస్థ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. అధికారులు సోదాలు చేస్తున్న 37 శాఖల బ్యాంకు ఖాతాల్లో వాటి చందాదారుల నిధులు లేవని వెల్లడైంది. అంటే చందాదారులు చెల్లించిన డబ్బును అక్రమంగా ప్రధాన కార్యాలయానికి తరలించేశారు. ఆ నిధులు ప్రధాన కార్యాలయం బ్యాంకు ఖాతాలో ఉన్నాయా అంటే అక్కడా లేవు. వాటిని గుట్టుచప్పుడు కాకుండా రామోజీరావు సొంత వ్యాపార సంస్థల్లో, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా మళ్లించేశారు. వెరసి రాష్ట్రంలోని 37 మార్గదర్శి శాఖల ఆర్థిక పరిస్థితి కుదేలైంది. ఆ శాఖల చందాదారులు చిట్టీ పాటలు పాడిన సొమ్ము (ప్రైజ్ మనీ)ని చెల్లించే స్థితిలో సంస్థ లేదన్న విషయం సోదాల్లో తేలింది. ఇది ఎన్నో ఏళ్లుగా ఉన్న పరిస్థితే అని కూడా స్పష్టమైంది. కొత్తగా చిట్టీ వేసే చందాదారులు చెల్లించే చందా మొత్తంతో పాత చిట్టీల చందాదారులు పాడిన ప్రైజ్ మనీని చెల్లిస్తూ ఇన్నాళ్లూ సంస్థ కనికట్టు చేస్తోంది. కానీ కేంద్ర చిట్‌ఫండ్ చట్టం–1982ను కచ్చితంగా పాటించాలని రాష్ట్ర చిట్ రిజిస్ట్రార్ స్పష్టం చేయడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ గత ఏడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీ గ్రూపులు వేయడం లేదు. అంటే 9 నెలలుగా వ్యాపార కార్యకలాపాలు నిలిచిపో యాయి. కొత్త చిట్టీలు, కొత్త చందాదారులు, కొత్తగా చందా మొత్తాలు రక డిసెంబర్ ముందు మొదలు పెట్టిన వేలాది చందాదారులకు చిట్టీ పాట ప్రైజ్‌మనీ చెల్లించడం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు తలకుమించిన భారంగా పరిణ మించింది. మరో వైపు చందాదారులకు చిట్టీ పాట మొత్తం చెల్లించకుండా వాటిని అక్రమ డిపాజిట్లుగా మళ్లిస్తోంది. కాలపరిమితి తీరిన డిపాజిట్లు చందాదారులకు తిరిగి చెల్లించాలి. అందుకు కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ వద్ద నిధులు లేవు. ఈ పరిణామాల నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైజ్‌మనీ, డిపాజిట్‌ల చెల్లింపు సందేహాస్పదంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే మూసి వేతకు ముందు అగ్రిగోల్డ్ సంస్థ ఏ దుస్థితిలో ఉందో.. ప్రస్తు తం మార్గదర్శి చిట్‌ఫండ్స్ అదే ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటోందన్నది ఆధారాలతో సహా బయటపడినట్టు సమాచారం. మార్గదర్శి భవి ష్యత్‌లో కూడా కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏ క్షణంలోనైనా బోర్డు తిప్పేస్తే చందాదారులు, డిపాజిట్‌దారులు నిండా మునిగిపోయే ప్రమాదం ఉందన్నది స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాల్లో బయటపడినట్టు తెలు స్తోంది. ఈ నేపథ్యంలో చందాదారులు, డిపా జిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభు త్వం జోక్యం చేసుకోవాల్సిన అనివార్యత కనిపిస్తోంది.

మార్గదర్శి సహాయ నిరాకరణ

స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాలకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ అడుగడుగునా ఆటంకాలు సృష్టించేందుకు యత్నించింది. అధికార బృందాలు లోపలికి రాకుండా సిబ్బంది వాగ్వాదానికి దిగారు. సోదాల సందర్భంగా కీలక రికార్డులు చూపించేందుకు సిబ్బంది నిరాకరించారు.అధికారుల బృందాలకు సహకరించవద్దని మార్గదర్శి ప్రధాన కార్యాలయం శాఖలకు ఫ్యాక్స్ ద్వారా ఆదేశించడం గమనార్హం. ఈనాడు పాత్రికేయులను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉద్యోగుల పేరిట కార్యాలయాల్లోపల మోహరించారు. వారు సోదాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈనాడు ప్రధాన కార్యాలయానికి చేరవేశారు. వారిచ్చిన సమాచారాన్ని వక్రీకరిస్తూ మీడియాలో వార్తలు ప్రసారం చేయడం ద్వారా అధికారుల బృందాలను బ్లాక్ మెయిల్ చేసేందుకు పన్నాగం పన్నారు. ఈవిధంగా సోదాలను అడ్డుకునేందుకు ఎంతగానో ప్రయత్నించారు. అయినప్పటికీ అధికారుల బృందాలు నిబంధనలను పాటిస్తూ సోదాలు కొనసాగిస్తున్నాయి.

కీలక పత్రాలు స్వాధీనం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలకు సంబంధించిన కీలక ఆధారాలను స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాలు, చిట్టీ గ్రూపుల చందాల వివరాలు, నిధుల మళ్లింపునకు సంబంధించిన పత్రాలు, ఫోర్జరీ సంతకాలు చేసిన రికార్డులు, హార్డ్ డిస్క్‌లను జప్తు చేసి పంచనామా నిర్వహించారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసినట్టుగా చందాదారుల వాంగ్మూలాలను నమోదు చేశారు. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ అధికారులు కీలక పురోగతి సాధించినట్లైంది. ఈ సోదాలు శుక్ర, శనివారాలు కూడా కొనసాగే అవకాశాలున్నాయి. దాంతో మార్గదర్శి ట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

ఏపీ గ్రూప్-1 తుది ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 111 గ్రూప్–1 పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గురువారం విడుదల చేసింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో 11 నెలల వ్యవధిలోనే ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఈ ఫలితాల వివరాలను ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ మీడియాకు వెల్లడించారు. మొత్తం 111 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించగా ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలను నిర్దేశిత తేదీల్లో ఏపీపీఎస్సీ నిర్వహించింది. 110 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన ఒక పోస్టుకు ఎంపికపై క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నుంచి నివేదిక రావాల్సి ఉంది.

టాప్–5 ర్యాంకర్లు వీరే..

- భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష
- భూమిరెడ్డి పావని
- కంబాలకుంట లక్ష్మీప్రసన్న
- కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
- భానుప్రకాశ్‌రెడ్డి మిమ్మితి

త్వరలో గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లు

ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో గ్రూప్–1, గ్రూప్–2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తామని ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ తెలిపారు. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్లకు సంబంధించి ఇప్పటికే ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. గ్రూప్–1, గ్రూప్–2లే కాకుండా డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీ సర్లు (డీఈవో), ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు, లైబ్రేరియన్లు తదితరాలు కలిపి 1,199 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. వీటితోపాటు 2020 అసిస్టెంట్ ప్రొఫెసర్, 220 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ ఇవ్వనున్నామని వెల్లడించారు. 17 ఏళ్ల తర్వాత ఈ పోస్టుల భర్తీ చేపడు తున్నామని చెప్పారు. ఈ క్రమంలో గ్రూప్–2 పరీక్షల సిలబస్, పరీక్ష విధానంలోనూ మార్పులు చేస్తున్నామన్నారు. పాత సిలబస్ పూర్తిగా డూప్లికేషన్‌తో ఉందని.. దీన్ని మార్చాలని అభ్యర్థుల నుంచి వినతులు వచ్చాయన్నారు. గ్రూప్–2లో గతంలో మూడు పేపర్లుండగా ఇప్పుడు రెండు పేపర్లుగా మార్చామని తెలిపారు.



రామోజీ, శైలజాకిరణ్ మళ్లీ డుమ్మా..

ఏపీ సీఐడీ విచారణకు మళ్లీ ముఖం చాటేసిన వైనం

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్ ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజాకిరణ్ మరోసారి సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. విచారణకు హాజరు కావాలని సీఐడీ రెండోసారి నోటీసులు జారీ చేసినప్పటికీ బేఖాతరు చేశారు. తద్వారా దర్యాప్తునకు ఏమాత్రం సహకరించే ప్రసక్తే లేదన్న వైఖరిని పునరుద్ఘాటించారు. కేంద్ర చిట్ ఫండ్ చట్టం, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా చందాదారుల నిధులను మళ్లించిన కేసులో విజయ వాడ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు రామోజీరావు, శైలజా కిరణ్‌కు నోటీసులు జారీ చేశారు. వీరిద్దరూ ఈ నెల 16న (బుధవారం) విచార ణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొ న్నారు. కానీ వారిద్దరూ విచారణకు హాజరు కాలేదు. సీఐడీ దర్యాప్తునకు రామోజీరావు, శైలజా కిరణ్ ముఖం చాటేయడం ఇది రెండోసారి.



కుక్కలు చుట్టుముట్టినా.. మనసులు చలించలే!

వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో అనాథ మృతి

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ ఆవరణలో గురువారం ఓ అనాథ మృతి చెందాడు. కాగా.. సంఘటనాస్థలం తమ పరిధిలోకి రాదంటూ ఆర్పీఎఫ్ పోలీ సులు, సివిల్ పోలీసులెవరూ ఆ దరిదాపుల్లోకి రాలేదు. ఉదయం 11:30 గంటలకు గుర్తించినా, సాయంత్రం 6:30 గంటల వరకు మృతదేహం అక్కడే ఉంది. మృతదేహం చుట్టూ కుక్కలు చుట్టుముట్టాయి. చివరికి ప్రయాణికులు, స్థానికుల జోక్యంతో మిల్స్‌కాలనీ పోలీసులు స్పందించారు. రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫామ్ ప్రాంగణంలోంచి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. మృతుడి చేతికి వాచ్, శరీరంపై అండర్‌వేర్ మాత్రమే ఉందని, ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని మిల్స్ కాలనీ పోలీసులు సూచించారు.

ఫ్యాషన్

కాసుల కాంతులు



కాసుల పేరుకు ఎవర్‌గ్రీన్ జ్యువెలరీ అనే పేరుంది.
ముఖ్యంగా సంప్రదాయ వేడుకల్లో కళ ఉట్టిపడటమే కాదు
చూపులనూ ఇట్టే కట్టిపడేస్తుంది.
కానీ, ధనవంతుల జాబితాలోనే ఆ ఆభరణం అనే
నిరాసక్తత అవసరం లేకుండా
అన్నింటా తానై కాసు కళకళలాడుతోంది.
వజ్రాలు పొదిగిన కాసులు
తక్కువ బంగారంతో ఎక్కువ కాసులు
సిల్వర్ కాసులు, ఇమిటేషన్ కాసులు
ఎంబ్రాయిడరీలో ఒదిగిన కాసులు
ఇప్పుడు ఎన్నో కాసులు వేడుకల్లో
మది దోచడానికి సిద్ధంగా ఉన్నాయి.
ఎంపిక మీదే అంటూ
తీరొక్క డిజైన్లతో ఆకట్టుకుంటున్నాయి.

పట్టుకు సరి జోడీ

బంగారు, ఇమిటేషన్ కాసుల ఆభరణాలు పట్టుకు సరిజోడీగా అనిపిస్తాయి. వేడుకల వేళ కళను వెయ్యింతలు చేస్తాయి. మననును ఆనందభరితం చేస్తాయి.

ఇండో వెస్టన్ లుక్

కాసుల హారాలు పట్టుచీరలు, పరికిణీ మీదకు మాత్రమే నప్పుతాయనే రోజులు ఇప్పుడు కావు. కాయిన్ జ్యువెలరీగా వెస్టన్ డ్రెస్సుల మీదకూ వరసలుగా వచ్చి చేరాయి. ఈ ఆభరణాల డిజైన్లలో 18 క్యారెట్ల గోల్డ్, సిల్వర్ కాయిన్స్‌ను వాడుతున్నారు డిజైనర్లు.



మరిన్ని హంగులు

కాసుల పేరు అనగానే మనకు హారం మాత్రమే గుర్తొస్తుంది. కానీ, ఇప్పుడు కాయిన్స్ ఉంగరాలుగానూ మారాయి. హ్యాంగింగ్స్‌గా మెరుస్తున్నాయి. జడలోనూ, పవిటకూ బ్రోచ్‌లుగా కట్టడి చేస్తున్నాయి. బ్రేస్‌లెట్స్‌గా, బెల్ట్‌గా, గాజులుగా... కాయిన్స్, లక్ష్మీ కాసులు తమ వైభవానికి మరిన్ని వన్నెలు అద్దుతున్నాయి.



బ్యూటిప్స్

ట్యాన్ తగ్గాలంటే...

● స్పూను కాఫీ పొడిలో స్పూను తేనె, స్పూను బంగాళ దుంప రసం, స్పూను గంధం పొడివేసి చక్కగా కలిపితే డీ ట్యాన్ ప్యాక్ రెడీ. ఈ ప్యాక్‌ను ముఖం, చేతులు, మెడపైన పూతలా వేసి పదిహేను నిమిషాలు ఆరనివ్వాలి. తరువాత తడి బట్టతో తుడిచేసి, నీటితో కడిగేయాలి. వారానికి రెండు–మూడుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే నలుపు పోయి, చర్మం నిగారింపు సంతరించుకుంటుంది. ● ప్యాక్ వేసుకునే సమయం లేనప్పుడు..టొమాటో రసాన్ని ముఖానికి రాసుకుంటే ట్యాన్ తగ్గుతుంది. ● నిమ్మరసంలో బంగాళదుంప రసం కలిపి ముఖానికి పెట్టుకున్నా ట్యాన్ పోతుంది. ● ఈ ప్యాక్‌లు వేసుకున్నప్పటికీ రాత్రి పడుకునేముందు చేతులు, కాళ్లకు నైట్‌క్రీమ్ రాసుకుంటే ట్యాన్ తొలగి చర్మం కాంతిమంతంగా మెరుస్తుంది.

కొత్తదారి

ప్రయాణ ప్రమోదం

- ట్రావెల్ విత్ కిడ్స్

ప్రయాణాల మీద బోలెడు ఆసక్తి ఉన్నప్పటికీ పిల్లలు ఒక వయసు వచ్చాకగానీ ఇల్లు దాటని తల్లులు ఎందరో ఉంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇన్‌స్టాగ్రామ్ ఫ్రెండ్స్, డెంటిస్ట్‌లు సాక్షి గులాటీ, నికిత మాథుర్‌లు యంగ్ మదర్స్ కోసం 'ట్రావెల్ విత్ కిడ్స్' అనే ట్రావెల్ గ్రూప్‌ను ప్రారంభించారు. ప్రయాణాలలో తల్లీపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు...



సాక్షి గులాటీ, నికిత మాథుర్‌లు పర్యాటక ప్రేమికులు. వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా సరే ప్రయాణాలకు మాత్రం దూరంగా ఉండేవారు కాదు. నాలుగున్నర సంవత్సరాల క్రితం సాక్షి ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లడానికి ఆలోచనలు చేస్తున్నప్పుడు 'చంటి బిడ్డతో ప్రయాణమా!!' అని ఆశ్చర్య పోవడమే కాదు ప్రయాణాలు వద్దంటే వద్దన్నారు చాలా మంది.

ఒక బిడ్డకు తల్లి అయిన నికితకు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది.

ఎవరి మాటలు పట్టించుకోకుండా చెన్నైకి చెందిన సాక్షి తన మూడు నెలల బిడ్డతో కలిసి మహాబలిపురానికి వెళ్లింది. చాలా కాలం తరువాత పర్యాటక ప్రదేశానికి వచ్చింది. మరోవైపు బెంగళూరుకు చెందిన నికిత మూడు నెలల పిల్లాడితో కలిసి మైసూర్‌కు వెళ్లింది.



● సాక్షి, నికిత

'బేబీతో ప్రయాణం కష్టమని చాలామంది భయపెట్టారు. ఇది నిజం కాదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. మొదటి మూడు నాలుగు నెలలు మాత్రమే కష్టం' అంటుంది సాక్షి.

చెన్నైలో ఉండే సాక్షి, బెంగళూరులో ఉండే నికితలు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యారు. ఒకే రకమైన వృత్తి, అభిరుచులు వారిని సన్నిహిత స్నేహితులుగా మార్చాయి.

సినిమాల నుంచి పర్యాటకం వరకు ఇద్దరు స్నేహితులు ఎన్నో విషయాలు మాట్లాడుకునేవారు. అలా ఒకరోజు వారి మధ్య చంటిబిడ్డలు ఉన్న తల్లుల ప్రస్తావన వచ్చింది.

మహిళల కోసం ఎన్నో ట్రావెల్ గ్రూప్స్ ఉన్నాయి. సోలో ట్రావెలర్స్, సీనియర్ సిటిజన్‌లు... మొదలైన వారి కోసం ఎన్నో ట్రావెల్ గ్రూప్స్ ఉన్నాయి. కాని మదర్స్ అండ్ కిడ్స్ కోసం మాత్రం లేవు. ఈ లోటును భర్తీ చేయడానికి రెండు సంవత్సరాల క్రితం 'ట్రావెల్ విత్ కిడ్స్' పేరుతో ట్రావెల్ గ్రూప్‌ను ప్రారంభించారు.

తొలి 'మదర్ అండ్ కిడ్స్' ట్రిప్‌ను పాండిచ్చేరికి ప్లాన్ చేశారు.

సాక్షికి పాండిచ్చేరి కొట్టిన పిండి. పాండిచ్చేరి ట్రిప్‌కు సంబంధించిన వివరాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మంచి స్పందన లభించింది. ఈ ట్రిప్‌లో ఆరుగురు తల్లులు వారి పిల్లలను తీసుకువెళ్లారు. ఈ ప్రయాణం విజయవంతం కావడంతో ఇద్దరు స్నేహితులకు ఎంతో ఉత్సాహం వచ్చింది. ఆ తరువాత వివిధ ప్రాంతాలకు సంబంధించి అయిదు ట్రిప్‌లు ప్లాన్ చేశారు.

తమ వృత్తిలో బిజీగా ఉండే సాక్షి, నికితలు వీకెండ్స్‌లో ప్లానింగ్ చేస్తుంటారు.

'చంటి బిడ్డలు ఉన్నారని ఇంటి నాలుగు గోడలకే పరిమితం కానక్కర్లేదు. బయటి ప్రపంచలోకి వస్తే కొత్త ఉత్సాహం, శక్తి వస్తాయి' అంటున్నారు సాక్షి, నికిత.

'పర్యాటక ప్రదేశాలకు వెళ్లి కొత్త అనుభూతిని సొంతం చేసుకునేలా చంటి బిడ్డల తల్లులను ప్రేరేపించడం ఒక లక్ష్యం అయితే, ప్రయాణాలలో తల్లీబిడ్డలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవడం అనేది మా ప్రధాన లక్ష్యం' అంటుంది నికిత.

ఈ ట్రావెల్ గ్రూప్ ప్రత్యేకత ఏమిటంటే, ఒక ట్రిప్ ప్లాన్ చేయడానికి ముందు సాక్షి, నికితలలో ఒకరు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి వస్తారు. అక్కడి పరిస్థితులను అంచనా వేస్తారు. రకరకాల జాగ్రత్తలు తీసుకుంటారు.



● సంతోషాల సరిగమలు

'ట్రిప్ బుక్ చేసుకున్న వారి కోసం వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాం. దీనిద్వారా తల్లుల ఆహారపు అలవాట్లతో పాటు వారి ఇష్టయిష్టాలు, తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తల గురించి వివరంగా తెలుసుకునే అవకాశం దొరికింది' అంటుంది సాక్షి.

చెన్నై, బెంగళూరు, ముంబై, జైపూర్, కోచి, కోల్‌కతా... ఇలా ఎన్నో నగరాల నుంచి తల్లులు ఈ ట్రిప్‌లలో భాగం అవుతున్నారు. తన పిల్లాడితో కలిసి పాండిచ్చేరికి వెళ్లిన దీపిక ఇలా అంటుంది...

'ట్రిప్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేశారు. ఎప్పుడైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు తిండి సహించేది కాదు. ఈ ప్రయాణంలో మాత్రం ఇంటి తిండిని మరిపించేలా చేశారు. ఈ ట్రిప్ ద్వారా ఎంతోమంది స్నేహితులయ్యారు'

ట్రిప్‌ల ద్వారా పరిచయం అయిన వారు ఒకరి ఇంటికి ఒకరు వెళ్లి కలుసుకోవడం, ఆ కుటుంబంలో వ్యక్తిలా మారడం మరో విషయం.

'కిడ్–ఫ్రెండ్లీగా లేవని కొన్ని ప్రదేశాలకు దూరంగా ఉంటాం. అయితే పిల్లలు మొరాకో నుంచి ఈజిప్ట్ వరకు ఎక్కడైనా సరే తమ ఆనందాన్ని తామే వెదుక్కుంటారు. పిల్లలు పార్క్‌లు, జూలలో మాత్రమే ఆనందిస్తారనేది సరి కాదు' అంటుంది సాక్షి.

సింగిల్ మదర్స్ ఈ ట్రిప్స్‌పై ఆసక్తి ప్రదర్శించడం మరో కోణం. స్థూలంగా చెప్పాలంటే 'ట్రావెల్ విత్ కిడ్స్' తల్లుల పర్యాటక సంతోషానికి మాత్రమే పరిమితం కావడం లేదు. ఒకే రకంగా ఆలోచించే వారిని ఒక దగ్గరికి తీసుకువచ్చింది. కొత్త స్నేహితుల రూపంలో కొత్త బలాన్ని కానుకగా ఇస్తోంది.

వంటిల్లు

నంజుకు తిందాం

ఉల్లి, పల్లి, కొబ్బరి, వెల్లుల్లి, పుట్నాల పచ్చళ్లు తినితిని చప్పగా మారిన నాలుకకు ఊరించే చట్నీలు కనిపిస్తే ప్రాణం లేచివస్తుంది. అందుకే చూడగానే నోరూరించే చట్నీలతో ఈ వారం వంటిల్లు మీకోసం...

నిమ్మకాయ ఇన్‌స్టంట్ పచ్చడి



కావలసినవి: నిమ్మకాయలు – పది; బెల్లం – అరకప్పు; జీలకర్ర – నాలుగు టీస్పూన్లు; ఎండు మిర్చి – ఇరవై; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● నిమ్మకాయలను నాలుగు ముక్కలుగా కట్ చేయాలి ● ముక్కల్లో ఉన్న గింజలన్నింటినీ తీసేయాలి (గింజలు ఉంటే పచ్చడి చేదుగా వస్తుంది) ● నిమ్మకాయ ముక్కలు, జీలకర్ర వేసి కచ్చాపచ్చాగా పేస్టుచేయాలి ● ఎండు మిర్చి, బెల్లంను కలిపి పొడిచేయాలి ● ఇప్పుడు నిమ్మకాయ పేస్టులో ఎండుమిర్చి పొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి. తాలింపు కావాలంటే వేసుకోవచ్చు. తాలింపు లేకపోయినా బావుంటుంది ● ఈ చట్నీని వెంటనే కూడా తినవచ్చు. కానీ రెండుమూడు రోజులు మాగాక మరింత రుచిగా ఉంటుంది ● ఇడ్లీ,దోశ, పరాటా, చపాతీ, అన్నంలోకి ఈ చట్నీ చాలా బావుంటుంది.

క్యారట్ క్యాప్సికమ్ చట్నీ

కావలసినవి: క్యారట్‌లు – పెద్దవి రెండు; క్యాప్సికం –పెద్దది ఒకటి; అల్లం – అంగుళన్నర ముక్క; పచ్చిమిర్చి –ఐదు; జీలకర్ర –టీస్పూను; ధనియాలు –టీస్పూను; ఆవాలు – అరటీస్పూను; పచ్చిశనగపప్పు – టీస్పూను; ఇంగువ – చిటికెడు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; చింతపండు గుజ్జు – రెండు టీస్పూన్లు; నూనె – నాలుగు టీస్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● క్యారట్, క్యాప్సికం, అల్లంను సన్నని ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి ● జీలకర్ర, ధనియాలను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో మూడు టీస్పూన్ల నూనె వేసి వేడెక్కిన తరువాత పచ్చిమిర్చి, అల్లం, క్యారట్, క్యాప్సికం ముక్కలు వేసి వేయించాలి ● కొద్దిగా ఉప్పు, కొద్దిగా నీళ్లుపోసి ముక్కలు మెత్తగా అయ్యేంత వరకు ఉడికించి దించేయాలి ● వేయించిన ధనియాలు, జీలకర్ర మిక్సీజార్‌లో వేసి గ్రైండ్ చేయాలి ● ఇవి నలిగిన తరువాత ఉడికించిన క్యాప్సికం క్యారట్ ముక్కలను వేయాలి ● చింతపండు గుజ్జు, కొత్తిమీర తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి ● మిగిలిన టీస్పూను నూనె వేడెక్కిన తరువాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వాలి. తరువాత శనగపప్పు, కరివేపాకు వేసి వేయించాలి. చివరిగా ఇంగువ వేసి దించేయాలి ● ఈ తాలింపుని పచ్చడిలో కలిపితే క్యారట్ క్యాప్సికం చట్నీ రెడీ. ఇడ్లీ, దోశ, రోటీల్లో ఇది మంచి కాంబినేషన్.

కశ్మీరీ చట్నీ



కావలసినవి: కశ్మీరీ మిరపకాయలు – ఇరవై; నూనె – ఐదు టేబుల్ స్పూన్లు; వెల్లుల్లి తురుము – ఐదు టేబుల్ స్పూన్లు; అల్లం తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు –రెండు టేబుల్ స్పూన్లు; టొమాటో కెచప్ – ఐదు టేబుల్ స్పూన్లు; రెడ్‌చిల్లీ సాస్ – రెండు టేబుల్ స్పూన్లు; సోయాసాస్ – టేబుల్ స్పూను; మిరియాల పొడి – టేబుల్ స్పూను; ఆరోరూట్ పొడి – టేబుల్ స్పూను, చక్కెర – టేబుల్ స్పూను; వెనిగర్ – మూడు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● మిరపకాయలను నీటిలో వేసి రెండు గంటలపాటు నానబెట్టాలి ● మిరపకాయలు చక్కగా నానాక మిక్సీజార్‌లో వేసి పేస్టుచేసి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో నూనె మొత్తం వేసి వేడెక్కనివ్వాలి. బాగా కాగిన నూనెలో వెల్లుల్లి తురుము, అల్లం తరుగు, కొత్తిమీర తరుగు వేసి మీడియం మంట మీద వేయించాలి ● తరువాత ఎండుమిర్చి పేస్టు వేసి వేయించాలి ● తరువాత టొమాటో కెచప్, రెడ్‌చిల్లీసాస్, సోయాసాస్, మిరియాలపొడి, ఆరోరూట్ పొడి, చక్కెర వేసి ఐదు నిమిషాలు తిప్పాలి ● చివరిగా రుచికి సరిపడా ఉప్పు, వెనిగర్ వేసి రెండు నిమిషాలపాటు వెయించి దించేయాలి ● నెలరోజులపాటు నిల్వ ఉండే ఈ చట్నీ ఇడ్లీ, దోశ, నూడుల్స్, ఎగ్‌ఫ్రైడ్‌రైస్‌ల్లోకి మంచి కాంబినేషన్.



సగ్గు బియ్యం పచ్చడి



కావలసినవి: సగ్గు బియ్యం – అర కప్పు; పెరుగు – రెండున్నర కప్పులు; అల్లం తురుము –టేబుల్ స్పూను; క్యారట్ తురుము – రెండు టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీస్పూను; జీలకర్ర – టీస్పూను; పచ్చిశనగపప్పు –టీస్పూను; పసుపు – అరటీస్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – మూడు టీస్పూన్లు; కరివేపాకు – రెండు రెమ్మలు; ఇంగువ – చిటికెడు.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని పదినిమిషాలపాటు మీడియం మంట మీద వేయించి పక్కన పెట్టుకోవాలి ● సగ్గు బియ్యం చల్లగా అయిన తరువాత పెరుగు వేసి కలపాలి. పెరుగు చిక్కగా అనిపిస్తే కొద్దిగా నీళ్లుపోసుకోని ఐదు గంటలపాటు నానబెట్టుకోవాలి ● సగ్గు బియ్యం పట్టుకుంటే మెత్తగా అయ్యేంతవరకు నానాక... కొత్తిమీర తరుగు , రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● బాణలిలో నూనెవేసి, వేడెక్కిన తరువాత ఆవాలు, జీలకర్ర, పచ్చిశనగపప్పు వేసి వేయించాలి. ఇవన్నీ వేగిన తరువాత పసుపు, ఇంగువ, క్యారట్ తురుగు వేసి నిమిషం పాటు వేయించి తీసేయాలి ● ఈ తాలింపు మిశ్రమాన్ని సగ్గుబియ్యం మిశ్రమంలో వేసి కలిపితే సగ్గు బియ్యం పచ్చడి రెడీ. అన్నం, చపాతీల్లోకి ఈ చట్నీ మంచి కాంబినేషన్.

కరివేపాకు పచ్చడి



కావలసినవి: కరివేపాకులు – రెండు కప్పులు; ఎండుమిర్చి – 10; చింతపండు – పెద్ద ఉసిరికాయ అంత పరిమాణం; పొట్టుతీసిన మినపగుళ్లు – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; నువ్వులు – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; బెల్లం – టేబుల్ స్పూను; ఉప్పు రుచికి సరిపడా.

తయారీ: ● బాణలిలో నూనెవేసి కాగనివ్వాలి. కాగిన నూనెలో మినపగుళ్లు, ఎండు మిర్చి వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి ● ఇదే బాణలిలో నువ్వులు వేసి దోరగా వేయించాలి. ఇవి వేగిన తరువాత కరివేపాకు ఆకులు, చింతపండు, రుచికి సరిపడా ఉప్పు వేసి వేయించాలి ● కరివేపాకు వేగిన తరువాత దించేసి, కొబ్బరి తురుము వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● కరివేపాకు మిశ్రమం వేడి తగ్గిన తరువాత బెల్లం వేసి మెత్తగా నూరుకుంటే కరివేపాకు పచ్చడి రెడీ. అన్నం, చపాతీ, ఇడ్లీ, దోశల్లోకి బావుంటుంది.

● ఇన్నోవేషన్

బంజరు భూములలో కూడా బంగారాన్ని పండించవచ్చని నిరూపిస్తున్నారు ఐఐటీ-బాంబే గ్రాడ్యుయేట్స్ అభయ్ సింగ్, అమిత్ కుమార్‌లు. వివిధ రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే క్లైమెట్ ప్రూఫ్ చాంబర్స్ ద్వారా రసాయన రహిత కూరగాయలను పచ్చగా పండిస్తున్నారు. 'ఇకీ ఫుడ్స్' స్టార్టప్‌తో ఈ మిత్రద్వయం అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది...

ప్రకృతి పరవశించిన చోట...



అమిత్ కుమార్

అభయ్ సింగ్

అభయ్ సింగ్, అమిత్ కుమార్‌లు ఐఐటీ-బాంబేలో బెస్ట్ ఫ్రెండ్స్. చాలామంది స్నేహితులలాగా సినిమాలు, క్రికెట్ గురించి కంటే పర్యావరణం, వ్యవసాయానికి సంబంధించిన విషయాలు ఎక్కువగా మాట్లాడుకునేవారు.

'కాలేజి రోజుల నుంచి సంప్రదాయానికి భిన్నంగా ఆలోచించడం మా అలవాటు. రకరకాల ప్రాజెక్ట్‌ల గురించి మాట్లాడుకునే వాళ్లం. క్లాస్ పూర్తయిన తరువాత ఎన్నో విషయాలపై మేధోమథనం చేసేవాళ్లం చదువుకున్నామా? ఉద్యోగాలు చేశామా? అని కాకుండా సమాజం కోసం మా వంతుగా ఏదైనా చేయాలనుకునే వాళ్లం. మన దేశంలో ఎంతో మంది వ్యవసాయరంగంలో పనిచేస్తున్నారు. వారి కోసం ఏదైనా చేయాలనుకునే వాళ్లం. ఏదైనా సాధించాలనే తపన పుట్టినప్పుడు ఆత్మవిశ్వాసం మొదలవుతుంది. అది అనేక రకాలుగా శక్తిని ఇచ్చి ముందుకు నడిపిస్తుంది. మా విషయంలోనూ ఇదే జరిగింది' అంటాడు అమిత్.



ఇకిగై అంటే...

ఇకిగై అనేది జపనీస్ కాన్సెప్ట్. ఆరోగ్యవంతమైన. శక్తివంతమైన జీవన విధానాన్ని ప్రతిఫలించే మాట. జపనీస్ పదాలు ఇకీ (జీవితం), కై (ఫలితం, ఫలం) నుంచి పుట్టింది. స్ఫూర్తిదాయకమైన 'ఇకిగై' కాన్సెప్ట్ నుంచి తమ స్టార్టప్‌కు 'ఇకీ ఫుడ్స్' అని నామకరణం చేశారు అమిత్, అభయ్‌లు.

> కొత్త ఆలోచనలు వృథా పోవు. కాస్త ఆలస్యమైనా మంచి ఫలితం దక్కుతుంది.
> - అమిత్ కుమార్, ఇకీ-ఫుడ్స్, కో-ఫౌండర్

వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన అమిత్, అభయ్‌లు ఆ రంగానికి సంబంధించిన రకరకాల ప్రయోగాలు చేస్తూ స్థిరమైన, అనుకూలమైన, అందుబాటులో ఉండే సాంకేతికతను రైతులకు దగ్గర చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

'జనాభా పెరుగుదల దృష్ట్యా మన దేశంలో ఆహార కొరత ఏర్పడనుంది. ఆహారంలో పోషక విలువలు కోల్పోనున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆహారం అందరికీ అందుబాటులో ఉండేలా, ఆరోగ్యానికి మేలు చేసేలా, వేగంగా ఉత్పత్తి చేసేలా కొత్త ఆవిష్కరణలు చేయాలనుకున్నాం' అంటాడు అభయ్.

తాము చర్చించుకున్న విషయాలను దృష్టిలో పెట్టుకొని 'ఇకీ ఫుడ్స్' అనే అంకురాన్ని ప్రారంభించారు. 'ఇకీ ఫుడ్స్' మొదలు పెట్టినప్పుడు మొదటి మూడు సంవత్సరాలు పరిశోధన, అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టారు.

వీరు సృష్టించిన సాంకేతికత ఎనభై శాతం నీటి వృధాను అరికడుతుంది. సంప్రదాయ పద్ధతుల్లో కంటే 75 శాతం వేగవంతమైన వృద్ధిరేటు ఉంటుంది. వివిధ రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే క్లైమెట్ ప్రూఫ్ చాంబర్స్ ద్వారా రసాయనరహిత కూరగాయలను పండిస్తున్నారు.

గత సంవత్సరం తమ టెక్నాలజీకి సంబంధించిన పేటెంట్ రైట్స్ పొందారు.

'ఎన్నో రకాల వ్యవసాయ పద్ధతులు ఉన్నా అవసరాలకు తగిన పద్ధతులు కనిపించడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వేగవంతమైన ఉత్పత్తి విధానాలకు ప్రాధాన్యత ఇచ్చాం. మట్టి నుంచి మొక్క మొలకెత్తడానికి నీరు. ఆక్సిజన్, పోషకాలు, సపోర్ట్ అవసరం అవుతాయి. ఈ నాలుగు ఆధారాలతో మట్టితో పని లేకుండా మొక్కలను సృష్టించాలనుకున్నాం. డెబ్బైశాతం తేమ ఉన్న గదిలో అవసరమైన పోషక మూలాలను స్ప్రే చేసి ప్రయోగాలు మొదలు పెట్టాం' అంటాడు అమిత్.

సంపన్న దేశాల వ్యవసాయ క్షేత్రాల హైడ్రోపోనిక్స్ సిస్టమ్‌లో ఉపయోగించే కూలర్‌లు, చిల్లర్‌లు, బ్లోయర్‌లు, ప్లాస్టిక్ ఎన్‌క్లోజర్‌లకు ఈ మిత్రద్వయం దూరంగా ఉండాలనుకుంటోంది. సౌరశక్తిలోని అద్భుతాన్ని ఉపయోగించుకొని సంప్రదాయ పద్ధతుల్లో కంటే ఎక్కువ దిగుబడి సాధించాలనుకుంటోంది.

రాజస్థాన్‌లోని కోట కేంద్రంగా పని చేస్తున్న 'ఇకీ ఫుడ్స్' స్టార్టప్ 'కంట్రోల్డ్ ఎన్విరాన్‌మెంట్ అగ్రికల్చర్'ను తన నినాదంగా, విధానంగా ఎంచుకుంది. రాబోయే రోజుల్లో మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలలో 'ఇకీ ఫుడ్స్' క్షేత్రాలకు శ్రీకారం చుట్టడానికి రెడీ అవుతున్నారు అమిత్, అభయ్‌లు.

యువర్స్

టెక్.. టాక్

షావోమీ రెడ్‌మీ ప్యాడ్ ఎస్ఈ



రిజల్యూషన్: 1920×1200 పిక్సెల్స్;
రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జెడ్
కలర్స్: గ్రాఫిటి గ్రే, మింట్ గ్రీన్;
బ్యాటరీ: 8,000 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్: 13;
బ్లూటూత్: 5.0

రెడ్‌మీ వాచ్ 3 యాక్టివ్

- రిజల్యూషన్: 240×280
- రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జెడ్
- బరువు: 42 గ్రా
- కలర్: బ్లాక్ అండ్ ఆఫ్-వైట్
- వాటర్ ప్రూఫ్
- బ్లూటూత్
- 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్
- ధర: రూ.2,999



ఎక్స్‌రియల్ ఎయిర్ ఏఆర్ గ్లాసెస్



డైమెన్షన్స్:
అన్ ఫోల్డెడ్: 148 ఎంఎం×52 ఎంఎం×159ఎంఎం
ఫోల్డెడ్:
148ఎంఎం×52 ఎంఎం×60 ఎంఎం
ఆడియో: డ్యూయల్ ఓపెన్-ఇయర్ స్పీకర్స్
రిజల్యూషన్: 1920×1080 పిక్సెల్స్
స్క్రీన్ సైజ్: 130-అంగుళాలు
ఇంటర్నల్స్: 4జీబి ర్యామ్
బ్యాటరీ: 4870 ఎంఏహెచ్

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఎగ్ ఆన్ యువర్ ఫేస్

ఏదైనా తప్పు జరిగినప్పుడు, తప్పు జవాబు చెప్పినప్పుడు ఎగతాళిగా ఉపయోగించే మాట... ఎగ్ ఆన్ యువర్ ఫేస్.

ఉదా: శ్రీను హ్యాడ్ ఎగ్ ఆన్ హిజ్ ఫేస్ ఆఫ్టర్ సేయింగ్ హీ కుడ్ ఈజీలీ డు 50 పుషప్స్, అండ్ దెన్ గివింగ్ అప్ ఆఫ్టర్ డూయింగ్ జస్ట్ ట్వంటీ.

కార్ట్ బ్లాష్

ఒక వ్యక్తికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చే సందర్భంలో ఉపయోగించే మాట.

ఉదా: ది ఆర్కిటెక్ట్ గివెన్ కార్ట్ బ్లాష్ టు డిజైన్ ది స్టోర్

'కార్ట్ బ్లాష్' అనే ఫ్రెంచ్ మాటకు తెల్ల కాగితం, బ్లాంక్ చెక్ లాంటి అర్థాలు ఉన్నాయి.

● మ్యూజిక్ వరల్డ్

విజయ కేతనం



కేతకి

ఏ గూటి చిలక ఆ గూటి పలుకే పలుకుతుంది...అన్నట్లు సంగీతకారుల కుటుంబంలో జన్మించిన కేతకి మతేంగోకర్‌కు చిన్నప్పటి నుంచే పాట అంటే ఇష్టం. తండ్రి ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్. తల్లి సువర్ణ సింగర్.

నటిగా కూడా మెప్పించింది కేతకి. 'షాల' ఆమె డెబ్యూ ఫిల్మ్. ఈ సినిమా కోసం అవకాశం తనను వెదుక్కుంటూ వచ్చింది. దర్శకుడు సుజిత్ ఒక టెలివిజన్ మ్యూజిక్ షోలో కేతకిని చూసి తన సినిమాలోని పాత్రకు ఎంపిక చేశాడు.

నటనలో మంచి మార్కులు తెచ్చుకున్నప్పటికీ 'నటన' కంటే సంగీతానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానంటోంది కేతకి. రోజుకు నాలుగు గంటల పాటు సంగీత సాధన చేస్తుంది.

'మహేష్ మంజ్రేకర్ సినిమాలో నటించిన తరువాత ఎన్నో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చినా సంగీతానికే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. మంచి సింగర్‌గా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను. క్లాసిక్ నుంచి కాంటెంపరరీ మ్యూజిక్ వరకు నన్ను నేను నిరూపించుకోవాలనుకుంటున్నాను'

గత సంవత్సరం 'మాయి' ఆల్బమ్‌తో మ్యూజిక్ కంపోజర్‌గా కూడా తన ప్రతిభ చాటుకుంది కేతకి. ఈ ఆల్బమ్‌లోని తొమ్మిది పాటలను శంకర్ మహాదేవన్, మహాలక్ష్మీ అయ్యర్‌లాంటి ప్రసిద్ధ గాయకులు పాడారు.

'మన దగ్గర ఉమెన్ మ్యూజిక్ కంపోజర్‌లు తక్కువగా ఉన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. మంచి మ్యూజిక్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారు. చాలామందికి మ్యూజిక్ కంపోజిషన్‌లో అద్భుత ప్రతిభ ఉన్నా ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్ల దూరంగా ఉంటున్నారు' అంటుంది కేతకి.

సినిమా

పైసా మే పరమాత్మ అంటారు. ఒక్క చిన్న మార్పు. ఇప్పుడు 'పైసా మే సినిమా' అనాలి. ఎందుకంటే రిలీజ్ తర్వాత సాధించే పైసా వసూల్ కోసం పైసల చుట్టూ కథలు అల్లి కొన్ని సినిమాలు తీస్తున్నారు. 'పైసా మే సినిమా'... అంటూ పైసల మీద తీస్తున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.

పైసా మే సినిమా



● ధనుష్ 51 పోస్టర్



● వెంకటేశ్, వరుణ్ తేజ్



● వరుణ్ తేజ్ 'మట్కా' పోస్టర్



● దుల్కర్



● వీజే సన్నీ

వినోదం.. సందేశం

వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రాలు 'ఎఫ్ 2', 'ఎఫ్ 3'. భార్యాభర్తల అనుబంధాలతో అల్లుకున్న 'ఎఫ్ 2' అయినా.. వారసత్వం నేపథ్యంతో సాగిన 'ఎఫ్ 3' అయినా.. ఈ రెండు సినిమాల్లో అంతర్లీనంగా ఉన్న ప్రధానాంశం డబ్బుతో కూడుకున్న అవసరాలేనని ప్రేక్షకులకు అనిపిస్తుంది. 'ఎఫ్ 3'లో అయితే జీవితంలో డబ్బు చాలా ముఖ్యమంటూ 'లబ్ డబ్.. లబ్ డబ్.. డబ్బూ..' అనే పాట కూడా ఉంది. ఈ చిత్రం ఎండింగ్‌లో 'ఎఫ్ 4' ఉంటుందన్నట్లుగా పేర్కొన్నారు. వచ్చే ఏడాది 'ఎఫ్ 4' సినిమా ఆరంభం కానుందట. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3'ల మాదిరిగానే 'ఎఫ్ 4' ప్రధాన కథాంశం డబ్బే అయ్యుంటుందని ఊహించవచ్చు.

ఖరీదైన భవనాలు.. నోట్ల కట్టలు

దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించే చిత్రాలు వినోదంతో పాటు సందేశాత్మకంగానూ ఉంటాయి. ఇక శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందనున్న తాజా సినిమాలో ధనుష్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. నాగార్జున ఓ కీలక పాత్రలో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇటీవలే ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో ఒకవైపు అత్యంత ఖరీదైన భవనాలు, మరోవైపు మురికి వాడలు.. మధ్యలో నోట్ల కట్టలు కనిపిస్తుంటాయి. సో.. ఈ సినిమా ప్రధాన కథాంశం డబ్బు నేపథ్యంలో ఉంటుందని, సమాజంలో నెలకొన్న అసమానతల కోణంలో కథనం సాగుతుందని ఊహించవచ్చు. వచ్చే ఏడాది ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం.

జూదం

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా పీరియాడికల్ ఫిల్మ్ 'మట్కా'. ఈ పాన్ ఇండియన్ సినిమాకు 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్, టైటిల్‌ని బట్టి 'మట్కా' కథ అంతా డబ్బు చుట్టే తిరుగుతుందని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా 'మట్కా'ను తెరకెక్కిస్తున్నట్లు, వైజాగ్ నేపథ్యంలో 1958 - 1982 టైమ్ పీరియడ్‌లో ఈ సినిమా కథనం ఉంటుందన్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

సామాన్యుడి కథ

నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా రూపొందనున్న సినిమా 'లక్కీ భాస్కర్'. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించనున్న సినిమా ఇది. 'లక్కీ భాస్కర్' టైటిల్‌ను గమనిస్తే టైటిల్‌లో డాలర్ సింబల్ స్పష్టంగా కనిపిస్తుంది. నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన వ్యక్తి కథ అంటూ చిత్ర యూనిట్ పేర్కొంది. సో..'లక్కీ భాస్కర్' కథలోని ప్రధానాంశం డబ్బే అని తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

డాలర్ కుమార్

'బిగ్ బాస్' షో ఫేమ్ వీజే సన్నీ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సౌండ్ పార్టీ'. ఏ ట్విస్టెడ్ ఫ్యామిలీ స్టోరీ అనేది ఉపశీర్షిక. హ్రితికా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు సంజయ్ శేరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో డాలర్ కుమార్ అనే పాత్రలో నటిస్తున్నారు వీజే సన్నీ. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పోస్టర్స్‌లో డబ్బు కనిపిస్తుండటం 'సౌండ్ పార్టీ' ప్రధాన కథాంశం డబ్బే అని స్పష్టం చేస్తోంది.

డబ్బే ప్రధానాంశంగా సాగే మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

చీకటి యుగంలో...



● మమ్ముట్టి

మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్న కొత్త చిత్రానికి 'భ్రమయుగం' టైటిల్ ఖరారైంది. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, నైట్ షిఫ్ట్ స్టూడియోస్‌ల సమర్పణలో ఎస్. శశికాంత్, చక్రవర్తి రామచంద్ర నిర్మిస్తున్నారు. 'భ్రమ యుగం' సినిమా చిత్రీకరణ గురువారం ప్రారంభమైంది. ''ఇప్పటివరకూ చేయని కొత్త పాత్రను ఈ సినిమాలో చేస్తున్నాను'' అని మమ్ముట్టి అన్నారు. ''కేరళలోని చీకటి యుగాల నేపథ్యంలో సాగే కథ 'భ్రమ యుగం'' అన్నారు రాహుల్ సదాశివన్. ''హారర్, థ్రిల్లర్ జానర్ చిత్రాలను నిర్మించడానికే మా నిర్మాణ సంస్థను స్టార్ట్ చేశాం. తొలి చిత్రాన్నే మమ్ముట్టీగారితో చేస్తుండడాన్ని గౌరవంగా భావిస్తున్నాం. మమ్ముట్టీ గారి ఇమేజ్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకుని వెళ్తుంది. దర్శకుడు రాహుల్ సృష్టించిన అద్భుత ప్రపంచం 'భ్రమ యుగం'' అన్నారు నిర్మాతలు. మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.



● రవితేజ

తప్పించుకున్నాడు!

'నేటి ముఖ్యాంశాలు.. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ.. ఇంకా అనేక నగరాల్లో అతి దారుణంగా దోపిడీలు చేసిన స్టువర్టుపురం దొంగ మద్రాస్ సెంట్రల్ జైలు నుంచి తప్పించుకున్నాడు' అంటూ మొదలైంది 'టైగర్ నాగేశ్వరరావు' సినిమా గ్లింప్స్ వీడియో. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 20న విడుదల కానుంది. స్టువర్టుపురం దొంగగా పేరు గాంచిన టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. గురువారం 'టైగర్ నాగేశ్వరరావు' గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. రేణు దేశాయ్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: ఆర్ మది, సహనిర్మాత: మయాంక్ సింఘానియా.

నా స్క్రీన్ టైమ్ తక్కువే కానీ..

- ఐశ్వర్యా లక్ష్మి



''దర్శకుడు అభిలాష్ జోషి 'కింగ్ ఆఫ్ కోత' సినిమా స్కేల్ గురించి చెప్పినప్పుడు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ప్రొడక్షన్ పరంగా చాలా పెద్ద సినిమా. ప్రతి షాట్ చాలా నిండుగా అచ్చమైన తెలుగు సినిమాలా ఉంటుంది. మలయాళంలో ఇంత పెద్ద స్కేల్ సినిమాలో భాగం కావడం నాకు ఇదే తొలిసారి'' అని హీరోయిన్ ఐశ్వర్యా లక్ష్మి అన్నారు. దుల్కర్ సల్మాన్, ఐశ్వర్యా లక్ష్మి జంటగా అభిలాష్ జోషి దర్శకత్వం వహించిన చిత్రం 'కింగ్ ఆఫ్ కోత'. జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఐశ్వర్యా లక్ష్మి మాట్లాడుతూ– ''కింగ్ ఆఫ్ కోత'లో తార పాత్ర చేశాను. దుల్కర్ పేరు రాజు. తార, రాజు మధ్య అందమైన లవ్ స్టోరీ ఉంటుంది. నా పాత్రకి స్క్రీన్ టైమ్ తక్కువగానే ఉన్నప్పటికీ కథలో చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రంలో భావోద్వేగ సన్నివేశాలు చేసినప్పుడు సవాల్‌గా అనిపించింది. నాకంటూ డ్రీమ్ రోల్స్ ప్రత్యేకంగా లేవు. కానీ, నేను చేసిన పాత్రలు గుర్తుండిపోవాలని కోరుకుంటాను. ప్రస్తుతం తమిళంలో ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

ఆ ఇద్దరూ కలియుగంలోకి వస్తే?



● అన్వేష్, కుశాలిని, వేణు, నవీన్

నవీన్ బేతిగంటి, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో శ్రీమాన్ కీర్తి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాక్షస కావ్యం'. దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. ఈ సినిమా టీజర్‌ని 'బలగం' దర్శకుడు వేణు యెల్దండి, హీరో తిరువీర్ విడుదల చేసి, సినిమా మంచి హిట్టవ్వాలన్నారు. శ్రీమాన్ కీర్తి మాట్లాడుతూ– ''పురాణాల్లోని జయ విజయులు ఒక్కో యుగంలో ఒక్కో రాక్షసుల్లా పుట్టారు. వాళ్లు ఇప్పుడు కలియుగంలోకి వస్తే ఎలా ఉంటుంది? అనే కాల్పనిక కథతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''మా చిత్రంలో మంచి భావోద్వేగాలున్నాయి'' అన్నారు దాము రెడ్డి. ''టీజర్ ఎంత బాగుందో సినిమా అంతకంటే బాగుంటుంది'' అన్నారు నవీన్ బేతిగంటి.. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ చిక్కు, సహనిర్మాతలు: నవీన్ రెడ్డి, వసుంధరా దేవి.

నాలాంటివాళ్లు కొత్త కథలే చేయాలి

- సోహైల్



''మిస్టర్ ప్రెగ్నెంట్' ప్రీమియర్ షో చూశాక చాలా మంది మహిళలు అమ్మ పడే ఇబ్బందులు బాగా చూపించారని కన్నీళ్లు పెట్టుకుని చెప్పారు. దీంతో మా ప్రయత్నం విజయవంతం అయిందనిపించింది'' అన్నారు సయ్యద్ సోహైల్ రియాన్. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో సయ్యద్ సోహైల్, రూపా కొడవయూర్ జంటగా రూపొందిన చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా సోహైల్ విలేకరులతో మాట్లాడుతూ– ''స్టార్ హీరోలకు ఫ్యాన్స్ ఉంటారు. కమర్షియల్ సినిమాలు చేసినా వర్కవుట్ అవుతుంది. కానీ, నాలాంటి వాళ్లు కొత్త ప్రయత్నాలు చేస్తేనే ప్రేక్షకులు సినిమాలకు వస్తారని నమ్మాను. అందుకే 'బిగ్ బాస్' నుంచి రాగానే 'మిస్టర్ ప్రెగ్నెంట్' వంటి కొత్త జానర్ మూవీ చేశాను. మేల్ ప్రెగ్నెన్సీ నిజంగా సాధ్యమైతే కనీసం 20 శాతం మంది మేల్స్ ప్రెగ్నెన్సీ తీసుకోవడం కోసం రెడీగా ఉన్నారు'' అన్నారు.

రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటాను

- సంతోష్ శోభన్



''వందేళ్ల ఇండియన్ సినిమాల్లో ఎన్నో పాత్రలు, ఎన్నో సినిమాలు వచ్చాయి. అయితే ఇప్పటివరకూ చెప్పని కథ, ఎవరూ చేయని పాత్రను ఎలివేట్ చేయటం అనేది ఓ ఆర్టిస్ట్‌కి కొత్తగా ఉంటుంది. అలా పెళ్లి మండపంపై మిగిలిపోయేవాడి కథే 'ప్రేమ్ కుమార్'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. సంతోష్ శోభన్, రాశీ సింగ్, రుచితా సాధినేని హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమ్ కుమార్'. అభిషేక్ మహర్షి దర్శకత్వంలో శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ–''అభిషేక్ కొన్ని సినిమాల్లో నటుడిగా చేశాడు. దర్శకుడు కావాలనుకున్నప్పుడు 'ప్రేమ్ కుమార్' కథ రాసుకుని, చక్కగా తీశాడు. వరుసగా వరుడు, పెళ్లి వంటి సినిమాలు చేస్తున్నాను. అయితే నిజ జీవితంలో నేను రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటాను (నవ్వుతూ). నేనిప్పటి వరకు మంచి డైరెక్టర్స్‌తో సినిమాలు చేశాను. అయితే నేను చేసిన సినిమాలన్నీ కరెక్ట్‌గానే ఎంచుకున్నానా? అంటే లేదనే అంటాను. 'ప్రేమ్ కుమార్' నాకు సరైన హిట్ ఇస్తుందనుకుంటున్నాను'' అన్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
18-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
388	100
65,151	19,365

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	13,429	▽	41
డోజోన్స్	34,684	▽	81
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,310	▽	47
డాక్స్	15,677	▽	113
షాంఘై	3,164	△	14
నికాయ్	31,626	△	141

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

సిమ్ కార్డ్ డీలర్ల ధ్రువీకరణ తప్పనిసరి

- మోసాల నివారణకే బల్క్ కనెక్షన్ల నిలిపివేత: కేంద్ర మంత్రి వైష్ణవ్

న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలను కట్టడి చేసేందుకే సిమ్ కార్డు డీలర్లకు ధ్రువీకరణను తప్పనిసరి చేసినట్లు, బల్క్ కనెక్షన్లు ఇచ్చే నిబంధనలను తొలగించినట్లు కేంద్ర ఐటీ, టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. డీలరును నియమించుకునే ముందు ప్రతి వ్యాపార సంస్థ యజమాని, వారి వ్యాపార సంబంధ పత్రాలను 'లైసెన్సీ' లేదా టెలికం ఆపరేటర్లు ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే డీలర్లకు రూ. 10 లక్షల జరిమానా ఉంటుందన్నారు. ప్రస్తుతం 10 లక్షల పైచిలుకు సిమ్



డీలర్లు ఉన్నారని, వారి ధ్రువీకరణ కోసం తగినంత సమయం ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బల్క్ కనెక్షన్లను ఇచ్చే నిబంధనను టెలికం శాఖ తొలగించిందని, దానికి బదులుగా కొత్తగా బిజినెస్ కనెక్షన్ కాన్సెప్టును ప్రవేశపెడుతోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది మే నుంచి ప్రభుత్వం 52 లక్షల మొబైల్ కనెక్షన్లను నిలిపివేసినట్లు, 67,000 మంది పైగా డీలర్లను బ్లాక్‌లిస్టులో ఉంచినట్లు వివరించారు. సిమ్ కార్డు డీలర్లపై 300 పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు మంత్రి చెప్పారు.

జీవిత బీమా మెచ్యూరిటీపై పన్ను!

నిబంధనలను నోటిఫై చేసిన సీబీడీటీ

న్యూఢిల్లీ: జీవిత బీమా పాలసీల వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకు మించి ఉంటే, వాటి మెచ్యూరిటీ తర్వాత అందుకునే మొత్తంపై పన్నును ఏ విధంగా లెక్కించాలన్నది ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి సవరించిన నిబంధనలను నోటిఫై చేసింది. ఏడాదికి చెల్లించే ప్రీమియం రూ.5 లక్షలకు మించితే పాలసీ గడువు తర్వాత అందుకునే మొత్తాన్ని వార్షిక ఆదాయానికి కలిపి చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.



2023 ఏప్రిల్ 1 తర్వాత నుంచి రూ.5 లక్షలకు మించి ప్రీమియం ఉండే పాలసీల మెచ్యూరిటీపై పన్ను అమల్లోకి వచ్చిన విషయం గమనార్హం. అంతకుముందు వరకు పాలసీల ప్రీమియం ఎంతన్న దానితో సంబంధం లేకుండా మెచ్యూరిటీ మొత్తంపై సెక్షన్ 10(10డీ) కింద పన్ను మినహాయింపు అమల్లో ఉంది.

పియాజియో 'బీబర్' వెస్పా @ 6.45 లక్షలు

ముంబై: వెస్పా స్కూటర్ల తయారీ సంస్థ పియాజియో వెహికల్స్ తాజాగా జస్టిన్ బీబర్ ఎక్స్ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. ఈ స్కూటర్ ధర రూ. 6.45 లక్షల నుంచి (ఎక్స్ షోరూమ్). కెనడాకు చెందిన పాప్ స్టార్ జస్టిన్ బీబర్ పేరిట ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఈ లిమిటెడ్ ఎడిషన్ మోడల్స్‌ను (పది లోపే) ప్రీ-ఆర్డర్ చేయాల్సి ఉంటుంది. ఇవి పూర్తిగా అసెంబుల్ చేసిన యూనిట్‌గా దిగుమతి అవుతాయి. 150 సీసీ ఇంజిన్‌తో ఈ లిమిటెడ్ ఎడిషన్ ఉంటుందని పియాజియో వెహికల్స్ సీఎండీ డీగో గ్రాఫీ తెలిపారు.



అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాల కోసం ఆర్‌బీఐ పోర్టల్

ముంబై: అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను అన్వేషించేందుకు, క్లెయిమ్ చేసుకునేందుకు తోడ్పడేలా కేంద్రీకృత వెబ్ పోర్టల్ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ – గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్)ను గురువారం రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రారంభించారు. వివిధ బ్యాంకుల్లో క్లెయిమ్ చేయకుండా ఉండిపోయిన తమ డిపాజిట్లన్నింటి గురించిన వివరాలను కస్టమర్లు ఒకే చోట తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (రెబిట్), ఇండియన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సర్వీసెస్ (ఐఎఫ్‌టీఏఎస్), భాగస్వామ్య బ్యాంకులు కలిసి దీన్ని రూపొందించాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,



ధన్‌లక్ష్మి బ్యాంక్, సౌతిండియా బ్యాంక్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా, సిటీబ్యాంక్ వంటి ఏడు బ్యాంకుల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు ఈ పోర్టల్‌లో ఉన్నాయి. ఇతర బ్యాంకుల వివరాలను కూడా అక్టోబర్ 15 నాటికి దశలవారీగా అందుబాటులోకి తేనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి దాదాపు రూ. 35,000 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆర్‌బీఐకి బదలాయించాయి. సిసలైన యజమానులు, లబ్ధిదారులకు ఆయా డిపాజిట్లను అందించాలనే ఉద్దేశంతో ఆర్‌బీఐ పలు చర్యలు తీసుకుంటోంది.

గోద్రెజ్ నుంచి మ్యాట్రిక్స్ లాకర్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గోద్రెజ్ సెక్యూరిటీ సొల్యూషన్స్ తాజాగా మూడు ఉత్పత్తులను ఆవిష్కరించింది. భద్రతాపరంగా మరిన్ని



ఫీచర్లు పొందుపర్చిన మ్యాట్రిక్స్ లాకర్లతో పాటు బంగారం, వెండి స్వచ్ఛతను తెలియజేసే యాక్యుగోల్డ్, స్మార్ట్‌ఫాగ్ సెక్యూరిటీ సిస్టమ్ వీటిలో ఉన్నాయి. లాకర్ల ధర రూ. 80,000 నుంచి రూ. 1.5 లక్షల వరకూ, స్మార్ట్‌ఫాగ్ వ్యవస్థ సుమారు రూ. 1.5 లక్ష స్థాయిలో ఉంటుంది. ఎవరైనా బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నిస్తే అలారం మోగడంతో పాటు యజమానికి తక్షణం సమాచారం వెళ్లేలా మ్యాట్రిక్స్ లాకర్‌ను తీర్చిదిద్దారు. ఇక పొగను విడుదల చేసి, చోరీ యత్నాలను అడ్డుకునేందుకు స్మార్ట్‌ఫాగ్ సిస్టమ్ ఉపయోగపడుతుందని గురువారమిక్కడ ఉత్పత్తుల ఆవిష్కరణ సందర్భంగా సంస్థ బిజినెస్ హెడ్ పుష్కర్ గోఖలే తెలిపారు. మరోవైపు, గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 850 కోట్లుగా ఉండగా.. ఈసారి రూ. 1,000 కోట్లు అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. తమ ఆదాయంలో దాదాపు 10–12 శాతం వాటా తెలంగాణ మార్కెట్‌ది ఉంటుందని తెలిపారు.

హైదరాబాద్‌లో అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ

- హానర్ హోమ్స్ 'హానర్ సిగ్నాటిస్'
- మొత్తం 3,266 అపార్ట్‌మెంట్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బాలు చౌదరి, రాజమౌళి, వెంకటేశ్వర్లు, స్వప్న కుమార్ (ఎడమ నుంచి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్టీ రంగ సంస్థ హానర్ ప్రైమ్ హౌజింగ్ హైదరాబాద్‌లో అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును ఆవిష్కరించింది. హానర్ సిగ్నాటిస్ పేరుతో హైటెక్‌సిటీ–కూకట్‌పల్లి మార్గంలో ఐడీఎల్ రోడ్డులో రూ.3,000 కోట్లతో ఈ భారీ నిర్మాణానికి సంస్థ శ్రీకారం చుట్టింది. 27.5 ఎకరాల్లో ఒక్కొక్కటి 25 అంతస్తుల్లో 18 టవర్లు రానున్నాయి. మొత్తం 3,266 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తారు. హానర్ సిగ్నాటిస్ ఇప్పటికే సుమారు 1,300 బుకింగ్స్ నమోదు చేసింది. రెరాకు సమర్పించిన ప్రణాళిక ప్రకారం 9 టవర్లతో కూడిన తొలి దశ ప్రాజెక్టు 2026 డిసెంబరుకల్లా పూర్తి కావాల్సి ఉంది. గడువు కంటే ముందుగా తొలి దశ పూర్తి చేస్తామని ప్రమోటర్–డైరెక్టర్ బాలు చౌదరి వెల్లడించారు. ప్రమోటర్–డైరెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, స్వప్న కుమార్, రాజమౌళితో కలిసి ప్రాజెక్టు విశేషాలను గురువారమిక్కడ మీడియాకు వెల్లడించారు.

ధర రూ.3 కోట్ల వరకు..

ఒక్కో అపార్ట్‌మెంట్ 1,695–3,815 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3, 3.5, 4 బీహెచ్‌కే ఆఫర్ చేస్తారు. ధర రూ.1.25 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంది. 4 బీహెచ్‌కే అల్ట్రా ప్రీమియం అపార్ట్‌మెంట్స్ కోసం ప్రత్యేకంగా నాలుగు టవర్లు ఏర్పాటు చేస్తారు. 1.31 లక్షల చ.అ.విస్తీర్ణంలో రెండు క్లబ్ హౌజులు ఉంటాయి. వీటిలో 20,000 చ.అ.విస్తీర్ణంలో జిమ్ నెలకొల్పుతారు. రెండు స్విమ్మింగ్ పూల్స్, సూపర్ మార్కెట్, క్లినిక్, అలాగే లాకర్ సౌకర్యంతో బ్యాంక్ వంటివి రానున్నాయి. ఈవీ చార్జింగ్ స్టేషన్, 5 ఎకరాల పార్క్ అదనపు ఆకర్షణ. స్కూల్ బస్‌లు వచ్చేందుకు వీలుగా ప్రత్యేకంగా రోడ్డు నిర్మిస్తారు. ఐజీబీసీ నుంచి ఈ ప్రాజెక్టు ప్రీ–సర్టిఫైడ్ గోల్డ్ ధ్రువీకరణ అందుకుంది.

మరో కోటి చ.అ. విస్తీర్ణంలో..

హానర్ ప్రైమ్ హౌజింగ్ హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు ప్రాజెక్టులను 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పూర్తి చేసింది. మూడవ ప్రాజెక్టు హానర్ రిచ్‌మాంట్‌లో భాగంగా 28.4 ఎకరాల్లో 12 లక్షల చ.అ. విస్తీర్ణంలో విల్లాలు నిర్మాణంలో ఉన్నాయి. నాల్గవ ప్రాజెక్టు అయిన హానర్ సిగ్నాటిస్ 78 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటవుతోంది. రానున్న రోజుల్లో మరో ఒక కోటి చ.అ.విస్తీర్ణం జోడించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. నాణ్యత, అత్యాధునిక సౌకర్యాలతో హైదరాబాద్ రియల్టీ రంగంలో టాప్–10లో నిలవాలన్న లక్ష్యంతో ఈ రంగంలోకి అడుగు పెట్టినట్టు సంస్థ తెలిపింది.

నిఫ్టీకి 100 పాయింట్ల నష్టం

- ప్రపంచ ప్రతికూల సంకేతాల ప్రభావం
- బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు



ముంబై: చైనా ఆర్థిక మందగమన ఆందోళనలు, అమెరికా వడ్డీరేట్ల పెంపు భయాలతో ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా అధిక వెయిటేజీ రిలయన్స్, ఎల్‌అండ్‌టీతో పాటు బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో దేశీయ మార్కెట్ రెండు రోజుల ర్యాలీకి గురువారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 35 పాయింట్ల స్వల్ప నష్టంతో 65,504 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 493 పాయింట్లు పతనమై 65,046 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఆఖర్లో స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో 388 పాయింట్లు క్షీణించి 65,151 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 19,326 – 19,462 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 100 పాయింట్లు నష్టపోయి 19,365 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లోనూ ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగాల షేర్లు రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,511 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.314 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5% పైగా నష్టపోయాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- జీక్యూజీ 8.1% వాటా కొనుగోలుతో అదానీ పవర్ షేరు రాణించింది. బీఎస్‌ఈలో 3% పెరిగి రూ.287 వద్ద స్థిరపడింది. అలాగే ప్రమోటార్ 1.27% వాటా విక్రయంతో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ షేరు 4% నష్టపోయి రూ.352 వద్ద స్థిరపడింది.
- ఐఆర్‌ఎఫ్‌సీ షేరు 7% నష్టపోయి రూ.48 వద్ద స్థిరపడింది. కేంద్రం ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) పద్ధతిలో 11% వాటా విక్రయించే ప్రయత్నాలు చేస్తుందనే వార్తలు ఇందుకు కారణం.
- ఎఫ్ఎంసీజీ షేర్ల పతనంలో భాగంగా ఐటీసీ షేరు 2% నష్టపోయి రెండు నెలల కనిష్టం రూ.441 వద్ద ముగిసింది. సెన్సెక్, నిఫ్టీ సూచీలో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.
- భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు గ్లోబల్ ఫుట్‌వేర్ బ్రాండ్ అడిడాస్... బాటా ఇండియాతో వ్యూహాత్మక భాగసామ్య ఒప్పంద చర్చలు జరుపుతుందనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఫలితంగా బాటా ఇండియా షేరు 5% ఎగసి రూ.1734 వద్ద స్థిరపడింది.
- నిఫ్టీ నెక్ట్స్ 50 సూచీ నుంచి ఏసీసీ, నైకా, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, ఇండస్ టవర్స్, పేజ్ ఇండస్ట్రీస్ కంపెనీల షేర్లు వైదొలిగాయి. వీటి స్థానంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, ట్రెంట్, టీవీఎస్ మోటార్స్, జైడస్ లైఫ్ సైన్సెస్ సంస్థల షేర్లు చోటు దక్కించుకున్నాయి. ఈ మార్పులు సెప్టెంబర్ 29 నుంచి అమల్లోకి రానున్నాయి.

కొత్త సర్వీస్ ప్రొవైడర్‌పై జీఎస్‌టీఎన్ కసరత్తు

- కన్సల్టెన్సీ ఎంపిక కోసం బిడ్లకు ఆహ్వానం
- తుది గడువు సెప్టెంబర్ 5

న్యూఢిల్లీ: సాంకేతిక సహకారం అందించేందుకు ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు ఇచ్చిన కాంట్రాక్టు 2024 సెప్టెంబర్‌తో ముగియనున్న నేపథ్యంలో కొత్త సర్వీస్ ప్రొవైడర్ ఎంపికపై వస్తు, సేవల పన్నుల నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) దృష్టి సారించింది. ఇందుకు సంబంధించిన బిడ్డింగ్ డాక్యుమెంట్లను తయారు చేసే కన్సల్టెన్సీ కోసం అన్వేషణ ప్రారంభించింది. బిడ్డింగ్ ప్రక్రియ, జీఎస్‌టీఎన్ ఐటీ వ్యవస్థను మరో సర్వీస్ ప్రొవైడర్‌కు బదలాయించడం తదితర పనులను సదరు కన్సల్టెన్సీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే ప్రస్తుత వ్యవస్థను మదింపు చేసి తదుపరి కాంట్రాక్టు వ్యవధిలో దాన్ని మరింత మెరుగుపర్చేందుకు తగు మార్గదర్శకాలు రూపొందించాలి. దేశీయంగా ప్రత్యక్ష లేదా పరోక్ష పన్నులు లేక ఇతరత్రా ఆర్థిక సంస్థకు ఐటీ కన్సల్టింగ్ సర్వీసులు అందించడం ద్వారా



గత మూడేళ్లలో సగటున రూ. 30 కోట్ల వార్షిక టర్నోవరు ఉన్న కన్సల్టెన్సీలు ఇందుకు పోటీపడొచ్చని జీఎస్‌టీఎన్ తెలిపింది. బిడ్ల దాఖలుకు ఆఖరు తేదీ సెప్టెంబర్ 5. కొత్త కాంట్రాక్టు 2024 అక్టోబర్ 1 నుంచి ఏడేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చింది. దానికి అవసరమైన సాంకేతిక సేవలు అందించేందుకు 2015లో రూ. 1,320 కోట్ల కాంట్రాక్టును ఇన్ఫోసిస్ దక్కించుకుంది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రిజిస్ట్రేషన్, రిటర్నుల ఫైలింగ్, ఆడిట్ మొదలైన వాటికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఇన్ఫోసిస్ అందిస్తోంది.

సాక్షి స్పోర్ట్స్



కాంస్య పతకంతో భారత్ బోణీ

ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజే భారత్ పతకాల బోణీ కొట్టింది. అజర్‌బైజాన్ రాజధాని బకూలో గురువారం మొదలైన ఈ మెగా ఈవెంట్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో భారత జట్టుకు కాంస్య పతకం లభించింది. శివా నర్వాల్ (579), సరబ్‌జోత్ సింగ్ (578), అర్జున్ సింగ్ (577)లతో కూడిన భారత జట్టు 1,734 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత క్వాలిఫయింగ్ పోటీల్లో ఆయా దేశాల షూటర్లు సాధించిన పాయింట్ల సగటు ఆధారంగా టీమ్ ఈవెంట్ పతకాలను ఖరారు చేస్తారు. భారత పిస్టల్ షూటర్లెవరూ టాప్–8లో నిలవకపోవడంతో వ్యక్తిగత విభాగం ఫైనల్‌కు అర్హత పొందలేకపోయారు. మరోవైపు హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్, పలక్, దివ్యలతో కూడిన భారత మహిళల పిస్టల్ జట్టు 1,708 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది.

అర్జున్ పరాజయం సెమీస్‌లో ప్రజ్ఞానంద



ప్రజ్ఞానంద

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రజ్ఞానంద 5–4తో గెలుపొందాడు. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ టోర్నీ చరిత్రలో సెమీఫైనల్ దశకు చేరిన తొలి భారత ప్లేయర్‌గా ప్రజ్ఞానంద గుర్తింపు పొందాడు. తెలంగాణకు చెందిన 19 ఏళ్ల అర్జున్ కడదాకా పోరాడినా చివరకు తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల ప్రజ్ఞానంద ఎత్తులకు చేతులెత్తేశాడు. బుధవారం ఇద్దరి మధ్య రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత స్కోరు 1–1తో సమంగా నిలువడంతో... విజేతను నిర్ణయించేందుకు గురువారం ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. ముందుగా 25 నిమిషాల నిడివి గల రెండు గేమ్‌లు ఆడించారు. ఈ రెండూ 'డ్రా' కావడంతో ఇద్దరూ 2–2తో సమంగా నిలిచారు.



అర్జున్

అనంతరం 10 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లను ఆడించారు. తొలి గేమ్‌లో ప్రజ్ఞానంద 76 ఎత్తుల్లో గెలుపొందగా... రెండో గేమ్‌లో అర్జున్ 28 ఎత్తుల్లో నెగ్గాడు. దాంతో స్కోరు 3–3తో సమంగా నిలిచింది. ఈ దశలో 5 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు ఆడించారు. ఇందులో తొలి గేమ్‌లో ప్రజ్ఞానంద 31 ఎత్తుల్లో నెగ్గగా... రెండో గేమ్‌లో అర్జున్ 36 ఎత్తుల్లో గెలుపొందడంతో స్కోరు 4–4తో సమంగా నిలిచింది. దాంతో 'సడన్ డెత్' టైబ్రేక్ మొదలైంది. 'సడన్ డెత్'లో తొలుత నెగ్గిన ప్లేయర్‌ను విజేతగా ప్రకటిస్తారు. 'సడన్‌డెత్' తొలి గేమ్‌లోనే ప్రజ్ఞానంద 72 ఎత్తుల్లో అర్జున్‌ను ఓడించి విజేతగా అవతరించాడు. శనివారం జరిగే సెమీఫైనల్స్ తొలి గేముల్లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)... కరువానా (అమెరికా)తో ప్రజ్ఞానంద తలపడతారు.



బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, తుషార్ ప్రభాకర్



సిమ్రన్‌జీత్ కౌర్, అంకిత, భజన్ కౌర్

భారత్ గురికి రెండు కాంస్యాలు

- రికర్వ్ విభాగంలో రాణించిన భారత ఆర్చరీ జట్లు
- ధీరజ్ బృందానికి మూడో స్థానం

పారిస్: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–4 టోర్నీలో రెండో రోజూ భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. తొలి రోజు బుధవారం కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్ చేరి కనీసం రెండు రజతాలు ఖరారు చేసుకోగా... గురువారం రికర్వ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు బొమ్మదేవర ధీరజ్‌తో పాటు అతాను దాస్, తుషార్ ప్రభాకర్ షెల్కేలతో కూడిన భారత పురుషుల జట్టు కాంస్య పతక మ్యాచ్‌లో 6–2తో (54–56, 57–55, 56–54, 57–55) స్పెయిన్ జట్టుపై గెలుపొందింది. సెమీఫైనల్లో భారత్ 0–6తో (54–56, 47–58, 55–56) చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయి కాంస్య పతకం కోసం పోటీపడింది. రికర్వ్ ఈవెంట్‌లో మ్యాచ్‌లను 'బెస్ట్ ఆఫ్ ఫోర్ సెట్స్' పద్ధతిలో మ్యాచ్‌ను నిర్వహిస్తారు. సెట్ గెలిచిన జట్టుకు రెండు పాయింట్లు లభిస్తాయి. స్కోరు సమంగా నిలిస్తే రెండు జట్లకు ఒక్కో పాయింట్ వస్తుంది. నాలుగు సెట్‌ల తర్వాత స్కోరు సమమైతే 'షూట్ ఆఫ్' ద్వారా విజేతను నిర్ణయిస్తారు.

మహిళల టీమ్ రికర్వ్ కాంస్య పతక మ్యాచ్‌లో అంకిత, భజన్ కౌర్, సిమ్రన్‌జీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 'షూట్ ఆఫ్'లో 5–4తో (52–55, 52–53, 55–52, 54–52, 27–25) మెక్సికో జట్టును ఓడించింది. నాలుగు సెట్‌ల తర్వాత రెండు జట్లు 4–4తో సమంగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్' నిర్వహించగా... భారత బృందం 27 పాయింట్లు స్కోరు చేయగా... మెక్సికో జట్టు 25 పాయింట్లు చేసి ఓడిపోయింది. అంతకుముందు సెమీఫైనల్లో భారత్ 0–6తో (52–57, 47–56, 52–53) చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయి కాంస్య పతకం కోసం ఆడింది.

సెమీఫైనల్లో జ్యోతి సురేఖ

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పతకం రేసులో నిలిచింది.



సురేఖ తొలి రౌండ్‌లో 145–131తో పూన్ చియు యి (హాంకాంగ్)పై, రెండో రౌండ్‌లో 148–145తో చెన్ లి జు (చైనీస్ తైపీ)పై, మూడో రౌండ్‌లో 148–145తో హువాంగ్ జు (చైనీస్ తైపీ)పై, క్వార్టర్ ఫైనల్లో 147–144తో డాఫ్నీ క్వింటెరో (మెక్సికో)పై నెగ్గింది. శనివారం జరిగే సెమీఫైనల్లో ఎల్లా గిబ్సన్ (బ్రిటన్)తో సురేఖ ఆడుతుంది. ప్రపంచ చాంపియన్, భారత ప్లేయర్ అదితి క్వార్టర్ ఫైనల్లో 135–148తో ఎల్లా గిబ్సన్ చేతిలో ఓడింది.

శుభారంభం లక్ష్యంగా...



- నేడు ఐర్లాండ్‌తో భారత్ తొలి టి20
- ఫామ్‌లో తిలక్‌వర్మ
- కెప్టెన్‌గా బుమ్రా బరిలోకి
- రాత్రి గం.7:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

డబ్లిన్: రాబోయే కాలానికి కాబోయే స్టార్లతో ఉన్న టీమిండియా మరో టి20 క్రికెట్ సమరానికి సిద్ధమైంది. ఐర్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో నిరూపించుకునేందుకు కుర్రాళ్లు సై అంటున్నారు. ఇందులో భాగంగా నేడు తొలి పోరు జరుగనుంది. 11 నెలలుగా బరిలోకే దిగని బుమ్రా టీమిండియాకు నాయకత్వం వహించనుండటం మరో విశేషం. అయితే స్టార్ల కొరతే సిరీస్‌కు వెలితి! ఇటీవల వెస్టిండీస్‌తో ఆడిన జట్టులో తాత్కాలిక కెప్టెన్ హార్దిక్ పాండ్యా అయినా ఉన్నాడు. ఈ సిరీస్‌కు తను కూడా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలాగే విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంతమాత్రాన ఈ క్రికెట్ 'షో'కు సోకులేం తక్కువగా లేవు. ఎందుకంటే రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, జితేశ్ శర్మ తదితరులంతా ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన వారే! కలగలిపిన ప్రపంచ శ్రేణి బౌలర్లను ఎదుర్కొన్నవారే! ఇప్పుడు మాత్రం ఒక్క ఐర్లాండ్ బౌలర్లతో 'ఢీ' కొట్టేందుకు రెడీ అయ్యారు.

అందరి కళ్లు బుమ్రా, తిలక్‌లపైనే...

వెన్ను గాయం, శస్త్ర చికిత్స, పునరావస శిబిరం ఇలా చాన్నాళ్ల తర్వాత 29 ఏళ్ల బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ బరిలోకి దిగుతున్నాడు. ఇదేమో టి20 సిరీస్... భారత్‌లో జరగబోయేది వన్డే వరల్డ్‌కప్... ఎలా చూసుకున్నా పరిమిత ఓవర్లలో బుమ్రా పవర్‌ఫుల్ బౌలర్. ఒకేసారి 10 ఓవర్ల కోటా ఉండే వన్డేల్లో కాకుండా 4 ఓవర్లతో సరిపెట్టుకునే టి20 మ్యాచ్‌లతో ఆడించడం ద్వారా అతనిపై పని ఒత్తిడి లేకుండా బోర్డు జాగ్రత్త పడింది. మరోవైపు అవకాశం వచ్చిన ఐపీఎల్‌లో, బరిలోకి దించిన కరీబియన్ సిరీస్‌లో చెలరేగిన హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మపై కూడా సెలక్టర్ల దృష్టి పడింది. ఈ సిరీస్‌లో వీరిద్దరిపైనే అందరి కళ్లుంటాయనేది వాస్తవం. ఇక ప్రత్యర్థి ఐర్లాండ్ విషయానికొస్తే బల్బిర్నీ సారథ్యంలో జట్టు నిలకడగా రాణిస్తోంది. కుర్రాళ్లున్నా... ఇంకెవరున్నా... టీమిండియాపై గెలుపు వారికి గొప్పదే అవుతుంది. అందుకే సిరీస్సే లక్ష్యంగా ఐర్లాండ్ దిగుతోంది.

టికెట్లు హాట్‌కేకుల్లా...

మైదానంలో భారత జట్టు దిగితే ఏ జట్టుకైనా కాసుల రాశులు కురుస్తాయనే దానికి భారత్, ఐర్లాండ్ టి20 సిరీస్ మరో ఉదాహరణ. టీమిండియా వైపు నుంచి చూస్తే ప్రత్యర్థి పెద్దగా పోటీ జట్టు కాదు. 'హిట్‌మ్యాన్' రోహిత్, బ్యాటింగ్ 'కింగ్' కోహ్లి... అంతెందుకు తాజా తాత్కాలిక కెప్టెన్ హార్దిక్ పాండ్యా కూడా లేడు. అంటే భారత స్టార్లెవరూ బరిలో లేకపోయినా... మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో తొలి రెండు టి20లకు టికెట్లన్నీ అమ్ముడయ్యాయని స్వయంగా ఐర్లాండ్ బోర్డే వెల్లడించింది. 11,500 సీట్ల సామర్థ్యమున్న స్టేడియం 'హౌస్‌ఫుల్' అయ్యింది. అయితే శుక్రవారం డబ్లిన్‌లో భారీ వర్ష సూచన ఉండటంతో మ్యాచ్ సజావుగా సాగుతుందో లేదో వేచి చూడాలి.

గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్ గెలుపు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టును ఓడించగా... గోదావరి టైటాన్స్ 56 పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్ జట్టుపై గెలుపొందింది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ 20 ఓవర్లలో 191 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (53 బంతుల్లో 80; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), యారా సందీప్ (38 బంతుల్లో 63; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం వైజాగ్ వారియర్స్ 17.4 ఓవర్లలోనే 135 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఇస్మాయిల్ మూడు వికెట్లు తీశాడు. రాయలసీమ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదట ఉత్తరాంధ్ర లయన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. శ్రీరామ్ వెంకట



రాహుల్

రాహుల్ (31 బంతుల్లో 60; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం రాయలసీమ కింగ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసి గెలిచింది. తన్నీరు వంశీకృష్ణ (34 బంతుల్లో 53; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), గిరినాథ్ రెడ్డి (19 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షేక్ కమరుద్దీన్ (18 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాయలసీమ కింగ్స్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

'పసిడి' ప్రియ

అమ్మాన్ సిటీ (జోర్డాన్): ప్రపంచ అండర్–20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల 76 కేజీల విభాగంలో భారత రెజ్లర్ ప్రియా మలిక్ స్వర్ణ పతకం సాధించింది. గురువారం జరిగిన ఫైనల్లో ప్రియ 5–0తో లౌరా సెలిన్ క్యుహెన్ (జర్మనీ)పై గెలిచింది.



భారత్‌కే చెందిన డిఫెండింగ్ చాంపియన్ అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), సవిత (62 కేజీలు), అంతిమ్ కుండు (65 కేజీలు) కూడా ఫైనల్‌కు చేరడంతో భారత్ ఖాతాలో మరో మూడు స్వర్ణ పతకాలు చేరే అవకాశముంది.

శివానికి రెండు స్వర్ణాలు

భువనేశ్వర్: జాతీయ సబ్ జూనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి కర్రా శివాని రెండు బంగారు పతకాలు గెలిచింది. గురువారం జరిగిన గ్రూప్–3 బాలికల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్లో శివాని 1ని:11.83 సెకన్లలో... 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఫైనల్లో శివాని 2ని:43.23 సెకన్లలో అందరికంటే ముందుగా గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాగిత లాస్యశ్రీ కాంస్య పతకాన్ని సాధించింది.







సూచిక.. తికమక

సంగారెడ్డి–నాందేడ్–అకోలా (ఎస్ఎన్ఏ) 161వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బోర్డులు, కిలోమీటరు రాళ్లపై వివరాలు తప్పుల తడక కావడంతో వాహనచోదకులు గందరగోళానికి గురవుతున్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజక వర్గంలోని పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్ చౌరస్తా వద్ద దూరాన్ని సూచించే బోర్డుపై నాందేడ్ 331 కిలోమీటర్లు అని పేర్కొన్నారు. ఆ బోర్డుకు పది మీటర్ల దూరాన కిలోమీటరు రాయిపై అకోలా 332 కిలోమీటర్లుగా పేర్కొన్నారు. ఈ రెండింటినీ చూసి వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. నాందేడ్–అకోలా మధ్య దూరం 213.5 కిలోమీటర్లు. కానీ ఆ రెండు బోర్డులను పరిశీలిస్తే కేవలం ఒక్క కిలోమీటరు ఉన్నట్టు కనిపిస్తోంది. హైవేపై బోర్డులు ఏర్పాటు చేసిన బేగంపూర్ చౌరస్తా నుంచి నాందేడ్‌కు వాస్తవ దూరం 118.5 కిలోమీటర్లు మాత్రమే. కానీ బోర్డు మీద 331 కిలోమీటర్లంటూ పేర్కొనడం వల్ల 212.5 కిలోమీటర్లు ఎక్కువగా చూపించినట్టయింది.

–సాక్షి, కామారెడ్డి

చేతిపై కుక్క కాటును చూపిస్తున్న వీణ



కుక్కను అదుపులో ఉంచమన్నారని..

కుక్కను ఉసిగొలిపిన ఎస్పీఎఫ్ అధికారి భార్య
మహిళకు తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: ఎస్పీఎఫ్ అధికారి భార్య.. ఓ మహిళపైకి కుక్కను ఉసిగొల్పడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన బాధితురాలి కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ మల్లారెడ్డి ఎన్‌క్లేవ్‌లో రాజస్తాన్‌కు చెందిన ప్రకాశ్, వీణ కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. పక్కింట్లో ఓ ఎస్పీఎఫ్ అధికారి కుటుంబం కూడా ఉంటోంది. దంపతులు తమ కుక్కను బయటకు తీసుకొచ్చి ప్రకాశ్ ఇంటి ఎదుట మల, మూత్ర విసర్జన చేయించేవారు. చెత్తాచెదారాలు పడేసేవారు. దీనిపై వీణ.. ఎస్పీఎఫ్ అధికారి భార్యను నిలదీస్తే.. మీరు అద్దెకు ఉంటున్నారు.. సొంత ఇంటిలా మాట్లాడవద్దని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది. ఈనెల 14న అదే పరిస్థితి ఎదురవడంతో.. మరోసారి ఇలా చేయొద్దని వీణ చెబుతుండగా.. ఎస్పీఎఫ్ అధికారి భార్య కుక్క బెల్టు వదిలేసింది. దీంతో అది వీణను కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ఈనెల 16న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తీవ్ర నేరాలపై అవగాహన



సాక్షి, హైదరాబాద్: తీవ్రమైన నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్టు రాష్ట్ర కో–ఆర్డినేటర్ డి.సాయి ప్రసాద్ తెలిపారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందుకోసం డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మిస్తున్నట్లు సాయిప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. మధుసూదన్ పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీలో నారాయణ ఐఏఎస్ అకాడమీ సత్తా

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–1–2023 పరీక్షల్లో నారాయణ ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఏపీపీఎస్సీ గురువారం వెలువరించిన గ్రూప్ 1 పరీక్ష ఫలితాల్లో తమకు సంస్థకు చెందిన ముగ్గురు విద్యార్థులు యం.భానుప్రకాశ్ రెడ్డి (హెచ్‌టీ నంబర్: 280905408), కె.సాయి ప్రత్యూష (281901141), పి.సువర్ణ రెడ్డి (281402126) డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికయ్యారు. ఈమేరకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, పి.శరణినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలుగా నిలిచిన ఈ ముగ్గురు విద్యార్థులను అభినందించింది.

రైతు బంధు పక్కదారి!

చనిపోయినవారి వారసులకు ఇవ్వకుండా.. ఇతరుల ఖాతాల్లోకి సొమ్ము

- దళారులను పెట్టుకుని వ్యవసాయ శాఖ అధికారుల మాయాజాలం
- మూడేళ్లుగా లక్షల రూపాయలు స్వాహా
- నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో బయటపడ్డ బాగోతం
- మరిన్ని చోట్లా ఈ తరహా అక్రమాలు!



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బంధు పథకం సొమ్ము పక్కదారి పట్టింది. చనిపోయిన రైతులకు సంబంధించిన భూముల వివరాలను మార్చేసి, వేరేవారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము పడేలా చేసి.. మొత్తం మింగేస్తున్న వైనం బయటపడింది. వ్యవసాయ శాఖ అధికారులు సూత్రధారులుగా, కొందరు దళారులు పాత్రధారులుగా మారి.. నల్లగొండ జిల్లా చందంపేట మండలం ముడుదంట్లలో మూడేళ్లుగా 'రైతు బంధు' పథకం సొమ్మును దారి మళ్లించిన బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది.

చనిపోయారని తెలిస్తే.. ఖాతా మార్చేస్తూ..

సాధారణంగా భూములు ఎవరి పేరిట ఉంటే వారికి సంబంధించిన బ్యాంకు ఖాతాలో రైతు బంధు సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుంది. కుటుంబంలో భూమి తమ పేరిట ఉన్న వ్యక్తులు చనిపోతే.. వారసులు ఆ భూమిని తమ పేరున పట్టా చేయించుకొని, రైతు బంధుకు దరఖాస్తు చేసుకుంటారు. అధికారులు ఆ దరఖాస్తులను పరిశీలించి చనిపోయిన వ్యక్తి స్థానంలో వారసుల పేరు, బ్యాంకు ఖాతా నంబర్‌ను లింక్ చేస్తారు. దాంతో వారి ఖాతాల్లో రైతు బంధు సొమ్ము జమ అవుతుంది. కానీ చందంపేట మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు, కొందరు దళారులు కలసి అక్రమాలకు పాల్పడ్డారు. చనిపోయిన వారి భూముల వివరాలకు దళారుల బ్యాంకు ఖాతా నంబర్లను అనుసంధానం చేశారు. ఆ ఖాతాల్లో పడిన లక్షల రూపాయల సొమ్మును పంచుకున్నారు. మూడేళ్లుగా ఈ అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

అక్రమాల్లో కొన్ని..

- ముడుదండ్ల గ్రామానికి చెందిన బొజ్జ జంగమ్మ అనే మహిళ పేరిట 4.09 ఎకరాల భూమి ఉండగా, ఆమె ఖాతాలో ఏటా రెండు పంట సీజన్లకు కలిపి రూ. 45వేల మేర రైతు బంధు సొమ్ము జమ అయ్యేది. రెండేళ్ల కింద ఆమె చనిపోయింది. అప్పటినుంచి రైతుబంధు సొమ్ము ఆగిపోయింది. కుటుంబ సభ్యులు భూమిని తమపేరిట మార్చుకోలేదు, జంగమ్మ చనిపోయిన విషయం తెలిసి ప్రభుత్వమే ఆపేసిందేమో అనుకున్నారు. కానీ అనుమానం వచ్చి పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ ఆన్‌లైన్ చేసిన రికార్డుల్లో బ్యాంకు ఖాతా నంబర్ మార్చేసిన విషయం బయటపడింది. ఇన్నిరోజులుగా స్టేట్‌బ్యాంకులో 39961058007 నంబర్ ఖాతాలో సొమ్ము జమ అవుతోంది. ఈ ఖాతాదారు పేరు కిషోర్‌నందయాదవ్‌గా ఉండటం గమనార్హం.
- గ్రామానికే చెందిన పెరికేటి రాఘవాచారి పేరిట 3.13 ఎకరాల భూమి ఉంది. ఏటా వచ్చే రూ.33 వేలు ఆయన చనిపోయాక జమ అవడం ఆగిపోయాయి. కుటుంబ సభ్యులు ఆరా తీయగా.. 2022లో, అంతకు ముందు రెండుసార్లు జక్కుల అలివేలు పేరిట ఉన్న ఖాతా (ఇండియన్ పోస్టల్ బ్యాంకు అకౌంట్ నంబర్ 052710108096)లో సొమ్ము జమైనట్టు గుర్తించారు. దీంతో వారసులు భూమిని తమపేరిట మార్పించుకుని, బ్యాంకు ఖాతాను లింక్ చేయించుకున్నారు.
- ఇదే గ్రామానికి చెందిన జక్కుల రామలింగమ్మ పేరిట రెండెకరాల భూమి ఉంది. ఏటా రూ.20వేలు ఆమెకు చెందిన గ్రామీణ వికాస్ బ్యాంక్ ఖాతాలో జమయ్యేవి. ఆమె చనిపోయాక అక్రమార్కులు అకౌంట్ నంబరు మార్చేశారు. జక్కుల మున్నయ్య పేరిట ఉన్న ఎస్‌బీఐ ఖాతా (20057909146)ను లింక్ చేసి సొమ్ము కాజేశారు. అంతేకాదు బతికే ఉన్న మరో రైతుకు సంబంధించిన రైతు బంధు సొమ్మును కూడా ఇదే ఖాతాలోకి మళ్లించి స్వాహా చేసినట్టు తేలింది.
- ఈ ఒక్క గ్రామం, మండలంలోనే కాదు జిల్లావ్యాప్తంగా చాలా చోట్ల ఇలాంటి అక్రమాలు జరిగినట్టుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

విషయం బయటికి రాకుండా 'బేరసారాలు'

రైతు బంధు సొమ్మును స్వాహా చేసిన వ్యవహారం లీకవడంతో లబ్ధిదారుల కుటుంబాలతో అక్రమార్కులు సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది. అక్రమాల విషయం బయట పెట్టకుండా ఉంటే డబ్బు ఇస్తామంటూ బేరసారాలకు దిగినట్టు స్థానికులు చెప్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో నేరుగా సంబంధం ఉండి.. రైతు బంధు అర్హులను గుర్తించడం, వారి బ్యాంక్ ఖాతాలను నిర్ధారించడం వంటి పనులు చేసే మండల స్థాయి వ్యవసాయ అధికారులే ఈ అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొంటున్నారు.




వెతకాలే గానీ.. ప్రపంచంలో వింతలకు కొదవ లేదు.. ఇది కూడా దాదాపు అలాంటిదే.. చూశారుగా.. ఎక్కడైతే అస్సలు మనం ఊహించమో.. అక్కడ పాన్ షాప్ పెట్టి చూపించారు.. అవును.. ఇది పాన్‌షాపే.. ఎందుకిక్కడ పెట్టారు? అసలు ఎవరు కొంటారు? అనే వివరాల్లోకి పోతే.. ఇది చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లో ఉన్న నేషనల్ జియోలాజికల్ పార్కులో ఉంది. కరెక్టుగా భూమికి 393 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారు. ఎందుకు అంటే.. పర్వతాలు ఎక్కేవారి కోసం.. వాళ్ల కోసం ఇక్కడ కూల్ డ్రింకులు, చిప్స్ ప్యాకెట్లు లాంటి రిఫ్రెష్‌మెంట్లు ఉంటాయన్నమాట. కొండ మీద పెట్టాం కదానీ.. ధరలు మాత్రం కొండెక్కించలేదట. రెగ్యులర్ రేట్లలోనే వీటిని అమ్ముతారట. ఇందులో ఒకరే ఉంటారు. జిప్‌లైన్ల ద్వారా సామాన్లను ఇక్కడికి చేరవేస్తారు. ఈ చిత్రాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే.. ఒక్క రోజులోనే లక్షల మంది చూశారు.

సాగు సందేశం



నిజామాబాద్ జిల్లాకు చెందిన రైతు నాగుల చిన్నగంగారాం సందేశాత్మక సాగు విధానం ప్రశంసలందుకుంటోంది. గూపన్‌పల్లి వద్ద 16 గుంటల భూమిలో శివలింగం, దాని చుట్టూ సోమసూత్ర ప్రదక్షిణ విధానం ఆకారంలో వరి నాటడం విశేషం. ఇందుకోసం రైతు చిన్నగంగారాం నిపుణుల సహకారంతో మ్యాప్ గీయించుకుని అందుకనుగుణంగా నాట్లు వేయించారు. ఈ విత్తన పంటకు సంబంధించి శుక్రవారం తీసిన డ్రోన్ ఫొటోలు ఆకట్టుకుంటున్నాయి.

–సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

కూరగాయలే ఎక్కువగా తినాలి

- రోజుకు తీసుకోవాల్సింది 240 గ్రాములు...
- తీసుకుంటున్నది 145 గ్రాములే
- అంతర్జాతీయ కూరగాయల పరిశోధన కేంద్రం డైరెక్టర్ జనరల్ మార్కోవోపేరీస్



పంటలను పరిశీలిస్తున్న అంతర్జాతీయ కూరగాయల పరిశోధన సంస్థ డీజీ మార్కో వోపెరీస్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): 'ఒక మనిషి నిత్యం 240 గ్రాముల కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి..కానీ కేవలం 145 గ్రాములే తీసుకుంటున్నారని' అంతర్జాతీయ కూరగాయల పరిశోధన కేంద్రం డైరెక్టర్ జనరల్ డాక్టర్ మార్కో వోపేరీస్ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ఇక్రిశాట్‌లోని వరల్డ్ వెజిటబుల్ సెంటర్ 50వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మార్కో వోపేరీస్ విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లోనూ జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకుంటున్నారని, నిత్యం కూరగాయలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటామని చెప్పారు. ఆదాయం తక్కువగా ఉన్న ప్రజలు సైతం ఎక్కువ మాంసాహారం తీసుకుంటున్నారని, అభివృద్ధి చెందిన ఫ్రాన్స్‌లాంటి దేశాల్లో సైతం కూరగాయలు ఎక్కువగా తినడం లేదన్నారు. తైవాన్, జపాన్, వియత్నాం, కొరియాలాంటి దేశాల్లో కూరగాయలను ఆహారంగా తీసుకునేవారి ఎక్కువ అని, భారత్‌లో అయితే 145 గ్రాముల కూరగాయలను మాత్రమే ఆహారంగా తీసుకుంటున్నారని తెలిపారు.కూరగాయల సాగులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడటం వల్ల అవి తిన్నవారికి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. కూరగాయలు, పండ్లపై మరింత పరిశోధన జరగాలన్నారు. అవసరమైతే కూరగాయల నుంచి తీసిన జ్యూస్ భద్రపరచుకొని దానిని తీసుకోవచ్చన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులకు కూరగాయలు పండించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ టీకే బెహెరా, ప్రపంచ విత్తనపరిశోధన సంస్థ రీజినల్ డాక్టర్ రామ్‌నాయర్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఒక లెజెండ్

సంస్మరణ సభలో వక్తలు



నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రముఖులు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): గద్దర్ ఒక లెజెండ్.. విద్యార్థులంటే ఎనలేని ప్రేమ.. ఆయన లేనిలోటు తీర్చలేం.. అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో గురువారం జరిగిన సంస్మరణ సభలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమానికి ఓయూ ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకుడు ప్రొఫెసర్ కాశీం అధ్యక్షత వహించగా.. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, డైరెక్టర్ బి.నర్సింగరావు, ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారా యణ ముఖ్యఅతిథులుగా హాజర య్యారు. విప్లవ సందేశాన్ని ఊరూరా తీసుకెళ్లిన మొదటి గాయ కుడు గద్దర్ అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సుద్దాల అశోక్‌తేజ, జయ రాజు, అందెశ్రీ, విమలక్క, దరువు ఎల్లన్న, ఏపూరి సోమన్న, మధుప్రియ తదితరులు పాల్గొన్నారు.

బోనులో చిక్కిన మరో చిరుత..



తిరుమల: అలిపిరి–తిరుమల శేషాచలం అటవీ ప్రాంతంలోని నడక దారిలో గురువారం అర్ధరాత్రి దాటాక మరో చిరుత చిక్కింది. మూడు రోజుల క్రితమే ఓ చిరుత పట్టుబడగా.. తాజాగా గురువారం 1.30 గంటల సమయంలో మరో చిరుత బోనులో చిక్కింది. దీనిని మగ చిరుతగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మూడు రోజుల వ్యవధిలోనే రెండు చిరుతలు బోనులో చిక్కడంతో తిరుమలకు వెళ్లే భక్తులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కాగా, బంధించిన చిరుతను పరిశీలించేందుకు ఘటనా స్థలానికి గురువారం ఉదయం చేరుకున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. అటవీ శాఖ ప్రతిపాదన మేరకే.. భక్తులకు చేతి కర్రలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. చేతి కర్రలిచ్చి టీటీడీ తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందని సోషల్ మీడియాలో విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.